# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
16
కడప
మంగళవారం 29 ఆగస్టు 2017





అమ్మ పరిచయం చేసే తొలి మిత్రుడు తెలుగుదనం ఉట్టిపడే చందమామ పాటలు నేడు వినిపించవు.. కనిపించవు..


వివరాలు మధ్య పేజీలలో


## తల్లిపాల భాష..
# తెలుగుజాతి శ్వాస...
### నేడు తెలుగుభాషా దినోత్సవం

మమ్మీ, డాడి సంస్కృతితో తెలుగుపై మమకారం తగ్గుతున్నది. తెలుగు గడ్డలో తెలుగు చదవడం, రాయడం రానివారు తయారవడం బాధాకరం. ఈ విపత్కర పరిస్థితుల్లో తెలుగు భాషను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తమిళనాడు తరహాలో మాతృభాష ప్రాధాన్యతకై నడుం బిగించేలా చట్టం తేవాల్సి ఉంది. ఇందుకు తెలుగుభాషాభిమానులు నడుం బిగించాలి. కడప జిల్లాలో తెలుగుభాష పునరుద్ధరణకు విశేష కృషి జరుగుతున్నది. దేశభాషలందు తెలుగులెస్స అని కీర్తింపబడిన తెలుగుకు కడప తొలి స్థావరం కావడం జిల్లా వాసులకు గర్వకారణం. పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య, శ్రీకృష్ణదేవరాయల అష్టదిగ్గజాల్లో ఒకరైన అల్లసాని పెద్దన, సామాజిక విలువలతో తెలుగు పద్యాలు అల్లిన వేమన జిల్లా వాసులు కావడం విశేషం

## జిల్లా తెలుగుదేశం శ్రేణుల్లో
# నంద్యాల ఆనందం



- జిల్లా వ్యాప్తంగా సంబరాలు
- పలుచోట్ల బైక్ ర్యాలీలు
- భారీగా బాణాసంచా పేలుళ్లు



కడపలో తెలుగుదేశం శ్రేణుల సంబరాలు

నంద్యాల ఉపఎన్నిక ఫలితం సోమవారం వెలువడింది. టీవీలో ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ విజయం దాదాపు ఖరారని నిర్ణయానికి రాగానే జిల్లావ్యాప్తంగా తెలుగు తమ్ముళ్ల సంబరాలు అంబరాన్నంటుకున్నాయి. పలుచోట్ల బైక్‌ర్యాలీలు నిర్వహించి భారీగా బాణాసంచా పేలుస్తూ నృత్యాలు చేస్తూ చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు.


6లో




ఎంపీ సీఎం రమేష్‌కు స్వీట్ తినిపిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు, చిత్రంలో మంత్రులు లోకేష్, సోమిరెడ్డి, అచ్చెన్నాయుడు తదితరులు

నంద్యాల ఫలితమే జిల్లాలో పునరావృతం: ఎంపీ రమేష్

జగన్ చెప్పినట్టు ధర్మమే గెలిచింది: శ్రీనివాసరెడ్డి

అభివృద్ధి, సంక్షేమం ఘన విజయం సాధించింది: విప్ మేడా

## గండికోట పరిహారం పంపిణీలో అక్రమాలపై
# ప్రభుత్వానికి నివేదిక

గండికోట పునరావాస పరిహారం పప్పుబెల్లాల్లా పంచేశారు. నిబంధనలు పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా పరిహారం పంపిణీకి ఒడిగట్టారు. కోట్ల రూపాయల పరిహారం నిధులు పక్కదారి పట్టాయి. ముంపు బాధితుల కోసం ప్రభుత్వం కొన్ని వెసులుబాటులు కల్పిస్తే వాటిలో చేతివాటం ప్రదర్శించారు. ప్రభుత్వం గండికోటలో నీరు వుంచేందుకు సంకల్పించి బాధితులకు పరిహారం వెనువెంటనే మంజూరు చేస్తే అది పక్కదారి పట్టడంపై జిల్లా కలెక్టర్ బాబూరావునాయుడు సీరియస్ అయి విచారణ చేయించారు. ఈ విచారణ నివేదిక రెండురోజుల క్రితం ప్రభుత్వానికి పంపారు.


6లో



అనుబంధం - 2
నివేశన స్థలం అప్పగింత పట్టా

నివేశన స్థలం పట్టా నమూనా

## ట్యాంపరింగ్‌కు వీల్లేని
# నివేశన స్థలం పట్టా


6లో


- నేటి నుంచి లబ్ధిదారులకు పంపిణీ
- అనుబంధం - 2 నమూనా చూపించిన కలెక్టర్

అర్హులైన పేద బలహీన బడుగు వర్గాలకు ప్రభుత్వ భూమిని ఇంటి స్థలంగా కేటాయిస్తూ ట్యాంపర్ ప్రూఫ్‌తో కూడిన పట్టాను లబ్ధిదారులకు మంగళవారం నుంచి అందించేందుకు జిల్లా కలెక్టర్ బాబూరావునాయుడు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం స్థానిక కలెక్టర్‌లోని మీ కోసం హాలులో కొత్తగా రూపొందించిన నివేశనా స్థలం అప్పగింత పట్టా (అనుబంధం - 2) నమూనాను అధికారులకు కలెక్టర్ చూపించారు.

# క్రీడలకు ప్రోత్సాహం ఏదీ..!

- క్రీడాకారులకు అందుతున్న ప్రోత్సాహం అంతంతమాత్రమే
- ఆశించిన స్థాయిలో పతకాలు సాధించలేని క్రీడాకారులు
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం

**కడప, స్పోర్ట్స్ :** దేశ జనాభా 130 కోట్లు దాటినా ఇప్పటికీ మనదేశం క్రీడల్లో సాధిస్తున్న పతకాలు అరకొర మాత్రమే. మనకన్నా తక్కువ జనాభా వున్న దేశాలు సైతం ఎక్కువ పతకాలు సాధిస్తున్నాయి. మరి మన దేశంలో ఎందుకు పతకాలు ఆశాజనకంగా లేవని ప్రభుత్వాలు ప్రశ్నించుకోవాలి. ఆశించిన మేర నిధుల కేటాయింపు, అకాడమీలు కానీ వాటికి కావాల్సిన మౌలిక వసతులు లేకపోవడంతో రాణించలేకపోయారనే వాదన ఎక్కువగా ఉంది. ఈ పరిస్థితుల్లో క్రీడాకారులు రాణించగలరా ? కేవలం జాతీయ దినోత్సవాన్ని మాత్రం ఘనంగా జరిపినంత మాత్రాన పతకాలు వస్తాయా..రాజకీయాలకు ఉన్నంత ప్రోత్సాహం క్రీడలకు అందించినప్పుడు ధ్యాన్‌చంద్, సింధు, కోహ్లి లాంటి క్రీడాకారులు తయారవుతారు. ఇప్పటికైనా క్రీడలకు పెద్దపీట వేయాలని ఆశిద్దాం. భారత హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని భారత ప్రభుత్వం ప్రతి ఏడాది జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఆగస్టు 29న నిర్వహిస్తుంది. ప్రతిష్టాత్మకమైన ఒలింపిక్స్‌లో హాకీ విభాగంలో మనదేశం వరుసగా మూడుసార్లు బంగారు పతకం సాధించడంలో ధ్యాన్‌చంద్ కీలకపాత్ర. అందుకే ఆయన జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్నారు. దేశం, రాష్ట్రంలో జిల్లాలో క్రీడలకు పెద్దపీట వేస్తున్న మన నాయకులు ఏమాత్రం అమలు చేస్తారు. సాక్షాత్తు పులివెందులలో గల హాకీ అకాడమీ అర్ధాంతరంగా ఆగిపోవడం, రాజంపేటలో ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి అయినప్పటికీ నిర్వహణ లోపం, జిల్లాలో క్రీడా పాఠశాలలోని వసతులు చూస్తుంటే జిల్లాలో క్రీడల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లుంది. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని కొందరు క్రీడాప్రముఖులను ఆంధ్రజ్యోతి పలకరించగా..



### మరువలేని పేరు ధ్యాన్‌చంద్



ప్రతి క్రీడాకారుడు మరువలేని పేరు ధ్యాన్‌చంద్. ఆయన ఆయువుగా ఆడిన క్రీడ హాకీ. హాకీలో భారత్ తరపున ఢిల్లీలోని కోలా ఇండియన్ నేషనల్ హాకీ అకాడమీకి గోల్‌కీపర్‌గా ఎంపిక కావడం సంతోషంగా వుంది.

*- కె.రమ్య, క్రీడా పాఠశాల క్రీడాకారిణి*

### ఒలింపిక్స్‌తో క్రీడలకు గుర్తింపు



మిగిలిన క్రీడలతో పోలిస్తే ఒలింపిక్స్‌లోని క్రీడలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రస్తుతం ఒలింపిక్స్‌లో చాలా క్రీడలు ఉన్నాయి. ఒలింపిక్స్ లేని క్రీడలను కూడా అందులో చేర్చేందుకు కృషి చేస్తాను.

*- తోటక్రిష్ణ, జిల్లా ఒలింపిక్ అడ్‌హక్ కమిటీ చైర్మన్*

### క్రీడలను అభివృద్ధి చేస్తాం



ధ్యాన్‌చంద్ హాకీ క్రీడాకారుడు అయినప్పటికీ ఆయన జయంతిని జాతీయ క్రీడాదినంగా నిర్వహిస్తున్నాము. ఆయన స్ఫూర్తితో జిల్లాలోని అన్ని రకాల క్రీడలను అభివృద్ధికి అందరినీ కలుపుకొని ముందుకు పోతాము.

*- ఉమాశంకర్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి*

### గర్వపడుతున్నా



జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఒక హాకీ క్రీడాకారుడి జయంతిని పురస్కరించుకొని జరుపుతున్నారు. నేను హాకీ క్రీడాకారుడినైనందుకు గర్విస్తున్నాను.

*- టి.ధనుష్, రాష్ట్ర హాకీ గోల్‌కీపర్*

### క్రమశిక్షణతో నడవాలి



ప్రతి క్రీడాకారుడు క్రమశిక్షణతో నడుచుకొని కోచ్‌ల సూచనలు పాటిస్తే ఏ క్రీడలోనైనా రాణించగలరు. దీనిని గ్రహించిన వారు ప్రత్యేక స్థానాన్ని నిలుపుకుంటారు.

*- నటరాజరావు, క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి*

### దేవాలయంగా భావించాలి



ఆటలను దైవంగా, ఆటస్థలాన్ని దేవాలయంగా భావించిన ప్రతి క్రీడాకారుడు తను ఎంచుకున్న క్రీడలో రాణించగలడు. అందుకే ధ్యాన్‌చంద్ చరిత్రలో నిలిచిపోయారు.

*- ఎల్.వెంకటలక్ష్మీ, వ్యాయామ ఉపాధ్యాయురాలు*

### ఆయన ఒక బ్రాండ్



దేశంలో క్రీడలపై అవగాహన లేని సమయంలో హాకీలో ఒలింపిక్స్‌లో వరుసగా మూడుసార్లు దేశానికి బంగారు పతకం సాధించి ప్రపంచానికి మన దేశ క్రీడా సత్తాను చాటిన ఆయన జీవితం నేటి తరం క్రీడాకారులకు ఒక బ్రాండ్ అని చెప్పవచ్చు.

*- జి.శ్రీలత, జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి*

### దైవంగా భావించాలి



క్రీడలను, క్రీడా మైదానాలను దైవంగా భావించినప్పుడు ప్రతి క్రీడాకారుడు దేశం గర్వించదగ్గ క్రీడాకారుడిగా తయారవుతారు. రాబోయే రోజుల్లో జిల్లాలో హాకీ క్రీడను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాను.

*- షేక్ సుబాన్‌బాష, జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి*

### దేశ క్రీడ హాకీకి మంచి ఆదరణ వుంది



మన దేశ క్రీడ హాకీకి గతంలో వర్తమానంలో మంచి ఆదరణ ఉంది. భవిష్యత్‌లో కూడా మంచి ఆదరణ లభిస్తుంది. ఒక హాకీ కోచ్‌గా చాలా సంతోషంగా పనిచేస్తున్నాను.

*- ఖాదర్ మొయినుద్దీన్‌ఖాన్, హాకీ కోచ్*

కొనసాగుతున్న దీపం పథకం

## కనెక్షన్ల జారీ ప్రక్రియ

విజయరాణి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి






**కడప, కోటిరెడ్డిసర్కిల్**

జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్లకు సంబంధించి దీపం పథకం కింద విస్తృతంగా ప్రచారం కల్పించి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి కనెక్షన్లు జారీ చేసే ప్రక్రియ కొనసాగుతోందని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి విజయరాణి తెలిపారు. శాఖాపరమైన పలు అంశాలను 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించారు.

**ప్రశ్న:** దీపం పథకం కింద ఎన్ని రిజిస్ట్రేషన్లు జరిగాయి..?

**జవాబు:** 2015 జనవరి నుంచి ఇప్పటి వరకు 2,09,134 మంది కనెక్షన్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

**ప్రశ్న:** ఎంతమందికి గ్యాస్ కనెక్షన్ ఇచ్చారు?

**జవాబు:** ఇంతవరకు 1,15,717 మందికి ఆయా గ్యాస్ ఏజెన్సీల ద్వారా గ్యాస్ కనెక్షన్ అందించాం. మిగిలిన వారికి కూడా కనెక్షన్ జారీ ప్రక్రియ కొనసాగుతోంది.

**ప్రశ్న:** పాఠశాలలకు, అంగన్‌వాడీలకు కొత్తగా గ్యాస్ కనెక్షన్‌లు అందిస్తున్నారా..?

**జవాబు:** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకానికి గాను 1765, అంగన్‌వాడీ కేంద్రాలకు 1677 గ్యాస్ కనెక్షన్లు అందించనున్నాం.

**ప్రశ్న:** జిల్లాలో ఎన్ని రేషన్ కార్డులు ఉన్నాయి..?

**జవాబు:** పేద, బడుగు, బలహీనవర్గాల కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు 7,61,579 కార్డులు మంజూరు చేసింది.

**ప్రశ్న:** కార్డులు ఉండి రేషన్ పొందలేని వారి పరిస్థితి ఏమిటి..?

**జవాబు:** కొత్తగా కార్డులు పొందిన వారికి సంబంధించి ఆన్‌లైన్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యల కారణంగా జాప్యం జరిగింది. వాటిని క్లియర్ చేశాం.

**ప్రశ్న:** ఎన్ని కార్డుల సమస్యను పరిష్కరించారు. వాటికి ఎప్పటి నుంచి రేషన్ అందిస్తున్నారు..?

**జవాబు:** 2300 కార్డులపై తలెత్తిన సాంకేతిక సమస్యను పరిష్కరించాం. వీటికి సెప్టెంబరు నుంచి రేషన్ అందుతుంది.



## నేషనల్ మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

**కడప లీగల్ :** నేషనల్ మెగా లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించుకొని తద్వారా సత్వర న్యాయం పొందవచ్చని డీఎల్‌ఎస్‌ఏ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం జడ్జి చాంబర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 9న జరిగే నేషనల్ మెగా లోక్ అదాలత్ విజయవంతానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా కక్షిదారులకు సత్వర న్యాయసేవలందించాలనే లక్ష్యంతో సుప్రీంకోర్టు నేషనల్ మెగా లోక్ అదాలత్‌లను దేశమంతటా నిర్వహిస్తూ వ్యక్తుల మధ్య తగాదాలను రాజీ మార్గం ద్వారా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఇలాంటి ప్రాముఖ్యత కలిగిన లోక్‌అదాలత్ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహించడం జరుగుతోందన్నారు. 2017 జూలై నెలలో జరిగిన లోక్ అదాలత్‌లో 1724 కేసులను పరిష్కరించి రాష్ట్రంలో ఆరవ స్థానంలో నిలిచామన్నారు. అలాగే సెప్టెంబరులో జరిగే లోక్ అదాలత్‌లో 2000కు పైగా కేసులను పరిష్కరించి జిల్లాను మంచి స్థానంలో నిలిపేందుకు శ్రమిస్తున్నామన్నారు. ఇక్కడ పరిష్కారం అయిన కేసు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమైందన్నారు. తిరిగి అప్పీల్‌కు వెళ్లడానికి వీలుపడదన్నారు. ల్యాండ్ అక్విజేషన్, భూతగాదాలు, టెలిఫోన్ బిల్లులు, నీటి పన్నులు, ఇంటిపన్నులు, యాక్సిడెంట్ కేసులు, భార్యాభర్తల తగాదాలకు సంబంధించిన తదితర కేసులను, ఫారెస్టు కేసులను తదితర వాటిని పరిష్కరించుకోవచ్చన్నారు. పైగా అధిక శ్రమ, ఖర్చులతో కూడిన పని ఉండదన్నారు. లోక్‌అదాలత్ పరిధిలోకి రాని కేసులంటూ ఏవీ లేవన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులను కూడా కాంపౌండబుల్ అఫెన్స్ చేయవచ్చన్నారు. ఈమేరకు లోక్ అదాలత్‌కు వచ్చే కేసులకు సంబంధించి జిల్లాలోని ఆయా కోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీస్, రెవెన్యూ, ఫారెస్టు, మున్సిపాలిటీ, ఎక్సైజ్, టెలిఫోన్, ఇన్సూరెన్స్, ఎలక్ట్రికల్ సంబంధిత అధికారులతో సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. లోక్ అదాలత్ ప్రాముఖ్యతను అటు సంబంధిత శాఖల అధికారులు, ఇటు కక్షిదారులు గమనించి వారి పరిధిలోని కేసులను లోక్ అదాలత్‌కు తీసుకొచ్చి రాజీ మార్గంలో పరిష్కరించుకుని జిల్లాలో స్నేహపూరిత వాతావరణానికి దోహదపడాలన్నారు. సమావేశంలో డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి ప్రసాద్, పర్మనెంట్ లోక్ అదాలత్ యుటిలిటీ ఆఫీసర్ విష్ణుప్రసాద్ రెడ్డి, మొదటి అదనపు జిల్లా జడ్జి వి.వి.శ్రీనివాస్ మూర్తి, పలువురు జడ్జిలు పాల్గొన్నారు.

# వనరులను ఉపయోగించి అరటి సాగు

## అరటి ఎగుమతులకు అనువైన ప్రాంతాలు గుర్తింపు

## నాబార్డు కన్సల్టెంట్ సర్వీస్ ప్రతినిధులు

**పులివెందలు టౌన్:** తక్కువ ఖర్చుతో ఉన్న వనరులను వినియోగించి అరటిని ఇతర ప్రాంతాలకు ఎగుమతులు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని నాబార్డు కన్సల్టెంట్ సర్వీస్ ప్రతినిధులు శుభం, శిల్పా పేర్కొన్నారు. సోమవారం జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ డీడీ ప్రసాద్, ఏడీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ మధుసూదన్‌రెడ్డి కలిసి పులివెందులలోని మార్కెటింగ్ శాఖ గోడౌన్, ఏపీకార్ల్‌లోని మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల నుంచి ఇతర ప్రాంతాలకు అరటి ఎగుమతులకు సంబంధించి అనువైన ప్రాంతాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే పులివెందుల ప్రాంత అరటి, చీనీకి మంచి పేరు ఉందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉన్న మౌలిక వసతులను వినియోగించి అరటి గెలలు, చీప్‌లు కటింగ్, క్లీనింగ్, గ్రేడింగ్, ప్యాకింగ్, శీతల గిడ్డంగులు ఏర్పాటు చేసి ఇతర



మార్కెటింగ్ శాఖ గోడౌన్ పరిశీలిస్తున్న నాబార్డు కన్సల్టెంట్ ప్రతినిదులు, జిల్లా అధికారులు

ప్రాంతాలకు ఎగుమతులు చేసేందుకు అనువైన ప్రాంతాలను పరిశీలన చేస్తున్నామన్నారు. జిల్లాలో రాయచోటిలో మామిడి, పులివెందులలో అరటి, రైల్వేకోడూరు సమీపంలోని శెట్టిగుంట వద్ద అన్ని రకాల పండ్లు ఇతర ప్రాంతాలకు ఎగుమతులు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఉద్యాన అధికారి రాఘవేంద్రరెడ్డి, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో విద్యుత్ ఉద్యోగి మృతి



ప్రమాద స్థలంలో రోదిస్తున్న మృతుడు భార్య నాగేశ్వరి, మృతిచెందిన రామారావు

**లింగాల:** ఇప్పట్ల వద్ద భారతి పాలిమర్స్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బండి రామారావు (56) విద్యుత్ ఉద్యోగి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల్లోకెళితే...

రామారావు చిన్నకుడాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం విధులకు వెళ్తుండగా పార్నపల్లె నుంచి ఎపి02 టీఈ 2204 ఐషర్ వాహనం ఢీకొట్టింది. దీంతో రామారావు తన ద్విచక్రవాహనం నుంచి రోడ్డుపై పడ్డాడు. ద్విచక్రవాహనాన్ని ఐషర్ దాదాపు 20 మీటర్ల వరకు ఈడ్చుకెళ్లింది. రామారావు రోడ్డుపై పడడంతో తల బద్దలై మెదడు ఎగిరి పడింది. సమాచారం తెలుసుకున్న లింగాల ఏఎస్‌ఐ విష్ణుకుమార్ రెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మృతదేహాన్ని పులివెందుల ఆస్పత్రికి తరలించారు.

మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించా రు. రామారావు మృతితో విద్యుత్ డీఈ, ఏఈ, సిబ్బంది పెద్దఎత్తున ఆస్పత్రికి చేరుకున్నారు. మృతునికి భార్యనాగేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

## ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని అదృశ్యం

**వేంపల్లె:** ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని అదృశ్యమైంది. ఆదివారం మధ్యాహ్నం నుంచి క్యాంపస్‌లో కనిపించకుండా పోయింది. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ పరిపాలనా అధికారి అమరేంద్రకుమార్ సంద్ర సోమవారం ఆర్కేవ్యాలీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పీయూసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. గాలించి ఆచూకీ తెలపాలని కోరారు. దీనిపై ఆర్కేవ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

## మృతుల ఆచూకీ తెలిపితే పారితోషికం : సీఐ

**దువ్వూరు:** ఇటీవల హత్యకు గురైన ముగ్గురు మృతుల వివరాలు తెలిపితే పారితోషికం అందిస్తామని మైదుకూరు రూరల్ సీఐ హనుమంతనాయక్ ప్రకటించారు. సోమవారం దువ్వూరు పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 26.4.2017లో దువ్వూరు మండలం ఐ.బయనపల్లె సమీపంలో కేసీ కెనాల్ జెర్రి వంకలో 40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురయ్యారన్నారు. 29.6.2016 ఖాజీపేట మండలం దుంపలగట్టు సమీపంలోని వంతె వద్ద 32 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురయ్యాడు. 17.11.2016 ఖాజీపేట మండలం ఆంజనేయపురం వంతెన సమీపంలో 40 ఏళ్లున్న గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురయ్యారన్నారు. ఇప్పటి వరకు దర్యాప్తులో ఎలాంటి ఆధారాలు లభించలేదని, హత్యకు గురైన వారి వివరాలు, కారణాలు సమాచారాన్ని పోలీసులకు అందిస్తే ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికి రూ.25 వేలు పారితోషికం అందిస్తామన్నారు. మైదుకూరు రూరల్ పరిధిలోని దువ్వూరు, ఖాజీపేట మండలాల స్టేషన్లకు సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో దువ్వూరు ఎస్‌ఐ విద్యాసాగర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

**పులివెందుల టౌన్:** జయమ్మ కాలనీకి చెందిన చిన్నకొట్ట మోహన్ (28) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ గోపీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జయమ్మకాలనీ వాసి మోహన్ తండ్రి మందలించాడన్న నెపంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఆదివారం రాత్రి మోహన్ మద్యం తాగి ఇంటికి వచ్చి భార్య లక్ష్మీదేవిని కొట్టాడు. దీంతో భార్య లక్ష్మిదేవి మోహన్ తండ్రి గంగులయ్య వద్దకెళ్లి పరిస్థితిని వివరించింది. దీంతో ఆయన మోహన్‌ను మందలించాడు.



మోహన్ మృతదేహం

దీంతో మోహన్ ఆత్మహత్య చేసుకున్నారని ఎస్‌ఐ తెలిపారు. మృతునికి మూడేళ్ల వయస్సున్న కవల పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## వేధింపులు తట్టుకోలేక

### వివాహిత ఆత్మహత్య



వసుంధర మృతదేహం

**కడప, క్రైం:** వరకట్న వేధింపులు తట్టుకోలేక సోమవారం వసుంధర (22) ఆత్మహత్యకు పాల్పడినట్లు రిమ్స్ సీఐ మోహన్‌ప్రసాద్ తెలిపారు. ఆయన అందించిన వివరాల్లోకెళితే... చెన్నూరు మండలం నజీర్‌బేగ్ పల్లె వాసి వసుంధరను పుట్లంపల్లికి చెందిన కల్యాణ్‌కుమార్‌కు ఐదేళ్ల కిందట పెద్దల సమక్షంలో వివాహం చేశారు. కొన్ని నెలలుగా భర్త కల్యాణ్ అత్తమామలు అధిక కట్నం కోసం ఆమెను వేధించేవారు. వసుంధరపై వేధింపులు ఎక్కువ కావడంతో ఆమె మనస్తాపం చెంది సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతురాలి సోదరుడు ఫిర్యాదు మేరకు భర్త, అత్తమామలపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఖాతా నుంచి లక్ష రూపాయలు చోరీ

**నందలూరు:** బ్యాంకుల్లో సొమ్ము భద్రంగా ఉంటుందని సాధారణ మధ్య తరగతి కుటుంబీకులు బ్యాంకుల్లో భద్రపరుచుకుంటారు. ఇటీవల పెరిగి టెక్నాలజీతో బ్యాంకు ఖాతాలోని డబ్బును ఎవరో, ఎక్కడినుంచో డ్రా చేయడం తెలుసుకున్న ఖాతాదారులు ఉలిక్కిపడుతున్నారు. సైబర్‌నేరగాళ్ల చేతివాటంతో గాంధీనగర్ వాసి లక్ష రూపాయలు ఖాతా నుంచి మాయం చేశారు. వివరాల్లోకెళితే నాగిరెడ్డిపల్లె పంచాయితీ గాంధీనగర్ వాసి సోల్లేటి శ్రీకాంత్ ఎస్‌బీఐ ఖాతాదారుడు. అతని ఖాతా నుంచి రూ.1,01,700లు ఖాతాదారునికి తెలియకుండానే గుర్తు తెలియని వ్యక్తులు డ్రా చేశారని ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డికి, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్‌కు ఫిర్యాదు చేసిన సంఘటన చోటు చేసుకుంది. 7వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఫ్లిప్‌కార్టు, ఫాస్టుటికెట్టు పద్ధతిలో రూ.1,01,700 డ్రా చేసినట్లు బాధితుడు శ్రీకాంత్ వాపోయాడు. తల్లిదండ్రులు కూలీ నాలీ చేసి తన చదువు నిమిత్తం దాచుకున్న డబ్బు ఒక్క సారిగా పోవడంతో తన చదువు, కుటుంబం రోడ్డుపాలైందని ఆవేదన చెందుతున్నాడు. అధికారులు స్పందించి సైబరు నేరగాళ్ళను గుర్తించి తమకు న్యాయం చేయాలని కోరారు.

## మిగులు సీట్లకు నేడు కౌన్సెలింగ్

**వేంపల్లె:** మండలంలోని ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్‌ఐటీల్లో సూపర్‌న్యూమరీ కింద మిగిలిన 71 సీట్లకు 29వ తేదీ మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డైరెక్టర్లు భగవన్నారాయణ, బసవరావు తెలిపారు. ట్రిపుల్‌ఐటీ అతిథి భవనంలో ఉదయం నుంచి కౌన్సెలింగ్ ఉంటుందని ఇప్పటికే ఎంపిక చేసిన వారికి సమాచారం పంపామన్నారు. ప్రత్యేక టీంల ద్వారా కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలుశిక్ష

**కడప, క్రైం:** మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఏడుగురికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి సోమవారం తీర్పునిచ్చినట్లు కడప ట్రాఫిక్ డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు. కడపకు చెందిన మౌలాలి, దయానంద్, మహ్మద్‌గౌస్, రాజు, నారాయణరెడ్డి, బహదూర్, సునీల్ మద్యం మత్తులో వాహనాలు నడపడంతో కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. వీరికి జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు తెలిపారు.

## పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం

**సుండుపల్లె:** వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని సుండుపల్లె ప్రాథమిక వైద్యాధికారిణి సమీర తెలిపారు. సోమవారం చిన్నగొల్లపల్లె, పెద్దగొల్లపల్లెల్లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 56 మందికి వైద్య చికిత్సలతో పాటు మందులు పంపిణీ చేశారు. అనంతరం పరిసరాలను పరిశీలించి అబెట్, వేస్ట్‌ఆయిల్‌ను చల్లించి దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ శివారెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొని వైద్యసేవలు అందజేశారు.

# రాజంపేట ప్రభుత్వాస్పత్రికి నీటి కష్టాలు

● రెండు నెలలుగా నీటి సరఫరా బంద్‌తో రోగుల పాట్లు ● మరుగుదొడ్లకు తాళం.. పేషెంట్ల వార్డులు ఖాళీ ● అత్యవసర ఆపరేషన్‌లకు తిప్పలు ● పట్టించుకోని ఆసుపత్రి ఉన్నత వర్గాలు

<u>రాజంపేట</u>

జిల్లాలో కడప, ప్రొద్దుటూరు తరువాత అతి పెద్ద ఆసుపత్రిగా అనాది కాలం నుంచి రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిని పిలుచుకుంటూ ఉంటారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆసుపత్రి ఎప్పటి నుంచో కోడూరు, రాజంపేట నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తోంది. ఇంతటి చరిత్ర కలిగిన ధర్మాసుపత్రి నేడు 50పడకల ఆసుపత్రిగా ఉంటూ ప్రతి నెలా స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలు జరుగుతున్నా అందరికీ అత్యవసరమైన తాగునీటి బంద్‌ను పట్టించుకోకపోవడం శోచనీయం. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఉన్నా వారంలో రెండు రోజులైనా చైర్మన్ వచ్చి చూస్తున్నా చైర్మన్ మాట ఇక్కడ ఆసుపత్రి డాక్టర్లకు, ప్రధానంగా సూపరింటెండెంట్‌కు ఏమాత్రం లెక్కాపత్రం లేదు. ఈ ఆసుపత్రిలో ప్రస్తుతం ఆధునిక భవన నిర్మాణం జరుగుతోంది. నిర్మాణ సమయంలో ఏ సాంకేతిక లోపం వచ్చిందో కానీ తాగునీటి మోటారు పనిచేయలేదు. రెండు నెలల నుంచి ఈ మోటారు స్టార్టర్ పోయిందని, ఇతరత్రా లోపాలు ఉన్నాయని మరమ్మతులు చేయకుండానే నిలిపివేశారు. ఈ


నీరు లేకపోవడంతో బాత్రూంలకు వేసిన తాళం


ఆసుపత్రిలో రెండు నెలలుగా చెడిపోయిన మోటారు

విషయంపై 20రోజుల కిందట ఆసుపత్రి కమిటీ చైర్మన్ వడ్డె రమణ సూపరింటెండెంట్ తో మాట్లాడి వెంటనే ఈ మోటారును రిపేరు చేయించి నీరందించాలని కోరినా పట్టించుకునే వారు లేరు. ఈ నీటి ని భవన నిర్మాణ కాంట్రాక్టర్ వాడాడని, వారు వాడిన సమయంలో మోటారు చెడిపోయిందని, వారే ఈ మో టారును రిపేరు చేయించాలని ఆసుపత్రి సూపరింటెం డెంట్ పేర్కొనడంతో సమస్య జఠిలమైంది. ప్రతి గంటా ఇక్కడ నీరు లేనిదే పనిజరగదు. ఈ ఆసుపత్రిలో అనేక ఎమర్జన్సీ వార్డులు ఉన్నాయి. నీరు లేకపోతే ఈ పనీ జరగదు. ప్రధానంగా ప్రతి నెలా 100ఆపరేషన్‌లుఇక్కడ జరుగుతుంటాయి. ప్రతి నిత్యం మూడు కాన్పులకు తక్కు వ లేకుండా జరుగుతుంటాయి. వారానికి మూడు రోజులు ప్రతి రోజూ కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేసు కుంటుంటారు. ప్రధానంగా పురుషులకు ఒక వార్డు, మహిళలకు ఒక వార్డు, ఆపరేషన్‌థియేటర్, ఓపీ విభాగం, పోస్టుమార్టం రూము, లెప్రసీ, యునానీ, ఆయుర్వేదిక్, హోమియోపతి, హెచ్‌ఐవీ ఎయిడ్స్ విభాగాలు ఉన్నాయి. అతి ప్రధానమైన విభాగం రక్తపరీక్షల విభాగం. ఇక్కడ రక్తపరీక్షలు చేయించుకోవాలంటే యూరిన్ టెస్టు లు కూడా చేయించుకోవాలి. యూరిన్ టెస్ట్ చేయించు కోవాలంటే బాత్రూంలో నీరుండాలి. ఇక


నీరు లేక ఒక్క పేషంటు కూడా లేకుండా ఖాళీ అయిపోయిన వార్డు

కాన్పుల వార్డులో ఒక మహిళ కాన్పు జరగాలంటే ఎంత నీరు అవసరమో తెలియంది కాదు. అయితే అక్కడి డాక్టర్ కృషి వల్ల భవన నిర్మాణానికి ఉపయోగిస్తున్న మరో మోటారు ద్వారా వేరే పైపు తగిలించి ఆ డాక్టర్ కాన్పులు చేయిస్తున్నారు. కొంత మంది ఏఎన్‌ఎంలు, అటెండర్లు పైపులు తెచ్చి ట్యాంకులు నింపుకొని అక్కడ ఆపరేషన్‌లుచేసే పరిస్థితి. ఇక ప్రధానంగా రోగులు ఎక్కువ అనారోగ్యానికి గురైతే ఇక్కడ చేరుతారు. వారు వారంరోజుల పాటు ఉంటారు. ఇటు పురుషులకు, అటు మహిళలకు రెండు వార్డులు ఉన్నా యి. బాత్రూంలలో నీరు లేకపోవడంతో వాటిని లాక్ చేశారు. ఆసుపత్రిలో చేరిన రోగులకు బాత్రూంలు లేకపోవడంతో కొందరు ఆ వార్డుల బయటే మలమూత్ర విసర్జన చేయడం వల్ల ఆసుపత్రి అంతా కంపుకొడుతుం ది. ఈకంపును భరించలేక, ఈ వైద్యం మాకొద్దు దేవుడా.. అంటూ వార్డుల్లో చేరే వారే లేకుండా పోయారు. ప్రతి రోజూ 200 నుంచి 300 మంది అవుట్‌పేషంట్లు వచ్చి వైద్యం చేయించుకుంటుంటారు. ప్రతి నిత్యంతీవ్రంగా అనారోగ్యమైన వారు 20మందికి తక్కువ లేకుండా ఆసుపత్రిలో చేరుతుంటారు. కొందరు సిబ్బంది డ్రమ్ములతో నీరు నింపి అత్యవసర సేవలకు వాడుకుంటున్నా అవి ఏమాత్రం ప్రయోజనం చేకూరడం లేదు. 10మంది డాక్టర్లు, 10మంది స్టాఫ్‌నర్సులు అనేక మంది టెక్నీషియన్‌లు, 10మంది పైబడి ల్యాబ్‌టెక్నీషియన్‌లు, అనేక మంది అటెండర్లు, స్వీపర్లు ఇలా 50మంది పైబడి ఇక్కడ పనిచేస్తున్నారు. ఇటువంటి పెద్ద ఆసుపత్రిలో కేవలం 30వేల రూపాయలు ఖర్చు చేసే కొత్త మోటారు బిగించవచ్చు. ఒక గంట నీరు లేకపోతే అన్ని విభాగాలు ఇబ్బందుల పాలవుతాయి. అత్యవసర సేవలు అటు కాన్పులకు, ఇటు ఆపరేషన్‌లకు చాలా ఇబ్బందులు ఎదరవుతాయి. రక్తపరీక్షలకు చాలా ఇబ్బందికర పరిస్థితి. ఇన్ని తెలిసికూడా ఒక మోటారు వేయించడంలో చూపుతున్ననిర్లక్ష్య వైఖరితో వందలాది మంది చాలా ఇబ్బంది పడుతున్నారు. ఆసుపత్రిలో అభివృద్ధి పనులు చేయడానికి 15లక్షల రూపాయల వరకు సొమ్ము ఉన్నట్లు తెలుస్తోంది. అంత సొమ్ము ఉన్నా కేవలం 30వేలు ఖర్చు చేయలేని పరిస్థితిలో ఆసు పత్రి ఉందంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. ఈ విషయమై ఎమ్మెల్యే స్పందించినా, ఆర్డీవో హెచ్చ రించినా, కమిటీ చైర్మన్ ఆదేశాలు ఇచ్చినా ఎవరికి వారే.. యమునా తీరే అన్న రీతిలో వ్యవహరిస్తూ ధర్మాసుపత్రిని అధర్మాసుపత్రిగా మార్చి ఇక్కడికి పేదలను వైద్యం చేయించుకోనివ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


దిక్కుతోచని స్థితిలో ఉన్న రోగులు

## ఉపాధి హామీ రికార్డులు తనిఖీ

**పెనగలూరు :** ఉపాధి హామీ పథకంలో ఈ ఆర్థిక సంవత్సరంలో చేసిన పనుల రికార్డులను ఏపీవో ఉమామహేశ్వర్‌రావు ఏపీడీ వరప్రసాద్‌రావు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్షేత్రసహాయకులు చేస్తున్న పనులను అడిగి తెలుసుకున్నారు. ఇదిఇలా ఉండగా ఉపాధి హామీలో చేసిన పనులను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలన్నారు.

### సినిమా గైడ్

**రాజంపేట**

సమద్ :వివేకం
సుదర్శన్ :నేనే రాజు నేనే మంత్రి
పీవై : ఫిదా
బీఎస్: ఆనందోబ్రహ్మ
ఎన్ఎస్ఆర్: జయజానకి నాయక

# పోరాటంతోనే విజయం సాధ్యం-ఎంపీ



సమావేశంలో మాటాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, హాజరైన నియోజకవర్గ స్థాయి వైసీపీ నాయకులు, కార్యకర్తలు

**రాజంపేట :** పోరాటంతోనే విజయం దక్కుతుందని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. సోమవారం రాజంపేట సిటి కళ్యాణ మండపంలో వైసీపీ జిల్లా కన్వీనర్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేలా, 2019 ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల ముందు చెప్పిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని, అనునిత్యం అబద్దాలు, మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెట్టేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కన్వీనర్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ పాలనలో మద్యం ఏరులై పారుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదా.. అన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయా లన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, పట్టణ కన్వీనర్ పోలా శ్రీనివాసులరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్ రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నారాయణరాజుకు గిడుగు పురస్కారం


నారాయణరాజుకు సత్కరిస్తున్న దృశ్యం

**రాజంపేట టౌన్ :** తెలుగు భాష కోసం విశేష కృషి చేస్తున్న కవి, రచయిత రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు పండిట్ బాలరాజు నారాయణరాజుకు మాతృభాష దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర కథా నిలయం అధ్యక్షుడు అబ్బిగారి రాజేంద్రప్రసాద్ గిడుగు భాషా పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఇసుకపల్లె యు.పి.పాఠశాలలో హెచ్‌ఎం కె.చంద్రశేఖర్ అధ్యక్షతన సరస్వతి పురం ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాషకు గొడుగు లాంటి వారు గిడుగు అని అన్నారు. సీఆర్‌పి గురురాజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నంద్యాలలో టీడీపీ గెలుపుపై సంబరాలు



రాజంపేటలో లాయర్ జానీకి స్వీట్‌ను తినిపిస్తున్న ఏజీపీ లక్ష్మీనారాయణ



సుండుపల్లెలో విక్టరీని చూపిస్తూ సంబరాల్లో టీడీపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీవాణి, నాయకులు



రాజంపేటలో ఎన్టీఆర్‌కు క్షీరాభిషేకం చేస్తున్న టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు



నంద్యాల గెలుపుపై బాణా సంచా పేలుస్తూ సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

**రాజంపేట :** నంద్యాల ఉప ఎన్నికలలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి ఘన విజయం సాధించడంపై రాజంపేటలో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ముందుగా ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద భారీ బాణా సంచా పేల్చి అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సీఎం చంద్రబాబునాయుడు చేసే అభివృద్ధికి నంద్యాల ప్రజలు పట్టం కట్టారన్నారు. టీడీపీ వెనుక ప్రజలున్నారన్నది ఈ విషయంతో తేటతెల్లమైందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు గుగ్గిళ్ళ చంద్రమౌళి, ఇడిమడకల కుమార్, డాక్టర్ చెన్నూరు సుధాకర్ ఆచారి, మనబోలు వెంకటేశ్వర్లు, మీసాల వెంకటసుబ్బయ్య, టీడీపీ పట్టణాధ్యక్షులు సంజీవరావు, నగరం విశ్వనాధాచారి, మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, వర్ధిబోయిన సుధాకర్‌బాబు, ముమ్మిడి చిన్నయ్య, ప్రభాకర్, సుబ్రమణ్యం, కృష్ణయ్యనాయుడు, శంకరాచారి, చలపతి, రాంనగర్ నరసింహ, రామచంద్రయ్యఆచారి, నాగినేని నాగేశ్వరనాయుడు, దివాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం

టీడీపీ మండల యూత్ అధ్యక్షుడు జె.పాండురాజు ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాజంపేట ఎమ్మెల్యే, విప్ మేడా మల్లికార్జునరెడ్డి నంద్యాల ఎన్నికల్లో చురుగ్గాపాల్గొని విజయంలో తనవంతు కృషి చేయడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కొమ్మూరు సుబ్బనరసయ్య, రెడ్డిశేఖర్, భీమరాజు, శ్రీనివాసులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో..

నంద్యాలలో టీడీపీ అభ్యర్థి ఘన విజయం సాధించడంపై సీఎం నారా చంద్రబాబునాయుడునుఅభినందిస్తూ జిల్లా లీగల్ సెల్ మాజీ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు, మహిళలకు, వృద్ధులకు, వితంతువులకు, విద్యార్థులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు కులాల్లోని ఆర్థికంగా వెనుక బడిన వర్గాలకు ఏర్పాటు చేసిన సంక్షేమ ఫలితాల్లో భాగంగానే విజయం సాధ్యమైందన్నారు. అనంతరం న్యాయవాదులుఒ కరికొకరు కేకును తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాదులు నిజాంజానీ, రంపాటి ప్రభాకర్‌రావు, కె.వి.రమణ, జాఫర్, ఆలీ, నాగరాజు గుప్త, రామచంద్రనాయుడు, మహబూబ్‌బాషా, షమీ, షఫీ, నరసింహులు, చంద్రశేఖర్, రమేష్, సురేష్‌రాజు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే నంద్యాలలో మంత్రి భూమా అఖిల్‌ప్రియను, గెలుపొందిన భూమా బ్రహ్మానందరెడ్డిని మైనారిటీ నాయకులు షేక్ ఇషాక్ తదితరులు కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

### టీడీపీ గెలుపుపై విజయోత్సవ ర్యాలీ

**వీరబల్లి:** నంద్యాల ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీకి అత్యధిక మెజార్టీ రావడం పట్ల సానిపాయి పంచాయతీ టీడీపీ నాయకుడు సీతారామరాజు ఆధ్వర్యంలో బైకులతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలో ప్రజలకు సమాన న్యాయం జరుగుతున్నదని అందువల్లే ప్రజలు టీడీపీకి పట్టం కట్టారని తెలిపారు. ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డి నంద్యాలలో టీడీపీ గెలుపుకోసం అహర్నిశలు కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సానిపాయి టీడీపీ నేతలు, అభిమానులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా తీర్పుతోనైనా వైసీపీకి కనువిప్పు కావాలి

**సుండుపల్లె:** నంద్యాల ప్రజలు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమి బ్రహ్మానందరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి వారి విజ్ఞతను చాటుకున్నారని దీంతో నైనా వైసీపీకి కనువిప్పు కలగాలని టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మల్లెల శ్రీవాణి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమల రెడ్డి శివారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అరాచకం, అశాంతి సృష్టించడం జగన్ నైజమని, అందుకే నంద్యాలలో ప్రజలు వైసీపీని తిరస్కరించారని తెలిపారు. 2019 ఎన్నికల్లో కూడా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి నంద్యాల గెలుపు దర్పణం పడుతోందని తెలిపారు. రాష్ట్రం లోటుబడ్జెట్‌లో ఉన్నా ఎంతో కష్టపడి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న మహానాయకుడు సీఎం చంద్రబాబునాయుడును నోటుకొచ్చినట్లు తిట్టడం సమంజసం కాదన్నారు. నంద్యాల అభివృద్ధే ధ్యేయంగా భూమా కుటుంబం కష్టపడుతుందని, ఇందుకు నిదర్శనమే ఈ గెలుపని తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు శివారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి అప్పగించిన బాధ్యతలను నంద్యాల ఎన్నికల్లో బాగా పనిచేసి మంచి మెజార్టీ సాధించేలా కష్టపడ్డారని తెలిపారు. కార్యక్రమంలో చిన్నగొల్లపల్లె టీడీపీ అధ్యక్షుడు రామచంద్ర, నాయకులు శివరాంనాయుడు, వెంకట్రమణ, షంషుల్లాఖాన్, జయరాంనాయుడు పాల్గొన్నారు.

### 2019లోను ముఖ్యమంత్రి చంద్రబాబే..

**నందలూరు :** నంద్యాల ఉప ఎన్నికల్లో ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధి పనులను చూసి పెద్ద మెజారిటీతో తెలుగుదేశం పార్టీని గెలిపించారని 2019లోనూ కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడేనని జడ్పీటీసీ సభ్యుడు శివరామరాజు, టీడీపీ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎద్దల విజయసాగర్, మండల అధ్యక్షుడు లక్ష్మీనరసయ్య, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సమ్మెట శివప్రసాద్‌లు పేర్కొన్నారు. సోమవారం నంద్యాల ఉప ఎన్నికలలో టీడీపీ 27,456ఓట్ల మెజారిటీతో గెలుపొందడంతో మండల ముఖ్య కేంద్రంలోని నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట మండల నాయకులు, కార్యకర్తలు బాణా సంచా పేలుస్తూ స్వీట్లు తినిపించుకుంటు తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షుడు తుంటి రమణయ్య, నాగిరెడ్డిపల్లె నగర్ అధ్యక్షుడు శివ, టీడీపీ నాయకులు బెస్త సుబ్రమణ్యం, హెచ్‌డీ ప్రసాద్, శివశంకర్, నవాబ్‌జాన్, గౌస్‌పీర్, ఎంపీటీసీ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల గెలుపు 2019ఎన్నికలకు నాంది

**రాజంపేట :** నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి భారీ మెజారిటీతో గెలుపు 2019ఎన్నికలకు నాంది అని టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా రేవూరి వేణుగోపాల్ పేర్కొన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి భారీ మెజారిటీతో గెలుపొందడంతో టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రాజంపేటలోని ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద ఎన్‌టీఆర్, నారా చంద్రబాబులు, నారాలోకేష్‌లకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాలలో 13రోజులు కాళ్ళకు బలపం కట్టుకొని ప్రచారం చేసినా ఓట్లు పడలేదన్నారు. కార్యక్రమంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ మండల అధ్యక్షులు పోలి శివకృష్ణ, పోలి శివకుమార్, వంశీ, నవీన్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

## లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న జడ్జిలు సత్యవాణి, ఫైజున్నీస

**రాజంపేట టౌన్ :** లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవచ్చని మూడవ జిల్లా అదనపు జడ్జి సత్యవాణి పేర్కొన్నారు. సోమవారం రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి ఫైజున్నీస ఆధ్వర్యంలో న్యాయవాదులు, పోలీసులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాజంపేట డీఎస్పీ రాజేంద్ర, సీఐ మురళీనాయక్, ఎస్‌ఐలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జిలు మాట్లాడుతూ సెప్టెంబర్ 9వ తేదీన లోక్‌అదాలత్ రాజంపేట కోర్టులో నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమని, ఏళ్ళతరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా కక్షిదారులు లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలన్నారు. ఇందుకు పోలీసులు చొరవ తీసుకోవాని వారు సూచించారు. కార్యక్రమంలో ఏజీపీ లక్ష్మీనారాయణ, ఏపీపీ వెంకటస్వామి, న్యాయవాదులు వి.వి.రమణ, శ్రీనివాసులు, కోర్టు సిబ్బంది హరిప్రియ, చెన్నకేశవులు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## సీపీఎస్ విధానం రద్దు చేయండి

**వీరబల్లి:** సీపీఎస్ విధానం రద్దు చేయాలని ఎస్టీయూ వీరబల్లి మండల నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో సీపీఎస్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు రఘు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి విష్ణు వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నిరంతరం ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కుటుంబ పెన్షన్లు రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశ కలిగించారన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి, శేఖర్, శివారెడ్డి పాల్గొన్నారు.

# కడప దేశంలో నంద్యాల ఆనందం

### నంద్యాల ఫలితమే జిల్లాలో పునరావృతం

**- సీఎంరమేష్, రాజ్యసభ సభ్యుడు**



అసభ్య పదజాలం వాడుతూ భయభ్రాంతులకు గురిచేసే వారిని ప్రజలు ఎప్పటికీ నమ్మరు. మంచి నాయకుడు ఎవరని బేరీజు వేసుకొని అటువంటి వ్యక్తి నాయకత్వాన్ని బరుస్తారు. నంద్యాల ఓటర్లు ఇలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు పనితీరు, కార్యదీక్షకు పట్టంకట్టారు. జగన్ ఎన్ని కుయుక్తులు పన్నినా అక్కడి ఓటర్లు పటిష్ట నాయకత్వ లక్షణాలు వున్న చంద్రబాబు పక్షాన నిలబడ్డారు. అభివృద్ధి, సంక్షేమానికి బ్రహ్మరథం పట్టారు. నంద్యాల ఫలితమే రానున్న ఎన్నికలలో కడప జిల్లాలో పునరావృతం కానున్నాయి.

### జగన్ చెప్పినట్లు ధర్మమే గెలిచింది

**ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు**



ప్రతిపక్ష నేత జగన్ చెప్పినట్లు నంద్యాలలో ధర్మమే గెలిచింది. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో చేసి చూపిస్తున్న సీఎం చంద్రబాబు నాయకత్వాన్ని నంద్యాల ఓటర్లు బలపరచి అఖండ మెజారిటీ చేకూర్చారు. అసభ్యపదజాలం, జుగుప్సాకర వ్యవహారశైలి వున్న జగన్‌ను ఆయన పార్టీని నంద్యాల ఓటర్లు ఛీత్కరించారు. డేరా బాబా లాంటి జగన్‌బాబా చెంతకు తమ పిల్లలను వెళ్లనీయకుండా తల్లిదండ్రులు జాగ్రత్తపడాలి. లేదంటే వారి జీవితాలు అగమ్యగోచరమవుతాయి. 2019 ఎన్నికలకు నంద్యాల ఉప ఎన్నిక రెఫరెండమని ప్రకటించుకున్న జగన్ ఫలితం చూసి తన దుకాణం మూసివేసుకుంటే మంచిది. లేదంటే ఆ పని ప్రజలే చేస్తారు.

### అభివృద్ధి, సంక్షేమం ఘనవిజయం సాధించింది

**- మేడా మల్లికార్జునరెడ్డి, ప్రభుత్వ విప్**



ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ ఫలాలు నంద్యాలలో టీడీపీకి ఘనవిజయాన్ని చేకూర్చాయి. తల్లిదండ్రులు లేని పిల్లలను నంద్యాల ఓటర్లు ఆశీర్వదించి అభివృద్ధికి పట్టం కట్టారు. కాకినాడ ఎన్నికలలోను ఇలాంటి ఫలితాలే వస్తాయి. 2019 ఎన్నికలలో తెలుగుదేశం ఘనవిజయం సాధిస్తుంది. ఇరవై ఏళ్లకు పైగా చంద్రబాబే ముఖ్యమంత్రిగా వుంటారు. ఈ మేర రాష్ట్రప్రజలు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు.

**కడప, సెవెన్‌రోడ్స్**

నంద్యాల ఉపఎన్నిక ఫలితం సోమవారం వెలువడింది. టీవీలో ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ విజయం దాదాపు ఖరారని నిర్ణయానికి రాగానే జిల్లావ్యాప్తంగా తెలుగు తమ్ముళ్ల సంబరాలు అంబరాన్నంటుకున్నాయి. పలుచోట్ల బైక్‌ర్యాలీలు నిర్వహించి భారీగా బాణాసంచా పేలుస్తూ నృత్యాలు చేస్తూ చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. కడపలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా బాణాసంచా పేల్చి 2 వేల లడ్లను పంచిపెట్టారు. గోవర్ధన్‌రెడ్డి సహ టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.హరిప్రసాద్,టీడీపీ నేతలు సుబాన్‌బాష, పీరయ్య తదితరులు నృత్యాలు చేశారు. పులివెందులలోని పూల అంగళ్ల వద్ద నుంచి టీడీపీ పట్టణ అధ్యక్షుడు బాష, మాజీమార్కెట్ కమిటీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డిల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. వేంపల్లి నాలుగురోడ్ల కూడలిలో టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చారు. ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో తన కార్యాలయం వద్ద బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. మైదుకూరులో మున్సిపల్ చైర్మన్ రంగసింహ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్, పార్టీ నాయకుడు బాబుల ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చారు. స్వీట్లు పంచిపెట్టారు. జమ్మలమడుగులో మంత్రి ఆదినారాయణరెడ్డి అనుచరులు పెద్దఎత్తున బాణాసంచా పేల్చి ఆదినారాయణరెడ్డి జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. రాయచోటిలో టీడీపీ నేత ప్రసాద్‌బాబు తన కార్యాలయం వద్ద శ్రేణులతో కలిసి బాణాసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు మల్లెల శ్రీవాణి, ప్రధాన కార్యదర్శి సుజాత, ఎన్ఆర్ఐ విభాగం అధ్యక్షుడు సాకీర్‌ల ఆధ్వర్యంలో ఠాణా వద్ద భారీ ఎత్తున బాణాసంచా పేల్చి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. రాయచోటి పట్టణంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గాజుల ఖాదర్‌బాష ఆధ్వర్యంలో ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. రామాపురం మండలంలో టీడీపీ నేత శేఖర్, మార్కెట్‌కమిటీ చైర్మన్ రమేష్‌రెడ్డి, ఎల్ఆర్‌పల్లెలో మాజీమార్కెట్ కమిటీ అధ్యక్షుడు కె.ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలిలో బాణాసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. రాజంపేటలో ప్రధాన నాయకులు లేకపోయినా పార్టీ కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేష్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కోడూరు, నందలూరులో జెండాలు చేతపట్టి ర్యాలీ నిర్వహించి టీడీపీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కమలాపురం నియోజకవర్గంలో వల్లూరు పార్టీ మండల కన్వీనర్ నాగేశ్వరరెడ్డి, పెండ్లిమర్రి మండల కన్వీనర్ గంగిరెడ్డిల ఆధ్వర్యంలో పెద్దఎత్తున బాణాసంచా పేల్చారు. బద్వేల్ నాలుగురోడ్ల కూడలిలో ఎమ్మెల్యే జయరాములు పార్టీ శ్రేణులతో కలిసి బాణాసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు.



నంద్యాలలో టీడీపీ విజయంతో కడపలో దేశం శ్రేణుల సంబరాలు



రైల్వేకోడూరులో దేశం శ్రేణుల విజయోత్సవం



### గండికోట అక్రమాలపై
# ప్రభుత్వానికి నివేదిక

- ఇక చర్యలే తరువాయి
- వెలుగులోకి కోట్ల రూపాయల అక్రమాలు
- అక్రమార్కులపై చర్యలతో సొమ్ము రికవరీకి చర్యలు

**కడప, ఆంధ్రజ్యోతి**

గండికోట పరిహారం పంపిణీలో అక్రమాలపై ప్రభుత్వానికి పంపిన నివేదికలో కోట్ల రూపాయల నిధులు పక్కదారి పట్టినట్లు పేర్కొన్నట్లు సమాచారం. ఈ నివేదికను కలెక్టర్ ప్రభుత్వానికి పంపించారు. అక్రమాలకు కారకులైన వారి వివరాలను కూడా నివేదికలో పొందుపరచినట్లు తెలుస్తోంది. ముంపు పరిహారం కోసం రూ.490 కోట్లకు పైగా ప్రభుత్వం నిధులు మంజూరుచేస్తే ఇందులో రూ.20 కోట్లకు పైగానే పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు, అఫిడవిట్లు సమర్పించడం, బాధితులుకాని వారికి చెక్కులు మంజూరు చేయడం, విద్యార్థుల పేరుతో తప్పుడు సర్టిఫికెట్లు సృష్టించి పరిహారం పొందడం లాంటి కేసులు అనేకం వున్నట్లు తెలుస్తోంది. జేసీ-2 నేతృత్వంలో జరిగిన ఈ విచారణలో వెల్లడైన అవినీతి అక్రమాలపై సమగ్రంగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించడంతో ఇక ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఇప్పటికే ఈ వ్యవహారంలో అక్కడ పనిచేసే ఆర్డీవోను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఇంకెందరికి గండికోట పరిహారం ఉచ్చు బిగిస్తుందోనన్న ఆందోళన పలువురిలో తప్పడం లేదు.

### తప్పుడు పత్రాలు సృష్టించి

గండికోట పరిహారం పంపిణీలో అఫిడవిట్లకు సంబంధించి పలు అక్రమాలు వెలుగు చూసినట్లు సమాచారం. వివాహమైన ఆడపిల్లలకు పరిహారం వర్తించేందుకు ప్రభుత్వం కొంత వెసులుబాటును కల్పించింది. దీంతో అలాంటి వారి ఇంటి పేర్లు మార్చుకోవాల్సిన అవసరం వుంటుంది. దీంతో పాటు మృతి చెందినవారికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, పుట్టిన తేదీల్లో తేడాలు వుంటే సరిదిద్దుకోవడం ఇలాంటి వాటికి అఫిడవిట్లు సమర్పించాల్సి వుంటుంది. ఈ అఫిడవిట్లకు తప్పనిసరిగా నోటరీ సంతకం వుండాల్సి వుంటుంది. అయితే ఈ అఫిడవిట్లను సమర్పించడంలో అక్రమాలు చోటుచేసుకోవడం ద్వారా కూడా పరిహారం పంపిణీకి కాళ్లొచ్చినట్లు అధికారులు గుర్తించారని తెలుస్తోంది. విద్యార్థులకు సంబంధించి సుమారు వంద మంది వరకు పరిహారం పంపిణీ చేసినట్లు విచారణ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఒకరి పరిహారం మరొకరి సంతకాలతో పంపిణీ చేయడం లాంటి పలు అక్రమాలు వెలుగు చూసినట్లు నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. గండికోట పునరావాసానికి సంబంధించి సుమారు 900 కేసులు వుంటే ఇందులో 180 వరకు ప్రాజెక్టెడ్ జాబితా కింద వున్నాయి. ఈ పరిహారం పంపిణీలో ఎక్కువ శాతం అవకతవకలు, అక్రమాలకు పాల్పడినట్లు కూడా అధికారుల దృష్టికి వచ్చినట్లు సమాచారం.

### చర్యలే తరువాయి

గండికోట పరిహారంలో అక్రమాలపై ప్రభుత్వానికి నివేదిక చేరింది. ఇక ప్రభుత్వం దీనిపై చర్యలు చేపట్టనుంది. పరిహారం అక్రమార్గంలో పొందిన వారి నుంచి రికవరీకి ఆదేశించే అవకాశాలు వున్నాయి. అంతేకాదు పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు చేసే పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. అధికారులుగా వుండి అక్రమాలకు పాల్పడ్డవారి పైన కూడా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టే అవకాశాలు వున్నాయి. ఏది ఏమైనా గండికోట పరిహారంలో పెద్దఎత్తున జరిగిన అక్రమాల నివేదిక ప్రభుత్వానికి చేరడంతో అవినీతి, అక్రమార్కుల్లో దడ మొదలైంది.

# ఆంగ్లభాషపై పట్టు సాధించాలి

**నందలూరు**

ప్రతి విద్యార్థి హైస్కూల్ స్థాయి నుంచే ఆంగ్లభాషపై పట్టుసాధించి తమ ఉజ్వల భవిష్యత్తుకు మంచి పునాది ఏర్పాటు చేసుకోవాలని రాయచోటి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎం.వి.కృష్ణమూర్తి పేర్కొన్నారు. సుమారు నాడు స్థానిక నందలూరు హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు ఏర్పాటుచేసిన ఇంగ్లీషు డిజిటల్ ల్యాబ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ జిల్లాలో ఇంగ్లీషు ల్యాబ్ నందలూరులో ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీమతి రమాదేవి అధ్యక్షతన జరిగింది. ఉపాధ్యాయులు రౌఫ్‌బాషా, రామిరెడ్డి, శివవరప్రసాద్, జయచంద్ర, ఐజయ్య, జైరాం, అరుణ, సరోజిని, పుణ్యావతి, వసంతకుమారి, రామానుజమ్మ, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా గణేష్ నిమజ్జనవేడుకలు

మండలంలో వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ ప్రతిమలను సోమవారం పలు చోట్ల నిమజ్జనాలకు బయలుదేరాయి. నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీపరిధిలో గాంధీనగర్, పంచాయతీ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసినవినాయకుని ప్రతిమలను బాణాసంచా పేలుస్తూ, మేళతాళాల మధ్య నిమజ్జనం నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమంలో భాగంగా అన్నదానం ఏర్పాటు చేశారు

# ట్యాంపరింగ్‌కు వీల్లేని నివేశన స్థలం పట్టా

**కడప, కోటిరెడ్డిసర్కిల్**

అర్హులైన పేద బలహీన బడుగు వర్గాలకు ప్రభుత్వ భూమిని ఇంటి స్థలంగా కేటాయిస్తూ ట్యాంపర్ ప్రూఫ్‌తో కూడిన పట్టాను లబ్ధిదారులకు మంగళవారం నుంచి అందించేందుకు జిల్లా కలెక్టర్ బాబూరావునాయుడు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం స్థానిక కలెక్టర్‌లోని మీ కోసం హాలులో కొత్తగా రూపొందించిన నివేశనా స్థలం అప్పగింత పట్టా (అనుబంధం - 2) నమూనాను అధికారులకు కలెక్టర్ చూపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంత మంది ఆక్రమణదారులు డూప్లికేట్ పట్టాలను సృష్టించి పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే విషయం రెవెన్యూ అధికార యంత్రాగం దృష్టికి వస్తోందని అన్నారు. ఇలాంటి సమస్యకు సాంకేతిపరమైన పరిష్కారం ఉండాలనే దృక్పథంతో ట్యాంపరింగ్ ప్రూఫ్ పట్టాను తయారు చేయించామన్నారు. కొత్తగా తయారు చేసిన ఈ నివేశనా స్థలం అప్పగింత పట్టాలో ఆరు ప్రత్యేకమైన సెక్యూరిటీ లక్షణాలు కలిగి ఉన్నట్లు చెప్పారు. ఇందులో హోలోగ్రాం, బార్‌కోడింగ్ మాత్రం కనుబడతాయన్నారు. మిగిలిన నాలుగు ఫీచర్లు అంతర్గతంగా ఉంటాయన్నారు. దీనివల్ల ఎలాంటి ట్యాంపరింగ్ చేయడానికి ఆస్కారం ఉండదన్నారు. ఈ పట్టా జిరాక్స్ చేసి దానిని ఒరిజినల్ అని చెప్పడానికి వీలు లేదన్నారు. ఇకపై ఇంటి స్థలాల పంపిణీకి సంబంధిత తహసీల్దార్లు తయారు చేసిన లబ్ధిదారుల జాబితాను కలెక్టర్‌కు పంపి వాటిని ఆమోదం పొందిన తరువాతనే పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. వెనుకటి తేదీలు వేసి తప్పుడు జాబితాలు పంపితే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జేసీ -2 శివారెడ్డి, ప్రత్యేక కలెక్టర్ నాగేశ్వర్‌రావు, డీఆర్వో నరసింహారావు, డీఆర్‌డీఏ పీడీ రామచంద్రారెడ్డి , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పరిహారం ఇవ్వనిదే పనులు జరగనివ్వం

## సోలార్ పనులను అడ్డుకున్న తూముకుంట గ్రామ రైతులు

**గాలివీడు:** మేము భూమాతను నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. తరతరాలుగా భూములను సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. సంవత్సరంలో లక్షల్లో ఆదాయాన్ని గడిస్తున్నాం. ఇలాంటి భూములను మా గ్రామంలో సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ముందుకు వస్తే గ్రామ రైతులందరం వెనుకా ముందు ఆలోచించకుండా భూములు ఇవ్వడానికి ముందుకు వచ్చాం. అయితే భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందజేయడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదని తూముకుంట గ్రామానికి చెందిన సోలార్ బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భూములకు సంబంధించిన నష్టపరిహారం ఇవ్వకుండా సోలార్ పనులను చేస్తే ప్రాణాలైనా అర్పిస్తాం, పరిహారం ఇవ్వనిదే పనులు జరగనివ్వమంటూ సోమవారం 300 మంది రైతులు సోలార్ పనులను అడ్డుకుని తన నిరసనను వ్యక్తం చేశారు. మండలంలోని వెలిగల్లు, తూముకుంట పంచాయతీల్లో 500 మెగా వాట్లతో విద్యుత్ ఉత్పత్తికి అవసరమగు 5 వేల ఎకరాల భూమిని అధికారులు భూసేకరణ చేశారు. ఇందులో కొంత ప్రభుత్వ భూమి, పాత పట్టా, డీకేటీ, చుక్కల పట్టా, ఎలాంటి ఆధారాలు లేని అనుభవ భూమి ఉంది. పాత పట్టాకు ఎకరాకు రూ.3 లక్షలు, డీకేటీకి రూ.2.64 లక్షలు, అనుభవంలో ఉన్న భూమికి రూ.లక్ష చొప్పున ప్రభుత్వం రైతులకు అందజేయడానికి ముందుకు వచ్చింది. అయితే పాత పట్టాకు సంబంధించి రైతులకు నష్టపరిహారాన్ని అందించారే కానీ డీకేటీ భూమికి సంబంధించిన నష్టపరిహారాన్ని ఇంతవరకు అందజేయలేదు. తూముకుంట గ్రామంతో పాటు మండలంలోని ఇతర గ్రామాలకు చెందిన దాదాపు 200 మందికి ఆ ప్రాంతంలో డీకేటీ పట్టాలు ఉన్నాయి. అందులో కేవలం 24 మందికి మాత్రమే నష్టపరిహారాన్ని అందజేశారు. ఇది అందజేసి కూడా రెండు నెలలు గడుస్తున్నా మిగతా వారికి నష్టపరిహారం అందజేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. నష్టపరిహారాన్ని అందించకుండానే గత నెల రోజులుగా సోలార్ నిర్వహణ అధికారులు తమ భూముల్లో పనులు ప్రారంభించారని రైతులు పేర్కొన్నారు. గత నెల రోజులుగా పనులు చేయవద్దని సోలార్ నిర్వాహకులకు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ వారు మా విజ్ఞప్తిని పెడచెవిన పెట్టి యధావిధిగా మేము సాగు చేసుకుంటున్న భూముల్లో పనులు చేస్తుండడంతో విధిలేని పరిస్థితుల్లో గ్రామ రైతులందరం కలిసి కట్టుగా మొత్తం సోలార్ పవర్‌ప్లాంట్‌లో జరుగుతున్న పనులన్నింటినీ అడ్డుకుంటున్నామని పేర్కొన్నారు. అధికారులు స్పందించి తమకు రావాల్సిన నష్టపరిహారాన్ని అందించాలని లేకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని ముక్త కంఠంతో చెప్పారు.



సోలార్ పనులను అడ్డుకున్న తూముకుంట రైతులు

### త్వరలోనే నష్టపరిహారం అందజేస్తాం

ఆర్డీవో చిన్నరాముడు

రైతులందరికీ త్వరలోనే నష్టపరిహారాన్ని అందజేస్తామని కడప ఆర్డీవో చిన్నరాముడు తెలిపారు. తూముకుంట పంచాయతీలో జరుగుతున్న సోలార్ పనులను ఆ గ్రామ ప్రజలు అడ్డుకున్న విషయాన్ని తెలుసుకున్న ఆర్డీవో హుటాహుటిన తూముకుంటకు చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. మీకందరికీ త్వరలోనే నష్టపరిహారం అందజేస్తామని తెలియజేసినప్పటికీ రైతులు వినలేదు. నష్టపరిహారం అందించిన తరువాతనే పనులను ప్రారంభించాలని రైతులు ఆర్డీవోకు స్పష్టం చేశారు.


### భూమి మొత్తం తీసుకున్నారు



నాకు 4.65 ఎకరాలు భూమి ఉంది. మొత్తం భూమంతా సోలార్ పవర్‌ప్లాంట్‌లోకి వెళుతోంది. రెండు సంవత్సరాలుగా భూమి నష్టపరిహారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఇంతవరకు నష్టపరిహారం అందలేదు. అయితే ఇంతలోనే నా భూమిలో సోలార్ పనులను ప్రారంభించారు. నేను ఇంక ఎవరికి చెప్పుకోవాలి. నష్టపరిహారం ఇవ్వపోతే పనులు జరగనివ్వం.

*రజాక్‌వలీ, రైతు, తూముకుంట*

### కుటుంబ పోషణ ఎలా...



నాకు పది ఎకరాల భూమి ఉంది. మొత్తం భూమి సోలార్ నిర్మాణం వల్ల కోల్పోతున్నాను. ఈ భూమి వెళ్లిపోతే కుటుంబ పోషణ బరువవుతుంది. అయినప్పటికీ నాకు రావాల్సిన నష్టపరిహారం అందజేస్తే భూమిని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను. అయితే ఇంతవరకు నష్టపరిహారం ఇవ్వలేదు. ఇప్పటికైనా అధికారులు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

*- బోడెప్ప, తూముకుంట*

# జర్నలిస్టులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**కడప, ఐటీఐసర్కిల్ :** ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడులకు పాల్పడుతున్న వారిపై నాన్‌బెయిల్ బుల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇటీవల కాలంలో చెన్నూరు గ్రామంలో అల్లరిమూకలు సాక్షి, ఈనాడు దినపత్రికల విలేకరుల నివాస గృహాలపై దాడి చేసి ఆ విలేకర్లను తీవ్రంగా గాయపరిచిన సంఘటనను నిరసిస్తూ సోమవారం ఏపీయూడబ్ల్యుజే ఆధ్వర్యంలో నగరంలోని స్టేట్ గెస్ట్‌హౌస్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ గేట్ వద్ద ఏపీయూడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ చెన్నూరు మండలంలో పనిచేస్తున్న విలేకరులపై అల్లరిమూకలు దాడులు చేయడాన్ని తామ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమాజంలోని ప్రతిపక్షాలు, పాలకపక్షాలు, ఇతరులు తమ అక్కసును పాత్రికేయుల మీద దాడుల రూపంలో వెళ్లగక్కుతున్నారన్నారు. ఎవరికైనా మీడియా విధానాలు నచ్చని ఎడల చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని సూచిస్తున్నా దౌర్జన్యాలకు పాల్పడటం ఆవేదన కలిగిస్తుందన్నారు. ఈ పద్ధతులు పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తున్నాయని, ఫలితంగా పాత్రికేయులు మనోధైర్యం కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వం దాడుల నివారణకు కమిటీ వేసినా కమిటీ కార్యకలాపాలు కాగితాలకే పరిమితం అవుతున్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కమిటీని పునరుద్ధరించి క్రియాశీలంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పాత్రికేయులు వృత్తిలో ధైర్యంగా విధులు నిర్వహించాలంటే ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు జరిగినపుడు నమోదు చేసే నాన్‌బెయిల్‌బుల్ కేసును పాత్రికేయులపై దాడులు చేసిన వారిపై నమోదు చేసేలా ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. చెన్నూరు సంఘటనలో స్థానిక ఎస్ఐ అల్లరిమూకలను రెచ్చగొట్టడం వల్లే ఈ దాడులు జరిగాయని, అందుకు కారకుడైన ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ బాబూరావునాయుడు, ఎస్పీ అట్టాడ బాబూజీని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో జర్నలిస్టు నేతలు రామాంజులరెడ్డి, సూరిబాబు, ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి శివరాం, సాక్షి బ్యూరో నగేష్, ఈనాడు స్టాఫ్ రిపోర్టర్ సురేష్, ఎలక్ట్రానిక్ మీడియా స్టాఫ్ రిపోర్టర్లు శ్రీనివాసులు, రవి, నాగరాజు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రం అందచేస్తున్న ఏపీయూడబ్ల్యుజే నాయకులు





## అమృతభాష

అక్షరాల పూతోటలో
తెలుగోడు తోటమాలియై
అక్షరాలకు సొగస్సులద్ది
తెలుగుతల్లిని తేనె పలుకులతో
తనివితీరా అభిషేకించుటకై
తెలుగందాలను తోరణాలుగా కట్టి
తెలుగునాట వెలుగులు
నింపుతుండగా...
తీరుమారునా తెలుగుభాష
తరాలు మారి తీరాలు దాటిన
అన్యభాషలు ఎన్ని ఉన్నా
అమ్మ ఒడిన నేర్చిన
అమృతభాషకు వన్నెతగ్గునా.
పదాలు ఎన్ని ఉన్నా
పెదాలు అలసిపోవునా !
పిలిచేకొద్ది.. పలికేకొద్ది
మమకారం పెరిగే
మన తెలుగుభాషలో..

**గొంటుముక్కల గోవింద్.**
**ఆంగ్ల ఉపాధ్యాయుడు,**
**జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల**
**ఉపాధ్యాయుడు - గోపవరం**

### తెలుగుభాషాభివృద్ధికి మరిన్ని నిధులు విడుదల చేయాలి

**మూల మల్లిఖార్జునరెడ్డి, బ్రౌన్ శాస్త్రీ భాషా పరిశోధన కేంద్రం సభ్యుడు**



మాతృభాష తెలుగు రాష్ట్రంలో నిరాదరణకు గురవుతోంది. ప్రభుత్వం నిధులు కేటాయించి భాషపరిశోధనను ప్రోత్సాహించాలి. కడప తెలుగు భాషకు పుట్టినిల్లు. తెలుగుసూర్యుడు సీపీ బ్రౌన్ ఆంగ్లేయుడైనా తెలుగుభాషకు విశేష కృషి చేశాడు. ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడం బాధాకరం. ఇప్పటికైనా ప్రభుత్వం తెలుగు భాషపట్ల సానుకూల ధోరణితో భాషా పరిరక్షణకు ప్రయత్నించాలి. సీపీ బ్రౌన్ పరిశోధనా కేంద్రం, వైవీ విశ్వవిద్యాలయం ద్వారా తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నాం. ప్రతివారం సాహిత్యగోష్ఠులు నిర్వహించి కవులను ప్రోత్సహిస్తూ సన్మాన సత్కారాలు చేపడుతున్నాం.

తెలుగు

మా తెలుగుతల్లికి
మల్లెపూదండ
మా కన్నతల్లికి
మంగళారతులు



# తెలుగుభాషకు పుట్టినిల్లు కడప

## నేడు తెలుగుభాషా దినోత్సవం

దేశభాషలందు తెలుగులెస్స అని కీర్తింపబడిన తెలుగుకు కడప తొలి స్థావరం కావడం జిల్లా వాసులకు గర్వకారణం క్రీస్తుశకం 575లో రేచర్ల ధనంజయ వేయించిన తొలి తెలుగు శాసనం 'కలమల్ల' శాసనం శ్రీకృష్ణదేవరాయ ఆస్థానంలోని అష్టదిగ్గజాల్లో ప్రఖ్యాతుడైన అల్లసాని పెద్దన కడపవాడే. పద కవితలతో వైకుంఠమూర్తిని కీర్తించిన అన్నమయ్య మన జిల్లావాసే. తాత్విక, సామాజిక విలువలతో ఆంగ్లేయుల ప్రశంసలందుకున్న తెలుగు పద్యాలు అల్లిన వేమన కడపవాడే. తెలుగు భాషకు కడప గడ్డలో జీవం పోసిన ఆంగ్లదొర బ్రౌన్ కడప కేంద్రంగా తెలుగుభాషకు అంతర్జాతీయ ఖ్యాతినందేలా చేశారు. ఎందరో కవులు తెలుగుభాషపై మమకారంతో తమ ఊహలకు రెక్కలు తొడిగారు. ప్రపంచ భాషల్లో 16వ స్థానంలో ఉన్న భాష దేశ భాషలందు హిందీ తరువాత అత్యధికులు మాట్లాడే తెలుగుభాష సొగసైనది, మధురమైనది.

### బ్రౌన్‌శాస్త్రి భాషా పరిశోధనా కేంద్రం

తెలుగుభాష పరిశోధనకు బ్రౌన్ శ్రీకారం చుట్టగా, దివంగత జానమద్ది హనుమచ్ఛాస్త్రి జీవితాశయంగా మలచిన బ్రౌన్ గ్రంథాలయం భాషా పరిశోధనకు విశేషంగా కృషి చేస్తున్నది. యోగివేమన విశ్వవిద్యాలయం అనుబంధంగా తెలుగుభాషకు ఊపిరిపోస్తున్నది. అలనాటి తాళపత్ర గ్రంథాలను సేకరించడం, శాసనాలను వెలుగులోకి తేవడం, కెఫియత్తుల చారిత్రక విషయాలను సామాన్యులకు చేర్చడంతో నిరంతర కృషి జరుగుతున్నది. మరో పక్క ఆంగ్లభాష వ్యామోహంతో తెలుగుభాషాభివృద్ధికి అవరోధం కలుగుతున్నది. ఆంగ్ల పదాలు తెలుగుపదాలను మరుగున పడవేస్తున్నవి. ఆధునిక సాహిత్యం ముఖ్యంగా సినిమా సాహిత్యం ఆంగ్ల ఒరవడిలో ఉన్నది. ప్రభుత్వం ఆదరణ తగ్గడం, సాంకేతిక పదాలు, ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు ఆంగ్లంలోనే సాగడం తెలుగుభాష వికాసానికి అవరోధమవుతున్నాయి. తల్లిదండ్రులు తమ బిడ్డలను ఆంగ్ల బడులలో చేర్చడం, ప్రభుత్వం ఆంగ బడులను ప్రోత్సహిస్తూ తెలుగు మాధ్యమాన్ని ఎత్తివేయడం ఇటీవల వివాదాస్పదమైంది. ప్రభుత్వంపై ఒత్తిడి లేదన్నది అందరికీ తెలిసిన సత్యమే. ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో సాగాలని, ప్రభుత్వ కార్యాలయాల వాహనాలకు తెలుగు నామాలు ఉండేలా చూడాలని తెలుగుభాషాభిమానుల విజ్ఞప్తులు నామమాత్రమే. మమ్మీ, డాడి సంస్కృతులతో తెలుగుపై మమకారం తగ్గుతున్నది. తెలుగు గడ్డలో తెలుగు చదవలేని వారు తయారవడం బాధాకరం. ఈ విపత్కర పరిస్థితుల్లో తెలుగు భాషను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తమిళనాడు తరహాలో మాతృభాష ప్రాధాన్యతకై నడుం బిగించేలా చట్టం తేవాల్సి ఉంది. ఇందుకు తెలుగుభాషాభిమానులు నడుం బిగించాల్సి ఉంది. కడప జిల్లాలో తెలుగుభాష పునరుద్ధరణకు విశేష కృషి జరుగుతున్నది. కట్టా నరసింహులు భాషా పరిశోధనలు, కెఫియత్తుల వివరాలు, తాళపత్ర గ్రంథాల విశేషాలు ప్రజలకు అందించడంలె విశేషకృషి చేశారు. మొగలి చెండు సురేష్ తెలుగుశాసనాలు, శిల్పులు గుర్తిస్తూ తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్నారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో తెలుగుభాష పరిశోధనకు ప్రాధాన్యతనిస్తున్నారు. బ్రౌన్ శాస్త్రి పరిశోధనా కేంద్రం అత్యంత ప్రాచీన పుస్తకాలను సేకరించి భాషాభిమానుల భాషా పిపాసను తీరుస్తున్నది. పాఠశాల స్థాయిలో తెలుగు ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులను ధరిస్తూ తెలుగు ప్రాముఖ్యతను తెలియజేస్తున్నారు. ముస్లింలైనా తెలుగుభాషపై మమకారంతో శశిశ్రీ, సత్యాగ్ని తమ కలాల పేరును తెలుగులో మలచుకున్నారు. జిల్లా పరిషత్ ఉపపాలనాధికారిగా ఉన్న ఖాదర్‌భాష పాలనలో తెలుగుభాషకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు. మల్లెమాల గోపాల్‌రెడ్డి, వేంపల్లె గంగాధర్‌లు తెలుగుభాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. మొల్ల సాహితీపీఠం ఆధ్వర్యంలో గానుగపెంట హనుమంతరావు తెలుగుభాషాభివృద్ధికి ప్రజలను చైతన్య పరుస్తున్నారు. ఇటీవల కాలంలో తెలుగుభాషాభివృద్ధికి తెలుగుభాషా పరిరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఒంటేరు శ్రీనివాసరెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి తీవ్రతరం చేశారు. ఇన్ని ప్రయత్నాలు జరుగుతున్నా మాతృభాషకు తగిన ప్రాచుర్యం లభించడం లేదు. అందుకు తెలుగు ప్రజలు మరింత చైతన్యంతో ముందుకు రావాల్సిన అవసరం ఉంది.







స్వర్గీయ జానమద్ది హనుమచ్ఛాస్త్రి



సీపీ బ్రౌన్ ఊహా చిత్రం



### నేడు గిడుగు రామమూర్తి జయంతి

కడప, కల్చరల్



మాటల్లో మాధుర్యం..
పంచె కట్టులో
మొనగాడితనం...
నడకలో
తెలుగుదనం...
ఆవకాయ, గోంగూరల
కమ్మదనం..
'అమ్మ' భాషపై మమకారం

### అయ్యా నమస్కారం.... కులాసానే గదా?

తెలుగువారి పలకరింపుల తీరేవేరు. మనిషి కనిపించగానే చేతులు జోడించి కుశల ప్రశ్నలు వేయడం మన ఆచారం. అచ్చమయిన తెలుగుదనంతో అయ్యా నమస్కారం అంటూ రెండు చేతులు జోడించి ఒకరికొకరు నమస్కరించుకుని, కుశలమేనా అంటూ పలకరించుకోవడం తెలుగువారి ప్రత్యేకత. కుల, మత, ప్రాంత, వర్గ తారతమ్యాలకు తావు లేని అచ్చమైన అలమరికలు లేని తెలుగుతనం తెలుగువారి సొంతం.



### విద్యా విధానంలో మార్పు రావాలి

**కట్టా నరసింహులు**
**తెలుగు భాషా పరిశోధకులు**



తెలుగుభాషకు తెలుగు రాష్ట్రంలో స్థానం లేకపోవడం బాధాకరం. ఆంగ్ల విద్యావిధానంతో తెలుగు భాష నిరాదరణకు గురవడం తెలుగు భాషాభిమానిగా బాధపడుతున్నాను. విద్యా విధానంలో మార్పు తేవాలి. కనీసం ఇంటర్మీడియట్ స్థాయి వరకు అయినా మాతృభాషలో బోధన జరగాలి. ప్రస్తుత విద్యావిధానం పిల్లలు పోత పాలతో పెరిగినట్లున్నది. ఇటీవల ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ మాతృభాషను మరవద్దని గుర్తు చేశాడని, దీనిని దృష్టిలో ఉంచుకొని తెలుగుభాషాభివృద్ధికి ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలి. కడపలో తెలుగుభాష పరిశోధనకు నిధులు సమకూర్చి భాషా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

### అధికార భాషా సంఘం ఏర్పాటు చేయాలి

**డాక్టర్ వేంపల్లి గంగాధర్,**
**కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత**



తమిళనాడు తరహాలో భాషా పరిరక్షణ కోసం కృషి జరగాలి. అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేసి మాతృ భాషను పరిరక్షించుటకు ప్రభుత్వం కృషి చేయాలి. ఒకరోజు భాషా దినోత్సవంతో సరిపెట్టడం మానుకొని నిర్మాణాత్మక, ఆచరణాత్మక కృషి జరగాలి. పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించడం, ప్రశంసా పత్రాలు అందించడంతో మాతృభాష మీద మమకారం, అభిమానం పెరుగుతాయి. తెలుగుభాష మనుగడ కోసం ఇప్పటికైనా మంత్రులు, ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవాలి.

### గిడుగు జయంతిని అధికారికంగా నిర్వహించాలి

**- ఒంటేరు శ్రీనివాసరెడ్డి,**
**తెలుగుభాషా పరిరక్షణ సమితి సమన్వయకర్త**



వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి జన్మదినాన్ని మాతృ భాషాదినోత్సవంగా ప్రభుత్వం అధి కారికంగా నిర్వహించారు. మైసూరులోని తెలుగు ప్రాచీన హోదాపీఠాన్ని రాష్ట్రానికి తరలించాలి. నవ్యాంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయం, సంగీత నాటక అకాడమీలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ ఉత్తర్వులు, కార్యాలయ నామ ఫలకాలు తెలుగులో ఉండే విధంగా ప్రభుత్వం చూడాలి. ఈ కార్యక్రమాలు నిర్వహించుటకు తెలుగుభాషా పరిరక్షణ సంఘాన్ని ఏర్పాటు చేసి అనేక పర్యాయాలు ప్రభుత్వానికి వినతులు సమర్పించాము. మాతృభాష ఉద్యమాన్ని భవిష్యత్తులో తీవ్రతరం చేసి మాతృ భాషకు పూర్వవైభవం తెచ్చేందుకు విరామం లేకుండా కృషి చేస్తాం.



సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో భద్రపరచబడిన తాళపత్రాలు

# మూడు పువ్వులు.. ఆరు కాయలు

## జాతీయ స్థాయికి రైల్వేకోడూరు నర్సరీ

## ఏడాదికి రూ.50 కోట్ల నర్సరీ వ్యాపారం



### ప్రభుత్వ ప్రోత్సాహంతో నర్సరీల ఏర్పాటు

**పూల రఘు, నర్సరీ వ్యాపారి, రైల్వేకోడూరు**

సీఎం చంద్రబాబునాయుడు నర్సరీలకు మంచి ప్రోత్సాహంతో వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాం. ప్రభుత్వం రైతులకు అందజేసే సబ్సిడీ మొక్కలను తమ నర్సరీల ద్వారా సరఫరా చేస్తుండటంతో అంటుమొక్కలకు డిమాండ్ లభిస్తోంది. తద్వారా మేలురకమైన అంటు మొక్కలను అన్ని ప్రాంతాలకు ఎగుమతి చేసి లాభాలు గడిస్తున్నాం.

రాజంపేట

రైల్వేకోడూరు నర్సరీ వ్యాపారం జాతీయ స్థాయికి చేరింది. ప్రతి ఏడాది 50కోట్ల రూపాయల నర్సరీ వ్యాపారం ఇక్కడి నుంచి జరుగుతోంది. పండ్లతోటలకు ప్రసిద్ధిగాంచిన రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఈ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. పాతికేళ్లుగా ఈ ప్రాంతంలో నర్సరీలను ఏర్పాటుచేసి మొక్కల పెంపకాన్ని చేస్తున్నారు. నియోజకవర్గ కేంద్రమైన రైల్వేకోడూరు పట్టణం చుట్టూ ఈ నర్సరీలు ఉన్నాయి. పట్టణానికి ఆనుకొని ఉన్న గుండాలపల్లెలో 15నర్సరీలు, ఓబనపల్లెలో ఐదు, సింగిరివారిపల్లెలో నాలుగు, అనంతరాజుపేటలో ఒక నర్సరీ, రాఘవ రాజుపురంలో నాలుగు నర్సరీలు మొత్తం 30 నర్సరీలు ఉన్నాయి. ఈ నర్సరీల ద్వారా మేలు రకమైన పండ్ల మొక్కలను తయారుచేసి దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. పండ్లమొక్కల తయారీకి అనువైన నేల లతో పాటు వాతావరణం కూడా అనుకూలి స్తుండడంతో ఈ నర్సరీలను ఇక్కడ పెంచుతున్నారు. 30నర్సరీల ద్వారా 50కోట్ల రూపాయల వ్యాపారాన్ని ప్రతిఏటా చేస్తున్నారు. ప్రధానంగా మామిడి, బాలాజీ నిమ్మ, రంగాపూర్ బత్తాయి, సపోటా, దానిమ్మ, కొబ్బరి, జామ, సీతాఫలం, రామాఫలం, శ్రీగంధం, బొప్పాయి ఇలా అనేక రకాల మేలు రకమైన పండ్లమొక్కలను నర్సరీల్లో పెంచి అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఈ వ్యాపారం ఆగస్టు నుంచి ఫిబ్రవరి వరకు కొన సాగిస్తున్నారు. నల్గొండ, అనంతపురం, ఎస్వీ యూనివర్సిటీ ప్రాంతాల నుంచి బత్తాయి, నిమ్మ రకానికి సంబంధించిన మేలురకపు అంటును తెచ్చి ఇక్కడి చెట్లకు వాటిని కట్టి నర్సరీల ద్వారా మొక్కలను తయారు చేస్తున్నారు. రైల్వేకోడూరు నుంచి ఆంధ్ర రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు, తెలంగాణా రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్‌లతో పాటు అన్ని రాష్ట్రాలకు ఈ పండ్లమొక్కలను ఎగుమతి చేస్తున్నారు. పండ్లమొక్కలతో పాటు వివిధ రకాల పూలమొక్కలను కూడా ఎగుమతి చేస్తున్నారు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద రైతులకు అందజేసే సబ్సిడీ మొక్కలను వీరే సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వం వీరికి ప్రోత్సాహం కలిగించడంతో ఈ మొక్కలను రైతులకు విరివిగా సరఫరా చేస్తున్నారు. బాలాజీ నిమ్మను ఒక మొక్క 67 రూపాయలు, రంగాపూర్ బత్తాయిని 67 రూపాయలు, సపోటా, కొబ్బరి, జామ, సీతాఫలం, రామాఫలం, శ్రీగంధం మొక్కలను 50రూపాయలు, మామిడి 70రూపాయల చొప్పున అమ్ముతున్నారు. ప్రత్యేక లారీల ద్వారా వీటిని అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఈ నర్సరీల ద్వారా సుమారు 500మంది చుట్టుపక్కల గ్రామ ప్రజలు ఇక్కడ పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఈ వ్యాపారాన్ని నమ్ముకొని సుమారు 100మంది నర్సరీ వ్యాపారస్తులు దేశంలోని అన్ని ప్రాంత రైతులతో సంబంధాలు ఏర్పాటు చేసుకుని లాభాలు గడిస్తున్నారు. ప్రతి ఏడాది 10లక్షల రూపాయల నుంచి కోటి రూపాయల వరకు ఆదాయం గడించే నర్సరీ రైతులు ఇక్కడ ఎంతో మంది ఉన్నారు. ప్రతిరోజూ ఆరు లారీలకు తక్కువ లేకుండా సీజన్‌లో ఈ మొక్కలను ఎగుమతి చేస్తున్నారు. అందువల్ల జాతీయ స్థాయిలో రైల్వేకోడూరు నర్సరీలకు మంచి గుర్తింపు లభిస్తోంది.



దేశంలోని అనేక రాష్ట్రాలకు లారీల ద్వారా ఎగుమతి చేస్తున్న అంటుమొక్కలు



రైల్వేకోడూరు నర్సరీల్లో పెంచుతున్న వివిధ రకాల పండ్ల మొక్కలు

### మేలుజాతి రకం పండ్ల మొక్కలను ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు సరఫరా



### అన్ని ప్రాంతాలతో సంబంధాలు

**శ్రీకాంత్, అంటుమొక్కల తయారీదారుడు, రైల్వేకోడూరు.**

నేను ఇరవై ఏళ్లుగా నర్సరీని ఏర్పాటుచేసి మేలు రకమైన మొక్కలను తయారు చేసి దేశంలోని అన్ని ప్రాంతాలకు ఎగుమతి చేస్తు న్నాను. దీనివల్ల ఇతర రాష్ట్రాల రైతులతో కూడా మాకు సంబంధాలు ఏర్పడి 50కోట్ల రూపాయలు నర్సరీల ద్వారా రైతులకు ఆదాయం లభిస్తోంది.



ఇతర ప్రాంతాలకు వాహనాల ద్వారా సరఫరా చేస్తున్న అంటుమొక్కలు

# ఒక పదార్థ అయస్కాంతీకరణ అవధిని ఏమంటారు?

## అయస్కాంతత్వం

## పోటీ పరీక్షల ప్రత్యేకం - ఫిజిక్స్



శీలం దేవేందర్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

1. కిందివాటిలో ఫెర్రో అయస్కాంత పదార్థాలు కానివి ఏవి ?
ఎ) లోహాలు బి) ఘన
సి) వాయు డి) మిశ్రమ లోహాలు

2. అయస్కాంతం చుట్టూ అయస్కాంతత్వం-----
ఎ) ఏక మితీయం బి) త్రిమిలీయం
సి) ద్విమిలీయం డి) పైవేవీకావు

3. ఒక సమదైశిక యానకంలో B, $\mu_0$, H, M ల మధ్య ఉన్న సంబంధం?
ఎ) $H = \mu_0[B + M]$ బి) $M = \mu_0[B + H]$
సి) $B = \mu_0[H + M]$ డి) $B - M = \mu_0 H$

4. అయస్కాంత అభివాహాన్ని ఏ ప్రమాణంలో కొలుస్తారు?
ఎ) ఆంపియర్/ మీటర్ బి) ఆంపియర్ - మీటర్
సి) వెబర్ డి) న్యూటన్ - ఆంపియర్ /మీటర్

5. సర్వ సమానాలైన మూడు దండయస్కాంతాలను ఒక త్రిభుజంగా అమర్చారు. ఒక్కోదానికి M అయస్కాంత భ్రామకం ఉంది. ఒక అయస్కాంత ఉత్తర ధృవాన్ని తరవాతి దాని దక్షిణ ధృవంతో కలిసేటట్లుగా అమరిస్తే ఫలిత అయస్కాంత భ్రామకం?
ఎ) 0 బి) $\sqrt{3}$ M సి) 3 M డి) $\sqrt{2}$ M

6. 400 యూనిట్లు అయస్కాంత భ్రామకం ఉన్న ఒక దండయస్కాంతాన్ని రెండు ముక్కలుగా విభజించారు. అయితే ఇపుడు ఒక్కో ముక్క అయస్కాంత భ్రామకం ఎంత?
ఎ) 100 బి) 200 సి) 300 డి) 400

7. ఒక దండయస్కాంతంలో తటస్థ బిందువులు, దాని మధ్య లంబరేఖ మీద లభించాలంటే దాని ఉత్తర ధృవాన్ని ఉంచాల్సిన భూమి ధృవం?
ఎ) ఉత్తరం బి) దక్షిణం సి) తూర్పు డి) పడమర

8. రెండు అయస్కాంత బలరేఖలు--------
ఎ) ఒక చోట కలుసుకోవాలి
బి) ఒకదానినొకటి ఖండించుకోవు
సి) ఎప్పుడూ సమాంతరంగా ఉండాలి
డి) లంబంగా ఉండాలి

9. అయస్కాంత ససెప్టిబిలిటి ఉష్ణోగ్రత మీదగానీ, అనువర్తిత అయస్కాంత క్షేత్రం మీదగానీ ఆధారపడని పదార్థం?
ఎ) పారా అయస్కాంత బి) ఫెర్రో అయస్కాంత
సి) డయా అయస్కాంత డి) అనయస్కాంత

10. M అయస్కాంత భ్రామకం ఉన్న ఒక దండయస్కాంతాన్ని అర్ధ వృత్తాకారంగా వంచినపుడు దాని అయస్కాంత భ్రామకం------
ఎ) M/π బి) M/ 2π సి) 4M/π డి) 2M/π

11. అయస్కాంతత్వానికి అసలైన పరీక్ష?
ఎ) వికర్షణ బి) ప్రేరణ
సి) ఆకర్షణ డి) ఏకస్పర్శ

12. ఒక సాధారణ ఇనుప ముక్కలో-----
ఎ) అయస్కాంత ద్వి ధృవాలు ఒక నియమిత దిశలో అమరి ఉంటాయి
బి) అయస్కాంత ద్వి ధృవాలు క్రమరహితంగా అమరి ఉంటాయి
సి) అయస్కాంత ద్వి ధృవాలు ఉండవు
డి) పైవేవీకావు

13. అయస్కాంతీకరణ తీవ్రతకు అయస్కాంతీకరణ క్షేత్ర తీవ్రతకు గల నిష్పత్తి?
ఎ) ప్రవేశ్యశీలత బి) అయస్కాంత తీవ్రత
సి) ససెప్టిబిలిటి డి) అయస్కాంత ప్రేరణ

14. దండయస్కాంతం మధ్య లంబరేఖ మీద అయస్కాంత ప్రేరణ-----
ఎ) $B = (\mu_0 /4\pi)(2M/ d^3)$
బి) $B = (\mu_0 /2\pi)(M/ d^3)$
సి) $B = (\mu_0 /2\pi)(2M/ d^3)$
డి) $B = (\mu_0 /4\pi)(M/ d^3)$

15. లోడ్ స్టోన్స్ అంటే?
ఎ) ఇనుప ఖనిజాలు బి) వజ్రాలు
సి) ఆకర్షణ గల పదార్థాలు డి) బొగ్గు

16. విద్యుదయస్కాంతం తయారు చేయడానికి ఉపయోగించే పదార్థం?
ఎ) మెత్తని ఇనుము బి) గట్టి ఇనుము
సి) నికెల్ డి) పాస్ఫర్ బ్రాంజ్

17. కింది వాటిలో భిన్నంగా ఉన్న పదార్థం?
ఎ) నికెల్ బి) కోబాల్ట్
సి) క్రోమియం డి) ఉక్కు

18. ఆకర్షించే స్వభావం గల ఇనుప ఖనిజం?
ఎ) మాగ్నటైట్ బి) మాగ్నసైట్
సి) హెమటైట్ డి) డోలమైట్

19. శూన్యంలో అయస్కాంత ప్రవేశ్య శీలత($\mu_0$) = ----- హెన్రీ/ మీటర్
ఎ) $4\pi \times 10^{-7}$ బి) $4\pi \times 10^{7}$
సి) $2\pi \times 10^{-7}$ డి) $10^{-7}$

20. ఒక పదార్థ అయస్కాంతీకరణ అవధిని ఏమంటారు?
ఎ) ప్రవేశ్య శీలత బి) అయస్కాంత సంతృప్తత
సి) రిటెంటివిటి డి) అయస్కాంతత్వం

21. I, V, H ల మధ్య సంబంధం?
ఎ) $H = I + V$ బి) $H^2 = I^2 + V^2$
సి) $I^2 = H^2 + V^2$ డి) $V^2 = I^2 + H^2$

22. ఏదైనా ఒక వైశాల్యంలో ఉన్న అయస్కాంత బలరేఖల సంఖ్య------
ఎ) అయస్కాంత ప్రేరణ
బి) అయస్కాంత అభివాహం
సి) అయస్కాంత క్షేత్ర తీవ్రత
డి) అయస్కాంత అభివాహ సాంద్రత

23. ఒక అయస్కాంత ధృవం, మరో అయస్కాంత ధృవాన్ని ఆకర్షించే లేదా వికర్షించే స్వభావాన్ని ఏమంటారు?
ఎ) ధృవసత్వం బి) అయస్కాంతత్వం
సి) అయస్కాంతీకరణం డి) ప్రవేశ్యశీలత

24. ఒక ధృవం నుంచి ఒక మీటర్ దూరంలో ఉన్న మరో సర్వ సమాన ధృవం $10^{-7}$ న్యూటన్ల బలంతో వికర్షిస్తే ఆ ధృవం ధృవసత్వం?
ఎ) $10^{-7}$ ఆంపియర్ - మీటర్
బి) $10^{7}$ ఆంపియర్ - మీటర్
సి) 1 ఆంపియర్ - మీటర్
డి) $1/ 10^4$ ఆంపియర్ - మీటర్

25. శూన్యంలో విలోమ వర్గ నియమం------
ఎ) $F = (\mu/4\pi) (m_1 m_2/r^2)$
బి) $F = (\mu_0/4\pi) (m_1 m_2/r^2)$
సి) $(4\pi/\mu) (m_1 m_2/r^2)$
డి) $F = m_1 m_2/r^2$

26. ఒక ప్రదేశంలోని భూ అయస్కాంత క్షేత్రాన్ని నిర్ణయించే రాశులు
ఎ) భూ అయస్కాంత అయస్కాంత రాశులు
బి) భూ అయస్కాంత మూల రాశులు
సి) భూ అయస్కాంత దిశా రాశులు
డి) భూ అయస్కాంత ఉప రాశులు

27. భూమి లోపల ఊహించిన దండయస్కాంత ఉత్తర ధృవం ఏ భౌగోళిక దిశ వైపు ఉంటుంది?
ఎ) ఉత్తరం బి) దక్షిణం సి) తూర్పు డి) పడమర

28. అయస్కాంతంలో అయస్కాంతత్వం ఎక్కువగా ఉండే ప్రదేశం?
ఎ) ధృవాల వద్ద బి) మధ్యలో
సి) కేంద్రం వద్ద డి) పైవన్నీ

29. అయస్కాంత భ్రామకం ఎస్ఐ ప్రమాణం
ఎ) ఆంపియర్ - మీటర్ బి) ఆంపియర్ / మీటర్
సి) ఆంపియర్ / మీటర్ $^2$
డి) ఆంపియర్ - మీటర్ $^2$

30. ఆంధ్రప్రదేశ్‌లో $B_0$ విలువ?
ఎ) $0.25 \times 10^{-4}$ టెస్లా బి) $0.39 \times 10^{-4}$ టెస్లా
సి) $0.29 \times 10^{-4}$ టెస్లా డి) $0.35 \times 10^{-4}$ టెస్లా

31. కింది వానిలో యానకం ఆధారపడనిది?
ఎ) అయస్కాంత ప్రేరణ
బి) అయస్కాంత క్షేత్ర తీవ్రత
సి) విలోమ వర్గ నియమం డి) పైవేవీకావు

32. ధృవసత్వం m, పొడవు 2l గల దండయస్కాంత భ్రామకం M ?
ఎ) m/2l బి) m x 2l
సి) 2l/m డి) 2m/l

33. భౌగోళిక ఉత్తర ధృవాన్ని చూస్తున్న ఒక దండయస్కాంత దక్షిణ ధృవం వల్ల ఏర్పడే తటస్థ బిందువుల సంఖ్య?
ఎ) 1 బి) 3 సి) 2 డి) 4

34. తటస్థ బిందువులు దండయస్కాంత మధ్య బిందువు 'o' నుంచి అక్షీయ రేఖపై 'd' దూరంలో ఉన్నపుడు అయస్కాంత భ్రామకం-----
ఎ) $M = 390\ d^3$ ఆంపియర్ - మీటర్$^2$
బి) $M = 250\ d^3$ ఆంపియర్ - మీటర్$^2$
సి) $M = 210\ d^3$ ఆంపియర్ - మీటర్$^2$
డి) $M = 195\ d^3$ ఆంపియర్ - మీటర్$^2$

35. స్వేచ్ఛగా వేలాడదీసిన దండయస్కాంతం సూచించే దిక్కులు?
ఎ) తూర్పు- పడమర బి) ఉత్తరం - దక్షిణం
సి) ఉత్తరం - తూర్పు డి) దక్షిణం - పడమర

36. 1 టెస్లా = --------గాస్
ఎ) $10^7$ బి) $10^{-7}$ సి) $10^4$ డి) $10^{-4}$

37. అయస్కాంత వికర్షణకు లోనయ్యే పదార్థాలు?
ఎ) కాపర్ బి) బిస్మత్ సి) ఇనుము డి) ఎ, బి

38. అయస్కాంత ధృవాల ధృవసత్వాలు ఎలా ఉంటాయి?
ఎ) అసమానంగా
బి) కొన్ని సమానంగా, మరికొన్ని అసమానంగా
సి) సమానంగా డి) ఏదీకాదు

39. సాపేక్ష ప్రవేశ్య శీలత ప్రమాణాలు?
ఎ) హెన్రీ/ మీటర్ బి) హెన్రీ మీటర్
సి) ఉండవు డి) ఏదీకాదు

40. ఇనుప కడ్డీని అయస్కాంతంగా మారిస్తే దాని పొడవు?
ఎ) కొద్దిగా పెరుగుతుంది బి) పెరిగి తగ్గుతుంది
సి) కొద్దిగా తగ్గుతుంది డి) మారదు

41. భూమి భౌగోళిక అక్షానికి, అయస్కాంత అక్షానికి మధ్య గల కోణం?
ఎ) అవపాతం బి) దిక్పాతం
సి) అనుపాతం డి) క్షేత్ర తీవ్రత

42. భూ అయస్కాంత క్షేత్రం భూమి ఉపరితలం నుంచి ఎంత ఎత్తు వరకు విస్తరించి ఉంటుంది?
ఎ) 2,58,000 కి.మీ. బి) 2,85,000 కి.మీ.
సి) 5,28,000 కి.మీ. డి) 8,20,000 కి.మీ.

43. ఒకే అవపాతం గల ప్రాంతాలను కలుపుతూ గీసిన రేఖలను ఏమంటారు?
ఎ) ఐసోబార్లు బి) ఐసోక్లినిక్
సి) ఐసోగోనిక్ డి) ఐసోటోన్

44. పరమ శూన్య ఉష్ణోగ్రతను కొలిచేందుకు ఉపయోగించే అయస్కాంత ఉష్ణోగ్రత మాపకంలో దేనిని వాడతారు?
ఎ) నియాన్ బి) పాదరసం
సి) ద్రవస్థితిలోని హీలియం డి) ఆల్కహాల్

45. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియో మేగ్నటిజం సంస్థ గల ప్రదేశం?
ఎ) బెంగళూరు బి) ముంబై
సి) ఢిల్లీ డి) చెన్నై

46. ఫెర్రైట్స్ అంటే?
ఎ) పారా అయస్కాంత పదార్థాలు
బి) ఫెర్రో అయస్కాంత పదార్థాలు
సి) డయా అయస్కాంత పదార్థాలు డి) ఎ, సి

### సమాధానాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1) సి | 9) సి | 17) సి | 25) బి | 34) డి | 43) బి |
| 2) బి | 10) డి | 18) ఎ | 26) బి | 35) బి | 44) సి |
| 3) సి | 11) ఎ | 19) ఎ | 27) బి | 36) సి | 45) బి |
| 4) సి | 12) బి | 20) బి | 28) ఎ | 37) డి | 46) బి |
| 5) ఎ | 13) సి | 21) సి | 29) సి | 38) సి | |
| 6) బి | 14) డి | 22) బి | 30) బి | 39) ఎ | |
| 7) ఎ | 15) సి | 23) ఎ | 31) బి | 40) ఎ | |
| 8) బి | 16) ఎ | 24) సి | 32) బి | 41) బి | |
| | | | 33) సి | 42) సి | |

## ఉద్యోగాలు

### ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్

ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ - **అసిస్టెంట్స్, అసిస్టెంట్ మేనేజర్స్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు:** 264

**అసిస్టెంట్ మేనేజర్**

**ఖాళీలు:** 100 **ట్రైనింగ్ వ్యవధి:** ఏడాది
**అర్హత:** 60 శాతం మార్కులతో ఎంబిఏ ఉత్తీర్ణత + కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి
**వేతనం:** నెలకు రూ.49,805

**అసిస్టెంట్**

**ఖాళీలు:** 164(తెలంగాణకు 5, ఆంధ్రప్రదేశ్‌కు 11 పోస్టులను కేటాయించారు)
**ట్రైనింగ్ వ్యవధి:** ఆరు నెలలు
**అర్హత:** 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణత + కంప్యూటర్ స్కిల్ ఉండాలి.
**వయసు:** జూలై 1 నాటికి 21 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
**వేతనం:** నెలకు రూ. 21,236
**ఎంపిక:** ఆన్‌లైన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా
**ఆన్‌లైన్ ఎగ్జామ్‌కు కాల్ లెటర్ డౌన్‌లోడింగ్:** సెప్టెంబరు 26 నుంచి
**ఆన్‌లైన్ ఎగ్జామ్:** అసిస్టెంట్ మేనేజర్‌కు అక్టోబరు 10న, అసిస్టెంట్‌కు అక్టోబరు 12న
**తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం
**దరఖాస్తు ఫీజు:** రూ.500
**ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 7
**వెబ్‌సైట్:** www.lichousing.com

### ఇండియన్ కోస్ట్ గార్డ్

ఇండియన్ కోస్ట్ గార్డ్ - **నావిక్ (జనరల్ డ్యూటీ) 10 + 2** ఎంట్రీ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.
**అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్ (మేథ్స్, ఫిజిక్స్) లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన పురుషులు దరఖాస్తుకు అర్హులు.
**వయసు:** 18 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి
**ఎంపిక:** రాత పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా
**పరీక్ష కేంద్రాలు:** తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు సికింద్రాబాద్, విశాఖపట్నం కేంద్రాలను కేటాయించారు.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 4
**వెబ్‌సైట్:** www.joinindiancoastguard.gov.in

### సిఎస్ఐఆర్ - సిఇఇఆర్ఐ

సిఎస్ఐఆర్ - సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిఇఇఆర్ఐ) - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**మొత్తం ఖాళీలు:** 20

**సైంటిస్ట్** **ఖాళీలు:** 16
**వయసు:** దరఖాస్తు నాటికి 32 ఏళ్లు మించరాదు
**వేతనం:** రూ.77178

**సీనియర్ సైంటిస్ట్** **ఖాళీలు:** 2
**వయసు:** దరఖాస్తు నాటికి 37 ఏళ్లు మించరాదు
**వేతనం:** రూ.89832

**ప్రిన్సిపల్ సైంటిస్ట్** **ఖాళీలు:** 2
**వయసు:** దరఖాస్తు నాటికి 45 ఏళ్లు మించరాదు
**వేతనం:** రూ.135090

**అర్హత:** సంబంధిత విభాగంలో ఎంఇ/ ఎంటెక్/ పిహెచ్‌డి పూర్తిచేసి ఉండాలి
**ఎంపిక:** అనుభవం, ఇంటర్వ్యూ ద్వారా
**దరఖాస్తు ఫీజు:** రూ.100
ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో ఇచ్చిన దరఖాస్తు ఫారం నమూనాను డౌన్‌లోడ్ చేసుకొని నింపి కింది చిరునామాకు పంపుకోవాలి
**దరఖాస్తు స్వీకరణకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 11
**చిరునామా:** Controller of Administration, CSIR - Central Electronics Engineering Research Institute, Pilani - 333031
**వెబ్‌సైట్:** www.ceeri.res.in

# The new Chairman of Railway Board?

## Current Affairs & GK



A. Ravi Prakash Reddy
Senior Faculty

1. **Who is the winner of World Food Prize for 2017?**
   1) David Grossman
   2) Alvin Carl Plantinga
   3) Yves Meyer 4) Akinwumi Adesina
   5) None of these
2. **Find the correct statement?**
   1) Ram Nath Kovind is the 14th President of India, assumed office on 25 July 2017.
   2) Venkaiah Naidu is the 13th Vice-President of India, assumed office on 11 August 2017.
   3) Justice Dipak Mishra is the 45th Chief Justice of India, assumed office on 28 July 2017.
   4) Achal Kumar Jyoti is the 21st Chief Election Commissioner of India, assumed office on 6 July 2017. 5) All of the above
3. **Shanghai Cooperation Organisation (SCO) summit 2017 was held in Astana, Kazakhstan. Who is the President of Kazakhstan?**
   1) Nursultan Nazarbayev
   2) Almazbek Atambayev
   3) Emomali Rahmon
   4) Shavkat Mirziyoyev 5) None of these
4. **International Day Against Drug Abuse and Illicit Trafficking is observed on…**
   1) June 26 2) July 26 3) August 26
   4) September 26 5) October 26
5. **Which state government has launched an exclusive 24×7 helpline '181' for women?**
   1) Andhra Pradesh 2) Karnataka
   3) Kerala 4) Tamil Nadu 5) Telangana
6. **Which state chief minister has been chosen for the National Agriculture Leadership Award-2017 by the Indian Council of Food and Agriculture (ICFA) under the chairmanship of well known agriculture scientist Prof.M.S. Swaminathan?**
   1) Uttar Pradesh 2) Madhya Pradesh
   3) Telangana 4) Maharashtra
   5) Andhra Pradesh
7. **The ONGC board recently approved the acquisition (51.11% equity stake) of which of the following public sector companies?**
   1) IOC 2) BPCL 3) HPCL 4) OIL 5) None
8. **Who is the author of the book "I am HIV positive, so what"?**
   1) Ch.Pradip Kumar Singh
   2) Jayanta Kalita 3) Arundhati Roy
   4) Chetan Bhagat 5) Salman Rushdie
9. **At present the number of Regional Rural Banks (RRBs) in India?**
   1) 36 2) 46 3) 56 4) 66 5) None of these
10. **The winners of Rajiv Gandhi Khel Ratna Award for 2017?**
    1) Viswanathan Anand and Karnam Malleswari
    2) Sachin Tendulkar and Mahendra Singh Dhoni
    3) P.V.Sindhu and Dipa Karmakar
    4) Jitu Rai and Sakshi Malik
    5) Devendra Jhajharia and Sardara Singh
11. **The first regional office of New Development Bank (NDB) was opened in..**
    1) Sao Paulo 2) Moscow 3) Mumbai
    4) Shanghai 5) Johannesburg
12. **Who is the Pakistan's new High Commissioner to India?**
    1) Shahid Khaqan Abbasi
    2) Sohail Mahmood
    3) Khawaja Muhammad Asif
    4) Mamnoon Hussain
    5) Khurram Dastgir Khan
13. **The Government of India's Disin vestment Target for 2017-18?**
    1) Rs 42,500 crore 2) Rs 52,500 crore
    3) Rs 62,500 crore 4) Rs 72,500 crore
    5) None of these
14. **The Andhra Pradesh Grameena Vikas Bank(APGVB) is a regional rural bank sponsored by….**
    1) State Bank of India 2) Andhra Bank
    3) Syndicate Bank 4) Indian Bank
    5) None of these
15. **Which of the following countries is NOT a member of G7 group?**
    1) Germany 2) Britain 3) France
    4) Italy 5) Sweden
16. **Who is the winner of Men's Singles in 2017 Rogers Cup?**
    1) Alexander Zverev 2) Roger Federer
    3) Pierre-Hugues Herbert
    4) Nicolas Mahut 5) None of these

# FOR ALL COMPETITIVE EXAMS

17. **Match the following?**

| Summit | Hosting Place |
|---|---|
| A. G7 Summit 2017 | (i) Taormina, Italy |
| B. G20 Summit 2017 | (ii) Hamburg, Germany |
| C. SCO Summit 2017 | (iii) Astana, Kazakhstan |
| D. APEC Summit 2017 | (iv) Da Nang, Vietnam |
| E. BRICS Summit 2017 | (v) Xiamen, China |

| | A | B | C | D | E |
|---|---|---|---|---|---|
| 1) | (ii) | (iii) | (iv) | (v) | (i) |
| 2) | (v) | (i) | (iii) | (ii) | (iv) |
| 3) | (iv) | (ii) | (i) | (v) | (iii) |
| 4) | (iii) | (iv) | (ii) | (i) | (v) |
| 5) | (i) | (ii) | (iii) | (iv) | (v) |

18. **Which city will host the Summer Olympics in 2028?**
    1) Rio de Janeiro 2) Tokyo 3) Paris
    4) Los Angeles 5) None of these
19. **Who is Hun Sen?**
    1) The Prime Minister of Singapore
    2) The Prime Minister of Australia
    3) The Prime Minister of Bhutan
    4) The Prime Minister of Cambodia
    5) The Prime Minister of China
20. **The new Chairman of Railway Board?**
    1) Suresh Prabhu 2) Ashwani Lohani
    3) K.K.Venugopa 4) Achal Kumar Jyoti
    5) Rajiv Kumar
21. **Which of the following is the Super Regulatory Body and the idea to create was first mooted by the Raghuram Rajan Committee on Financial Sector Reforms in 2008?**
    1) Reserve Bank of India (RBI)
    2) Securities and Exchange Board of India (SEBI)
    3) Insurance Regulatory and Development Authority of India (IRDAI)
    4) Pension Fund Regulatory and Development Authority (PFRDA)
    5) Financial Stability and Development Council (FSDC)
22. **Who occupies top place in the Forbes' list of highest paid female athletes of 2017, with $27 million in earnings between June 2016 and June 2017?**
    1) Serena Williams 2) Maria Sharapova
    3) Venus Williams 4) Martina Hingis
    5) Garbine Muguruza
23. **World's largest Gold consuming country?**
    1) China 2) India 3) USA 4) Turkey
    5) None of the above
24. **Who resigns as MD & CEO of Infosys?**
    1) Vishal Sikka 2) U.B.Pravin Rao
    3) Natarajan Chandrasekaran
    4) Rajesh Gopinathan 5) None of these
25. **Which of the following statements is correct regarding 2017 Global Retirement Index?**
    1) This Index is published by French asset management company Natixis Global.
    2) Norway topped the list followed by Switzerland and Iceland.
    3) India was ranked last at 43rd position.
    4) The index ranks 43 countries on the basis of four factors viz. the material means to live comfortably in retirement (Material Well-being); access to quality health services (Health); access to quality financial services to help preserve savings value and maximize income (Finances) and a clean and safe environment (Quality of Life ).
    5) All of the above
26. **Who is the President of Argentina?**
    1) Mauricio Macri 2) Michel Temer
    3) Raul Castro 4) Michelle Bachelet
    5) Enrique Pena Nieto
27. **Which of the following statements is correct about Vice-President of India?**
    1) The Vice-President of India (article 63) is the second-highest constitutional office in India after the President of India.
    2) The Vice-President of India is also ex officio Chairperson of the Rajya Sabha.
    3) The Vice-President is elected indirectly by members of an electoral college consisting of the members of both Houses of Parliament.
    4) The Vice-President holds office for five years. 5) All of the above.
28. **As per Census 2011 Final data, India's Literacy Rate?**
    1) 72.98% 2) 80.9% 3) 64.6% 4) 94%
    5) 61.8%
29. **The day which is celebrated as the Good Governance Day in India is...**
    1) 28 February 2) 21 April 3) 29 June
    4) 31 October 5) 25 December
30. **Who is the new non-executive Chairman of Infosys?**
    1) N.R.Narayana Murthy
    2) Nandan Nilekani 3) S. Gopalakrishnan
    4) S. D. Shibulal 5) Vishal Sikka
31. **Which of the following novel won the 2017 Man Booker International Prize?**
    1) A Horse Walks into a Bar
    2) The Vegetarian
    3) A Brief History of Seven Killings
    4) The Sellout 5) None of the above
32. **The Union government has recently hiked OBC creamy layer ceiling limit to how much for central government jobs?**
    1) Rs 6 lakh 2) Rs 8 lakh 3) Rs 10 lakh
    4) Rs 12 lakh 5) None of the above
33. **Who is the author of book "I Do What I Do: On Reform, Rhetoric & Resolve"?**
    1) Urjit Patel 2) Raghuram Rajan
    3) D.Subbarao 4) Y.V.Reddy
    5) Bimal Jalan
34. **As per 2017 UNWTO report on least-visited countries, which is the least visited country in 2016?**
    1) Tuvalu 2) Kiribati
    3) Sao Tome and Principe
    4) Montserrat 5) Comoros
35. **As per 2017 UNWTO report on most-visited countries, which is the most visited country in 2016?**
    1) France 2) USA 3) Spain
    4) China 5) Italy
36. **Who is the new Chairman and Managing Director of Air India?**
    1) Rajiv Kumar 2) Rajiv Bansal
    3) Shashi Shanker 4) Ashwani Lohani
    5) None of the above
37. **The 8th World Renewable Energy Technology Congress summit was held in..**
    1) New Delhi 2) Mumbai 3) Kolkata
    4) Chennai 5) Bengaluru
38. **Rural Infrastructure Development Fund (RIDF) was set up by the Government in 1995-96 for financing ongoing rural Infrastructure projects. RIDF is maintained by..**
    1) RBI 2) SBI 3) NABARD
    4) NHB 5) None of these
39. **The current member countries of Asia Pacific Economic Cooperation (APEC)?**
    1) 17 2) 19 3) 21 4) 23 5) None of these
40. **Which of the following countries has topped the sustainable development goals (SDGs) index 2017?**
    1) Sweden 2) Denmark 3) Finland
    4) Norway 5) None of the above

## Answers

| | | | | | |
|---|---|---|---|---|---|
| | | | 19) 4 | 27) 5 | 35) 1 |
| | | | 20) 2 | 28) 1 | 36) 2 |
| 1) 4 | 7) 3 | 13) 4 | 21) 5 | 29) 5 | 37) 1 |
| 2) 5 | 8) 2 | 14) 1 | 22) 1 | 30) 2 | 38) 3 |
| 3) 1 | 9) 3 | 15) 5 | 23) 1 | 31) 1 | 39) 3 |
| 4) 1 | 10) 5 | 16) 1 | 24) 1 | 32) 2 | 40) 1 |
| 5) 5 | 11) 5 | 17) 5 | 25) 5 | 33) 2 | |
| 6) 3 | 12) 2 | 18) 4 | 26) 1 | 34) 1 | |

## స్కాలర్‌షిప్స్

### పోస్ట్ మెట్రిక్ స్కీమ్

మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు పిహెచ్‌డి వరకు అన్ని రకాల ఉన్నత విద్య అభ్యసించడానికి వీలు కల్పిస్తూ వారి ప్రతిభ ఆధారంగా ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన **పోస్ట్ - మెట్రిక్ స్కాలర్‌షిప్ స్కీమ్**కు ప్రకటన వెలువడింది. ఈ స్కీమ్‌లో బాలికలకు 30 శాతం రిజర్వేషన్ వర్తిస్తుంది.

**అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఇప్పటివరకు అన్ని తరగతుల్లో కనీసం 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.2 లక్షల లోపు ఉండాలి.

**రివార్డు:** విద్యార్థులు అభ్యసించే కోర్సును అనుసరించి అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు, మెయింటెనెన్స్ ఫీజు చెల్లిస్తారు.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ:** ఆగస్టు 31

**వెబ్‌సైట్:** www.b4s.in/edge/PMS21

### మెరిట్ కం మీన్స్

మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, భారత ప్రభుత్వం ఉమ్మడిగా నిర్వహిస్తున్న **మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్**నకు ప్రకటన వెలువడింది. అసమాన ప్రతిభ గల మైనారిటీ వర్గాల విద్యార్థులకు ఆర్థికంగా తోడ్పాటు నందించేందుకుగాను ఈ స్కాలర్‌షిప్‌ను ఉద్దేశించారు.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాలల్లో టెక్నికల్ & ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్/ పన్నెండో తరగతి స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.2.5 లక్షలకు మించరాదు

**రివార్డు:** హాస్టల్ విద్యార్థులకు మెయింటెనెన్స్ అలవెన్స్ కింద ఏడాదికి రూ.10,000, డే స్కాలర్స్‌కు రూ.5000 ఇస్తారు. కోర్సు ఫీజు కింద రూ.20,000/ కళాశాల ఫీజు రెంటిలో ఏది తక్కుగా ఉంటే ఆ మొత్తాన్ని చెల్లిస్తారు.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ:** ఆగస్టు 31

**వెబ్‌సైట్:** www.b4s.in/edge/MCM9

## శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు తోడ్పాటు

**ఓబులవారిపల్లె :** క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి తోడ్పడుతాయని వక్తలు పేర్కొన్నారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా ఓబులవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయుడు అబ్బిగారి వేణుగోపాలస్వామి ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. క్రీడాదినోత్సవం పురస్కరించుకొని 11రకాల ఆటల పోటీలను నిర్వహించారు. ఈ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాలస్వామి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

# ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు వద్దు

**రైల్వేకోడూరు:** పట్టణంలోని ల్వేస్టేషన్‌రూటులో ఉన్న మద్యం దుకాణాలను వెంటనే ఎత్తివేయాలంటూ స్థానిక మహిళలు మేరి, సరోజమ్మ, దేవిక, రాములమ్మ, లలిత, జయమయ్మల ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేయవద్దని రాష్ట్రగవర్నర్ నరసింహన్, రాష్ట్రఎక్సైజ్ శాఖమంత్రి జవహర్, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్, మానవహక్కులకమిషన్, రాష్ట్ర డీజీపీ సాంబశివరావు, జిల్లా కలెక్టర్ బాబూ రావునాయుడు, జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీకి లేఖలు పంపినా ఇంతవరకు ఎలాంటి చర్యలుతీసుకోలేదన్నారు. రైల్వేస్టేషన్ రూటులో మద్యందుకాణాలను ఇళ్లపరిసరాల్లో ఏర్పాటుచేశారని, దీంతో తాగుబోతులు ఇంటి ముందుకువచ్చి వాహనాలకు అడ్డంగా ఉంటున్నారని ఆందోళనవ్యక్తంచేశారు. రైల్వేస్టేషన్ రూటులో కాలేజీలు, పాఠశాలలు, హస్టళ్లు



కోడూరులో ఇళ్ల మధ్య మద్యం దుకాణాలను ఎత్తివేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

తదితరవి ఉన్నాయని దీంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులుపడుతున్నారన్నారు. మహిళలు నడవాలంటేనే భయాందోళనకు గురౌతున్నారని ఆవేదనంవ్యక్తంచేశారు. ప్రభుత్వం రెండుమద్యందుకాణాలను ఎత్తివేయకపోతే న్యాయస్థానంను ఆశ్రయిస్తామన్నారు.

## హాల్‌టిక్కెట్లు ఇవ్వలేదని విద్యార్థుల ఆందోళన



ఎస్ఐ భక్తవత్సలంకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థులు

**రైల్వేకోడూరు:** హాల్‌టిక్కెట్లు ఇవ్వని కారణంగా తాము దూరవిద్య పరీక్షలు రాయలేకపోయామని సోమవారం విద్యార్థులు శ్రీవిద్య, వేదవతి, హరి, మధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ మేరకు వారు రైల్వేకోడూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు సంబంధిత విద్యా సంస్థను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. వివరాల్లోకి వెళితే.. ఓ దూరవిద్య స్టడిసెంటర్‌లో దూరవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఈనెల27 నుంచి సెప్టెంబర్14 వతేదీ వరకు పీజీ, డిగ్రీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తాము రాజంపేటలోని డిగ్రీ కాలేజిలో పరీక్షలు రాయడానికి వెళ్లగా అక్కడికి హాల్‌టిక్కెట్లు ఇస్తామన్న యాజమాన్యం వాటిని ఇవ్వకపోవడంతో పరీక్ష కేంద్రం నిర్వాహకులు పరీక్షలు రాయనివ్వలేదని విద్యార్థులు వాపోయారు. చుదువుకుంటూ మధ్యలో నిలిపేసినవారు, ఉద్యోగులు దూరవిద్యను చదువుకుంటుంటారని పరీక్షలు రాయడానికి రాగా హాల్‌టిక్కెట్లు లేకపోవడంతో పరీక్షలు రాయలేదని స్థానిక ఏఐఎస్ఎఫ్ నాయకులు క్రిష్ణచైతన్య, రాజశేఖర్‌లను ఆశ్రయించి వారి ఆధ్వర్యంలో పోలీసులను కలిసి జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశారు. కాగా రైల్వేకోడూరు సీఐ కె.సాయినాథ్, ఎస్సై భక్తవత్సలంలు మీడియాతో మాట్లాడుతూ విద్యాపరంగా ఉన్న సమస్యలు యానివర్శిటీ, కాలేజి యాజమన్యాల పరిధిలో ఉంటాయని, యూనివర్శిటీస్థాయిలో పిర్యాదు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు యాజమాన్యంను కలసి తమగోడును విన్నవించుకున్నారు. డిస్టెంట్స్‌స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ మాట్లాడుతూ చాలామంది కాలేజి అడ్మిష్మన్ల ఫీజలు మాత్రమే చెల్లించారని, పరీక్షలకు సంబంధించిన ఫీజులు చెల్లించలేదని, అందువల్ల హాల్‌టిక్కెట్లు రాలేదన్నారు. ఫీజులు చెల్లించినవారికి మాత్రమే హాల్‌టిక్కెట్లు వచ్చాయని తెలిపారు. అయినా విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు తెప్పించి జరగబోవు పరీక్షలకు హాజరైరాయించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

## నంద్యాల గెలుపుపై సంబరాలు



కోడూరు టీడీపీ కార్యాలయంలో సంబరాలుచేసుకుంటున్న నాయకులు, కార్యకర్తలు



పెనగలూరులో మిఠాయిలు తినిపించుకుంటున్న టీడీపీ శ్రేణులు

**రైల్వేకోడూరు:** నంద్యాలలో టీడీపీ అభ్యర్థి భూమాబ్రహ్మానందరెడ్డి గెలుపు సందర్భంగా రైల్వేకోడూరు పార్టీకార్యాలయ ఆవరణలో సోమవారం డీసీసీబీ డైరెక్టర్ కస్తూరిచలమయ్యానాయుడు, సీఎం రాచపల్లె సర్పంచ్ సంగరాజురవికుమార్‌రాజుల ఆధ్వర్యంలో భారీ ఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. భారీకేక్ కత్తిరించి అభిమానులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీసీవిభాగం అధ్యక్షుడు బత్తినగంగయ్యాయాదవ్, ఓబులవారిపల్లె వైస్ ఎంపీపీ గునిపాటిరాయుడు, పార్టీ మాజీమండల అధ్యక్షుడు పందేటి వెంకట్రామరాజు, సీనియర్ నాయకులు బొక్కసచలపతి, అనుముల గుండంచంద్రశేఖర్, కల్లాచలపతి, గల్లాశ్రీనివాసులు, వేమనసుబ్రమణ్యంనాయుడు, ఎం.శంర్‌రాజు, జనార్ధన్‌రాజు, సుబ్బరాజు, వెంకటేశ్వర్లు, మధుసూధన్‌రాజు, బండిక్రిష్ణయ్య, మాదవరంపోడు సర్పంచ్ కంచిరాజురామరాజు, మార్కెట్‌కమిటీడైరెక్టర్ దామోదర్‌రాజు, మహిళానాయకురాలు గోవిందులక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### పుల్లంపేటలో..

**పుల్లంపేట :** నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి భారీ మెజార్టీ తో గెలుపొందడంతో పుల్లంపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు శుభాకాంక్షలు తెలుపుకొని స్వీట్లు తినిపించుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు లింగుట్ల వెంకటరమణ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన నంద్యాల ఉప ఎన్నికతో వచ్చే ఎన్నికల్లోకూడా తెలుగుదేశం పార్టీ అఖండ మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు హుస్సేన్‌బాషా, జిల్లా టీడీపీ కార్యదర్శి వెంకటసుబ్బయ్యయాదవ్, తెలుగుయువత అధ్యక్షుడు ఆరేసుధాకర్, మాజీ సర్పంచ్ గండికోటకృష్ణయ్య, కాపెర్ల నారాయణనాయుడు, కేసినేని నారాయణణాయుడు తదితరులు పాల్గొన్నారు.

### పెనగలూరులో..

**పెనగలూరు :** నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి 27.466ఓట్ల మెజారిటీతో గెలుపొందడం పట్ల మండలంలోని టీడీపీ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరిసంది. ఈ సందర్భంగా ఎంపీపీ చాంబర్‌లో మండల పార్టీ అధ్యక్షుడు కొత్తబాలకృష్ణ అధ్యక్షతన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలకు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల వల్లే టీడీపీ విజయం సాధించిందన్నారు. సమావేశంలో శామా మురళీ, కె.పెద్దకృష్ణయ్య, శామా రామ్మోహన్‌నాయుడు, కాకర్లవారి పల్లెపంచాయతీ అధ్యక్షుడు నరసింహులు, వంట రమణ, సిద్దవరం యానాదయ్య, హబీబుల్లా, వెంకటేశ్వర్లు, ధనుంజేయనాయుడు, ఆంజనేయులనాయుడు, కోడూరు వాసు, కొత్త మధు, హబీబుల్లా, బి.మురళీ తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ పట్ల ప్రజల నమ్మకమే నంద్యాల గెలుపు

**చిట్వేలి :** తెలుగుదేశం పార్టీపై ప్రజలకున్న అపారమైన నమ్మకమే నంద్యాల ఉప ఎన్నికలలో టీడీపీని అత్యధిక మెజారిటీతో గెలుపు సాధ్యమైందని చిట్వేలి మండల టీడీపీ అధ్యక్షుడు కస్తూరి కోటేశ్వరచౌదరి అన్నారు. నంద్యాలలో గెలుపు పట్ల సోమవారం చిట్వేలి కొత్తబస్టాండులో మండల పార్టీ నాయకులు విజయోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారీగా బాణా సంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అందరికి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుండయ్యానాయుడు, కో-ఆప్షన్ సభ్యుడు గులాం బాషా, లారీ సుబ్బరాయుడు, గుండయ్యానాయుడు, నరసింహులు, నాగార్జున, బాలు రామాంజనేయులునాయుడు, గూడూరు నాగరాజు, వెంకటసుబ్బయ్యానాయుడు, లక్ష్మీనరసయ్య, పెంచలరెడ్డి, కోటేశ్వరనాయుడు చిన్నారాయల్ తదితరులు పాల్గొన్నారు.



చిట్వేలి విక్టరీ గుర్తుతో టీడీపీ నాయకులు

### భూమా బ్రహ్మానందరెడ్డి విజయంలో

## ప్రభుత్వ విప్ మేడా కీలకపాత్ర



నంద్యాల టీడీపీ సంబరాల్లో మంత్రి అఖిలప్రియతో ప్రభుత్వ విప్ మేడామల్లికార్జునరెడ్డి

**రాజంపేట:** నంద్యాలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి విజయంలో రాజంపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డి విశేష కృషి చేశారు. తన కాలికి ఆపరేషన్ చేసినప్పటికి ఏమాత్రం లెక్కచేయకుండా విప్ నెలరోజుల పాటు నంద్యాలలో ఉంటూ తన అనుచరులతో ఇంటింటి ప్రచారం చేసి పార్టీ అభ్యర్థి విజయానికి తోడ్పడారు. ఈసందర్భంగా విప్ నెల రోజుల పాటు మంత్రి అఖిలప్రియతో కలిసి నంద్యాలలో విస్తృతంగా ప్రచారం చేసి టీడీపీ అభ్యర్థి విజయానికి కృషి చేశారు. టీడీపీ అభ్యర్థి ఘన విజయం పట్ల రాజంపేట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యోగీశ్వర్‌రెడ్డి, సురేష్‌రాజు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజంపేట నుంచి మేడా అనుచరులు భారీగా బాణా సంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

## వైభవంగా వసంతోత్సవాలు

**పెనగలూరు :** వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా సిద్దవరం, ఇండ్లూరు, పి.కొత్తపల్లె, పెనగలూరు, నారాయణనెల్లూరు, బెస్తపల్లె గ్రామాల్లో ప్రతిష్టించిన వినాయకుని విగ్రహాలను సోమవారం నిమజ్జనం చేశారు. నాలుగు రోజుల పాటు ప్రత్యేకంగా పూజలు చేయడంతోపాటు వచ్చిన భక్తులకు దాతలు అన్నదానాలు చేశారు. ఇదిఇలా ఉండగా ఉదయం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించి విజేతలకు నగదు పారితోషకం అందజేశారు.

## నంద్యాలలో టీడీపీ విజయంతో సంబరాలు

**ఓబులవారిపల్లె :** నంద్యాల శాసన సభ స్థానానికి జరిగిన ఉప ఎన్ని కలలో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి గెలుపుతో ఓబుల వారిపల్లె మండలంలోని బి.కమ్మపల్లెలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోడూరు జనార్ధన్ నాయుడు మాట్లాడుతూ 2019ఎన్నికల్లో వైసీపీ పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేమన చంద్రశేఖర్‌నాయుడు, జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయుడు, ఎన్‌ఆర్‌ఐ గంగాధర్‌నాయుడు, వేమన సుబ్బానాయుడు, నాయకులు వేమన సుబ్రమణ్యంనాయుడు, వేమన చెంగయ్యానాయుడు పాల్గొన్నారు.

# మరుగుదొడ్లు కట్టుకున్నా.. బిల్లులు ఇవ్వరా..?





మండల సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం,హాజరైన స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు

**రైల్వేకోడూరురూరల్ :** ఓడీఎఫ్ గ్రామంగా గుర్తించి 100 మరుగుదొడ్లు నిర్మించుకుని ఏడాది గడుస్తున్నా లబ్ధిదారులకు బిల్లులు చెల్లించరు ఎందుకని? వీపీఆర్ కండ్రిక సర్పంచ్ కుంచం పెంచలయ్య అధికారులను ప్రశ్నించారు. ఆ మేరకు సోమవారం ఎంపీపీ ఆవులకుంట్ల అనసూయమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశంలో మండల అధికారులను ఆయన నిలదీశారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ ఛైర్మన్ నేలపాటి రామచంద్రనాయుడు, జడ్పీటీసీ సభ్యురాలు మారెళ్ళ రాజేశ్వరి, ఎంపీడీవో సంజీవరావు, హౌసింగ్ డీఈ కుప్పుస్వామిలు ముఖ్యఅతిథులుగా హాజరై పలు శాల పనితీరు, నిర్ధేశించిన లక్ష్యాలు, సాధించిన అభివృద్ధిపై చర్చలు జరిపారు. మండలంలో ఉపాధిహామీపథకం అమలుపై పలువురు సర్పంచులు హర్షం వ్యక్తంచేశారు. స్థానిక ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్, వెలుగు శాఖలు బిల్లులు చెల్లింపుల్లో అయోమయం నెలకొందని ఏశాఖ ఏ బిల్లులు చెల్లిస్తారో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయని పలువురు సభ్యులు ఆరోపించారు. సీజనల్ జ్వరాలు ప్రబలు తున్నాయని చర్యలు చేపట్టాలని కొందరు సర్పంచులు అధికారుల దృష్థికి తీసుకువచ్చారు. చాలామంది అధికారులు సర్వ సభ్య సమావేశానికి హాజరుకాకపోవడంతో చప్పగా సమావేశం జరిగింది. ఈకార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు గడికోట సుమతి, స్థానిక సర్పంచ్ తిప్పన క్రిష్ణయ్య, కంచిరాజురామరాజు, దివిటి మోహన్, ఎంపీటీసీ సభ్యులు శోడిశెట్టి భాస్కర, మండల శివయ్య తదితరలు పాల్గొన్నారు.

# జ్వరపీడితులకు మెరుగైన వైద్యం



చింతరాజుపల్లె దళితవాడలో పారిశుధ్య పనులు చేయిస్తున్న అధికారులు

**ఒంటిమిట్ట :** ఒంటిమిట్ట మండలం మారుమూల అటవీ ప్రాంతమైన చింతరాజుపల్లెలోని జ్వరపీడితులకు మెరుగైన వైద్యసేవలు అందాయి. అలాగే అధికారులు ముమ్మరంగా పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఆంధ్ర జ్యోతి దినపత్రికలో సోమవారం చింత రాజుపల్లెను వణికిస్తున్న విషజ్వరాలు.. 60మందికి అస్వస్థత అనేక శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై వైద్య ఆరోగ్య, పంచాయతీ అధికారులు స్పందించారు. చింతరాజు పల్లె దళితవాడకు చెందిన 20మంది జ్వరపీడితులకు ఒంటిమిట్టలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి రాజశేఖ

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

ర్ ఆధ్వర్యంలో రక్తపూతలు తీసి సెలైన్ బాటిల్‌లోకి ఎక్కించి మందులు అందజేశారు. జ్వరాలు సోకితే ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్ళకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికే రావాలని ఈ సందర్భంగా వైద్యాధికారి రాజశేఖర్ సూచించారు. అలాగే వైద్యసిబ్బంది సోమవారం చింతరాజుపల్లె దళితవాడ, బోయపల్లె, పత్రపల్లెలకు వెళ్ళి జ్వరపీడితులకు మందులు అందజేశారు. అదేవిధంగా ఈవోపీఆర్‌డి సుబ్బరాయుడు, పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి, సర్పంచ్ బొడ్డే చిన్నవెంకటయ్యలు కూడా పారిశుధ్యం మెరుగు పరిచే చర్యలు చేపట్టారు. ట్యాంకులను ఫ్లోరినేషన్ చేయించారు. ఇళ్ళచుట్టూ, వీధుల్లో బీచింగ్, సున్నంమిశ్రమాన్ని చల్లించారు. ఇళ్ళపరిసరాల వద్ద ఉన్న ముళ్ళ కంపను జేసీబీతో తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రజలపై ఉందని, అపరిశుభ్రత వల్ల రోగాలు వ్యాప్తి చెందుతాయని వారు సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

**పుల్లంపేట :** పుల్లంపేట బైపాసు రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో టాటా ఏసీ డ్రైవర్ సతీష్, రాయచోటికి చెందిన సూపర్‌వైజర్ పసుపులేటి రవీంద్ర బాబులు గాయపడ్డాడు. డ్రైవర్ టాటా ఏసీ వాహనంలో ఇరుక్కుపోవడంతో స్థానిక పోలీసులు, పెట్రోలింగ్ పోలీసులు శ్రమించి సతీష్‌ను బయటకు తీశారు. అనంతరం గాయపడిన వారిద్దరినీ రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో తరలించి ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించినట్లు ఆయన తెలిపారు. ఈ సంఘటనపై పుల్లంపేట ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇరువర్గాల ఘర్షణ ఆరుగురికి గాయాలు

**ఒంటిమిట్ట :** మండలంలోని మంటపం పల్లె దళితవాడలో రెండు వర్గాల వారు ఘర్షణ పడడంతో 6మందికి గాయాలయ్యాయి. దళితవాడలోని గుడి దగ్గర భజన జరుగుతున్న సమయంలో పాతకక్షల కారణంగా దొడ్డి బలరాం, దొడ్డి రాము అనే వ్యక్తులపైన అనుపల్లెపెంచలయ్య, అతని కుమారుడు పెంచలయ్య, శివాజీ అనే ముగ్గురు కలిసి కత్తులతో దాడి చేశారు. ఈ దాడిలో దొడ్డి బలరాం, దొడ్డి రాములకు రక్తగాయాలయ్యాయి. అనంతరం సర్పంచ్ దొడ్డి నారాయణ, నరసింహులు, దొడ్డి రాము, బలరాం అనే నలుగురు కలిసి అనుపల్లె పెంచలయ్యతో పాటు అతని భార్య, కుమారులు, కుమార్తెలపై కట్టెలతో దాడి చేశారు. ఈ దాడిలో అనుపల్లె పెంచలయ్య కుటుంబ సభ్యులకు రక్తగాయాలయ్యాయి.

# దామనచెర్లలో ప్రభుత్వ భూమి ఆక్రమణ



వీఆర్వోకు ఫిర్యాదు చేస్తున్న ఎస్టీలు

**పెనగలూరు :** మండలం లోని కొత్తదామనచెర్లలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. సర్వేనెంబర్ 14/1, 14/2లో 10ఎకరాల పైబడి లంకాయానాది, మైలపల్లె రామయ్యలు జేసీబీలు పెట్టి ఆక్రమించేసి చదును చేశారు. ఇదిఇలా ఉండగా దామన చెర్ల ఎస్టీ కాలనీ ఆనుకొని ఈ కార్యక్రమం చేపట్టడంతో కొంత మంది ఎస్టీల పూరిళ్లను కూడా కూలదోసేందుకు దురాక్రమణదారులు వెనుకాడలేదు. తమకు అధికారులే దిక్కు అన్నట్లు సుమారు 10మంది యానాదులు సోమవారం రెవెన్యూ కార్యాలయానికి వచ్చి వీఆర్వో ఖాదర్‌బాషాకు ఫిర్యాదు చేశారు. ఎలాగైనా తమ గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమి దురాక్రమణ ఆనుకొని భావితరాల కోసం ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వ భూమిని కాపాడాలని ఎస్టీలు కోరారు. ఇదిఇలా ఉండగా అధికారులకు తమ గోడు చెప్పుకునేందుకు వచ్చిన ఎస్టీలను అధికార పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకుడు బెదిరించినట్లు సమాచారం. ఇదిఇలా ఉండగా భూమి దురాక్రమణలకు పెట్టింది పేరైన వెలగచెర్ల గ్రామ వాసులు చివరకు మల్లెమడుగు నుంచి దామనచెర్లకు వచ్చి పునరావాసం ఏర్పరుచుకున్న ఎస్టీలను కూడా తీవ్రంగా భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయంపై వెలగచెర్ల వీఆర్వో ఖాదర్‌బాషాను వివరణ కోరగా ఈ సమస్య ఇప్పుడే తమ దృష్టికి వచ్చిందని, వెంటనే వెళ్ళి పరిశీలిస్తామన్నారు.

## రీజెన్సీ నలందాలో సాఫ్ట్‌బాల్ శిక్షణశిబిరం

**రాజంపేట టౌన్ :** పట్టణంలోని రీజెన్సీ నలందా పాఠశాలలో సోమవారం సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరాన్నివిద్యాసంస్థల సీఏవో సబ్బినేని ప్రవీణ్‌కుమార్‌చౌదరి ప్రారంభించారు. వివిద పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ శిబిరానికి చేరుకొని శిక్షణను ప్రారంభించారు. ముందుగా సీఏవో ప్రవీణ్ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సాఫ్ట్‌బాల్‌శిక్షణ శిబిరంను ప్రారంభించి మాట్లాడుతూ క్రీడాకారులకు మూడు రోజుల పాటు అవసరమైన భోజన వసతులను కల్పించి ఒంగోలులో 1, 2, 3వతేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని కడప జట్టు ప్రథమ స్థానంలో గెలుపుసాధించాలని ఆకాంక్షించారు. అనంతరం పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.వెంకటేష్‌నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు కళ్యాణ్‌సాయి, కడప జిల్లా కోచ్ జివాజీనాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

# నంద్యాలలో టీడీపీగెలుపు జగన్‌కు చెంపపెట్టు

**రైల్వేకోడూరు:** నంద్యాలలో టీడీపీ గెలుపు జగన్ చెంపపెట్టుఅని ఓబులవారిపల్లె మండల ఉపాధ్యక్షుడు గునిపాటిరాయుడు, సీఎంరాచపల్లె సర్పంచ్ సంగరాజురవికుమార్‌రాజు, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు బత్తినగంగయ్యయాదవ్‌లు తెలిపారు. సోమవారం నంద్యాలలో టీడీపీ అభ్యర్థి భూమాబ్రహ్మానందరెడ్డి గెలుపుతో రాష్ట్రంలో వైసీపీఖాళీ అయిందని, రాయలసీమ జిల్లాల్లో జగన్ ప్రాబల్యం తగ్గిపోయిందని, రాష్ట్రముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధితో రాష్ట్రం ముందుకు పోతుందన్నారు.

నంద్యాల ఉప ఎన్నిక నీతికి అవినీతికి మధ్య జరిగిందని తెలిపారు. రాబోవు ఎన్నికల్లో కడప జిల్లా పూర్తిగా టీడీపీయే కైవసంచేసుకుంటుందని తెలిపారు. ప్రజలు చంద్రబాబును మరోసారి ముఖ్య మంత్రిగా చూడడానికి ఓటుతో జగన్‌కు బుద్ధిచెప్పారని తెలిపారు.

## పల్లెనిద్రలో సమస్యలు తెలుసుకోండి

**పుల్లంపేట :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు పల్లె నిద్రలో పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకోవాలని ఎంపీడీవో ఎస్‌ఎండీ హుస్సేన్, తహశీల్దార్ గౌరీశంకర్‌లు తెలిపారు. పల్లె నిద్రపై సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు సమావేశమై ఒక్కొక్క పంచాయతీకి ఒక్కొక్క అధికారికి కేటాయిస్తూ ఆయా పంచాయతీల్లో పల్లె నిద్రలో పాల్గొని పేదల సమస్యలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రంగనాధయ్య, వెలుగు ఏపీఎం వెంకటరమణ, ఏపీవో చంద్రకళ, సీహెచ్‌వో కృష్ణమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్‌ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, ఈవోఆర్‌డి నాగార్జునరావు, హౌసింగ్ ఏఈ పద్మనాభయ్య, ఏవో కృష్ణచైతన్య, పంచాయతీరాజ్ ఏఈ ప్రతాప్, ఇరిగేషన్ ఏఈ బాబు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీదు పండుగను ఘనంగా జరుపుకోండి

**రాజంపేట టౌన్ :** సెప్టెంబర్ 2న బక్రీదు పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తావు లేకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు రాజంపేట డీఎస్పీ రాజేంద్ర అన్నారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బక్రీదు పండుగపర్వదినం సందర్భంగా రాయచోటి రోడ్డులో ఉన్న చెక్‌పోస్టు వద్ద, కోడూరులో మరొక చెక్‌పోస్టు వద్ద పోలీసులు నిఘాను ఉంచి తనిఖీలు చేస్తున్నామన్నారు. ముస్లిం సోదరులు పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలన్నారు. అలాగే ఇప్పటికే సుమారు 1000విగ్రహాలకు పైగా నిమజ్జనం అయ్యాయన్నారు. రైల్వేకోడూరు నుంచి మొదలుకొని మంగంపేట, చిట్వేలి, పోలిచెరువు, సిద్దవటం తదితర చోట్ల నిమజ్జనం ఏర్పాట్లను చేసి ఉన్నామన్నారు. భక్తులు, ప్రజలు వారివారి నిమజ్జన గణనాథులను వారికి అనువైన ప్రాంతాలకు తీసుకెళ్ళి ప్రశాంతంగా నిమజ్జనం గావించాలన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరిగినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

# దినఫలాలు




**అదృష్ట సంఖ్యలు : 2, 9**



**మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20):** సమావేశాలు, వేడుకల్లో ఆశాభంగం కలుగుతుంది. వృత్తి, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఉన్నత విద్య కోసం చేసే ప్రయత్నాలు ఫలించకపోవచ్చు.



**వృషభరాశి: (ఏప్రిల్21-మే20):** ప్రియతముల ఆరోగ్యం కలవరపెడుతుంది. ఖర్చులు అంచనాలు మించుతాయి. పెట్టుబడులు, పొదుపు పథకాల విషయంలో ఆచితూచి వ్యవహరించాలి. ఆర్థిక లావాదేవీల్లో గత అనుభవం ఉపయోగపడుతుంది.



**మిథునరాశి: (మే21-జూన్21):** శ్రీవారు, శ్రీమతి వైఖరి ఆవేదన కలిగిస్తుంది. వేడుకలకు ఏర్పాట్లలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. బంధుమిత్రుల కారణంగా మనస్తాపానికి గురవుతారు. అనుబంధాలు విస్తరిస్తాయి.



**కర్కాటకరాశి: (జూన్22-జూలై23):** ఇంటర్వ్యూలలో నిరాశ ఎదురవుతుంది. వైద్యం, పరిశ్రమలు, హోటల్, రిటైల్ రంగాల వారికి ఒక సమాచారం కలవరం కలిగిస్తుంది. సన్నిహితుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి. విందుల్లో ఖర్చులు అధికం.



**సింహరాశి: (జూలై24-ఆగస్ట్23):** ప్రియతముల కోసం ఖర్చులు అంచనాలు మించుతాయి. పెట్టుబడుల్లో ఆచితూచి వ్యవహరించాలి. విద్యార్థులకు అవసరమైన నిధులు అందడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.



**కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23):** బదిలీలు, మార్పులు అసౌకర్యం కలిగిస్తాయి. రియల్ ఎస్టేట్, గృహనిర్మాణ రంగా వారు కీలక నిర్ణయాలు వాయిదా వేయడం మంచిది. కుటుంబ సభ్యుల వైఖరి గురించి ఆలోచిస్తారు.



**తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23):** ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంది. స్టేషనరీ, రవాణా, బోధన, రచనా రంగాల వారికి ఆటంకాలు ఎదురవుతాయి. వాగ్వివాదాలకు దూరంగా ఉండాలి.



**వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22):** ఆర్థిక సంస్థలతో పనులు పూర్తి కావడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. ఖర్చులు అంచనాలు మించే అవకాశం ఉంది. బృందకార్యక్రమాలకు అవసరమైన నిధులు సర్దుబాటు కావడంలో ఆలస్యం జరుగుతుంది.



**ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21):** కొత్త ప్రాజెక్టుల ప్రారంభానికి తగిన సమయం కాదు. వృత్తి, వ్యాపారాల్లో ప్రయోగాలను వాయిదా వేయండి. పెద్దల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి.



**మకరరాశి(డిసెంబర్22-జనవరి21):** ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో ఊహించని అవాంతరాలు ఎదురవుతాయి. ప్రయాణాలు, చర్చలు ఫలించకపోవచ్చు. దూరంలో ఉన్న వ్యక్తులకు సంబంధించిన సమాచారం కలవరపెడుతుంది.



**కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18):** సమావేశాలు, వేడుకలు, బృంద కార్యక్రమాల కోసం ఖర్చులు అధికం. ఆర్థిక విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలి. పూర్వ మిత్రులను గుర్తు చేసుకుంటారు. విలువైన వస్తువుల కొనుగోలు సమయంలో జాగ్రత్త అవసరం.



**మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20):** ఉన్నత పదవుల విషయంలో నిరాశకు గురవుతాయి. పెద్దలు, పైఅధికారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. సమావేశాల్లో ఈ గౌరవ, మర్యాదలకు భంగం కలిగే పరిణామాలు చోటుచేసుకుంటాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

# ప్రజాసమస్యలు వెంటనే పరిష్కరించాలి

● కలెక్టర్ బాబూరావునాయుడు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ బాబూరావునాయుడు

**కడప, కోటిరెడ్డిసర్కిల్ :** ప్రజల వినతులు పరిష్కరించి న్యాయం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్సెల్స్ కార్యక్రమంలో కలెక్టర్ బాబూరావు నాయుడు లబ్ధిదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ దూరప్రాంతాల నుంచి కష్టాలకు ఓర్చి ఇక్కడకు సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆశతో వస్తారని వారి ఆశను వమ్ము చేయరాదని వారి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల సమస్యలను కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించి మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు తగు చర్య నిమిత్తం అందజేశారు. కడపకు చెందిన జీఎం నాగమునెమ్మ తనకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని కోరింది. అట్లూరు మండల కేంద్రానికి చెందిన సుబ్బారెడ్డి మరికొందరు తమ భూములు సోమశిల ముంపుకు గురయ్యాయని అందుకు సంబంధించి నష్టపరిహారాన్ని ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కడప అక్కాయపల్లెకు చెందిన రామక్రిష్ణనాయక్ తమ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ పనులు చేయించాలని కోరారు. పెండ్లిమర్రి మండల కేంద్రానికి చెందిన ఎల్.రామనాథరెడ్డి తన గ్రామంలో ప్రభుత్వ భూములను ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో జేసీ-2 శివారెడ్డి, ప్రత్యేక కలెక్టర్ నాగేశ్వరరావు, డీఆర్వో నరసింహారావు, డీఆర్డీఏ పీడీ రామచంద్రారెడ్డి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు చట్టాలపై అవగాహన అవసరం

● సీనియర్ సివిల్ జడ్జి ప్రసాద్




సదస్సులో మాట్లాడుతున్న జడ్జి యు.యు. ప్రసాద్

**కడప లీగల్:** జర్నలిస్టులకు చట్టాలపై అవగాహన ఉండడం వల్ల విధి నిర్వహణలో వార్తలు రాయడానికి, సమస్యలు ఎదురైనప్పుడు పరిష్కరించుకోవడానికి ఎంతగానో దోహదపడుతుందని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి యు.యు.ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పటేల్ రోడ్డులోని మిత్ర యోగా సెంటర్‌లో రైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా విలేకరులకు పలు చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పాత్రికేయులు ఎన్నో ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్నారన్నారు. విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూనే ప్రజలకు ప్రభుత్వాలకు వారధులుగా ఉంటూ పలు సమస్యలకు పరిష్కార మార్గాలను చూపుతున్నారన్నారు. ఇలా అనునిత్యం పనిచేస్తున్న పాత్రికేయులు సమాజంలోని రుగ్మతలపై మరింతగా దృష్టిని సారించాలన్నారు. నేటికి సమాజంలో బాల్య వివాహాలు జరుగుతున్నాయని వీటిని వెలుగులోకి తెచ్చి కట్టడి చేసేలా చూడాలన్నారు. ఇందుకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల అక్రమ రవాణా చట్టరీత్యా నేరమన్నారు. అందుకు కఠిన శిక్షలు ఉన్నాయన్నారు. మాధ్యమిక విద్య పట్ల బాలికలను ప్రోత్సహించాలన్నారు. వృత్తి విద్యా నైపుణ్య కోర్సులను మహిళలకు, బాలికలకు నేర్పేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. వివాహ వయసు పురుషునికి 21, స్త్రీకి 18 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. మనోవర్తి చట్టం, సెక్షన్-8, గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైడ్ సంస్థ నిర్వహకులు సుభాష్ యాదవ్, డాక్టర్ రఘునాథ్‌రెడ్డి, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా పాత్రికేయులు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## వైవీయూ సీడీసీ డీన్‌గా
# ప్రొఫెసర్ షావల్లీఖాన్ బాధ్యతలు



వైవీయూ సీడీసీ డీన్‌గా ప్రొఫెసర్ షావల్లీఖాన్ బాధ్యతలు స్వీకరణ

**కడప, వైవీయూ:** యోగివేమన విశ్వవిద్యాలయం కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) డీన్‌గా ప్రొఫెసర్ షావల్లీఖాన్‌ను నియమిస్తూ వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చంద్రయ్య సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వర్శిటీ వీసీ ప్రొఫెసర్ రామచంద్రారెడ్డి సూచన మేరకు ఈ అదేశాలు వెలవడ్డాయి. ప్రొఫెసర్ షావల్లీఖాన్ వీసీ రిజిస్ట్రార్ సమక్షంలో సి.డి.సి డీన్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ప్రొఫెసర్ షావల్లీఖాన్ వర్శిటీలో బాటనీ విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈయన గతంలో వైవీయూ డీఓఏ డైరెక్టర్‌గా, ఎన్ఎస్ఎస్ యూనివర్శిటీ కోఆర్డినేటర్‌గా పనిచేశారు. పరిపాలనా పరంగా అనుభవం ఉన్న వ్యక్తిగా గుర్తింపు ఉంది. ఈయన విద్యాభ్యాసం డిగ్రీ నుంచి పీహెచ్‌డీ వరకు శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీలోనే జరిగింది. పరిశోధనలు సైతం వివిధ జర్నల్స్‌లలో మంచి ఇపాంక్ట్ ఉన్న జర్నల్స్‌లలో సైతం పరిశోధక పత్రాలు ప్రచురితమయాయి. సీడీసీ డీన్‌గా ప్రొఫెసర్ షావల్లీ ఖాన్ నియామకం కావడం పట్ల వర్శిటీలోని అధ్యాపకులు, పరిశోధకులు, సిబ్బంది, విద్యార్థులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. డిగ్రీ కళాశాల అనుమతుల విషయంలో సీడీసీ డీన్ ఎలా వ్యవహరిస్తారని ప్రస్తుతం యూనివర్శిటీలో ఆసక్తికరంగా చర్చ జరుగుతుంది. ఈ నెల 31న వైవీయూ అనుబంధంగా ఉన్న 175 కళాశాలకు సంబంధించి పూర్తి స్థాయి విచారణ జరగనుంది. కొన్ని కళాశాలల సరళి ధృవపత్రాలు జతపరిచి వర్శిటీ నుంచి అనుమతి పొందామని రాయలసీమ విద్యార్థి వేదిక జిల్లా కన్వీనర్ నాగార్జున తదితరులు వర్శిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై సీడీసీ అధికారిగా ప్రొఫెసర్ షావల్లీఖాన్ ఎలా స్పందిస్తారని, ఎన్ని కళాశాలల అనుమతులు వస్తాయోనని డిగ్రీ కళాశాల యాజమాన్యాలు చర్చించుకుంటున్నాయి. ప్రొఫెసర్ షావల్లీఖాన్ యూనివర్శిటీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని, పారదర్శకంగా విధులు నిర్వహిస్తానన్నారు.

# ఐటీఐ ప్రవేశానికి 30న కౌన్సెలింగ్

**కడప, అర్బన్:** ప్రభుత్వ గురుకుల బాలికల ఐటీఐలో వివిధ కోర్సులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 30వ తేదీ ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ జరుగుతుందని సంస్థ ప్రిన్సిపాల్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.


***ప్రభుత్వ గురుకుల ఐటీఐలో జాబ్‌మేళా***

ఈ నెల 30వ తేదీ ప్రభుత్వ గురుకుల బాలికల ఐటీఐలో శ్రీసిటీ వారిచే సెల్‌ఫోన్ అసెంబ్లీ యూనిట్‌లో పనిచేసేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నారన్నారు. బాలికలు మాత్రమే అర్హులని తెలిపారు. అభ్యర్థులు 18 ఏళ్ల వయసు కలిగి ఐటీఐ లేదా ఇంటర్ సర్టిఫికెట్ కలిగి వుండాలని, జీతం నెలకు రూ.7500, ఉచిత వసతి వుంటుందన్నారు. ఆసక్తి గల వారు తమ ఆధార్‌కార్డు, సర్టిఫికెట్లతో 30న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ గురుకుల బాలికల ఐటీఐలో హాజరుకావాలన్నారు. వివరాలకు 8886990597ను సంప్రదించాలని కోరారు.

# వరకట్న వేధింపు కేసులో జైలుశిక్ష

**కడప, క్రైం:** కట్టుకున్న భార్యను అధిక కట్నం కోసం వేధింపులకు గురిచేసిన కేసులో భర్తతో పాటు అత్తమామలకు రెండేళ్లు కఠిన కారాగార శిక్షతో పాటు ఒకొక్కరికి రూ.3 వేలు చొప్పున జరిమానా విధిస్తూ సోమవారం ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఆర్.అశోక్‌కుమార్ తీర్పునిచ్చినట్లు కడప మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ వాసుదేవన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు రవీంద్రనగర్‌కు చెందిన సయ్యద్‌యాస్మిన్‌ను రాజంపేటకు చెందిన అబ్దుల్ మొనాఫ్‌తో 2008లో వివాహం జరిగింది. కట్నంగా 20 తులాల బంగారు నగలు, లక్ష నగదు, రూ.50 వేలు ఇంటి సామగ్రిని ఇచ్చారు. యాస్మిన్‌కు మతిస్థిమితం లేని పిల్లాడు పుట్టడంతో భర్త అబ్దుల్ మొనాఫ్, అత్త జరునీస్సా, మామ షేక్ అహ్మద్ బాషలు అధిక కట్నం కోసం వేధింపులకు గురి చేస్తుండడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు 2013లో వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి వారిపై నేరం రుజువు కావడంతో ముగ్గురికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు డీఎస్పీ తెలిపారు.

## దారి కనుక్కోండి



## జంబ్లింగ్ వర్డ్స్

1. LBIL ► ..............
2. DEIS ► ..............
3. WLLA ► ..............
4. DERI ► ..............

## జంతర్ మంతర్

1. బంనుఅధం ► ..............
2. తరంనిరం ► ..............
3. లపాపొడి ► ..............
4. చపందార ► ..............

## మీకు తెలుసా?




ఇంగ్లాండ్‌కు 600 ఏళ్లపాటు 'ఫ్రెంచ్' అధికార భాషగా కొనసాగింది.

## టంగ్ ట్విస్టర్స్

1. A big black bug bit a big black bear and made the big black bear bleed blood.
2. Larry Hurley, a burly squirrel hurler, hurled a furry squirrel through a curly grill.
3. The king would sing, about a ring that would go ding.
4. National Sheepshire Sheep Association

## ఔనా!



కవలలకు కూడా వేలిముద్రలు ఒకేలా ఉండవు.

## సూక్తి

ఏ పనిలోనైనా అత్యుత్తమ ప్రదర్శన చూపించు. అప్పుడు ఒక విజయం మరో విజయానికి పునాదిగా నిలుస్తుంది.

# ఆకాశమే హద్దుగా..





**నిండైన ఆత్మవిశ్వాసంతో.. ఏదైనా చేయగలను.. ఎప్పటికైనా సాధించగలను అని అడుగు ముందుకు వేస్తే... విధి వెక్కిరించినా.. సంకల్పంతో అనుకున్నది సాధిస్తే.. ఈ ప్రపంచమే నీకు సలామ్ చేస్తుంది. సమాజం కీర్తిస్తుంది. ప్రతి ఒక్కరూ నిన్ను చూసి స్ఫూర్తి పొందుతారు. పుట్టుకతోనే రెండు చేతులు లేకపోయినా ఏనాడూ అధైర్యపడలేదా చిన్నారి. వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఐదేళ్లకే సైకిల్ నేర్చుకుని ఔరా అనిపించుకుంది రూత్ ఎవ్లిన్ ప్రాంకే.**

ఆమె పేరు రూత్ ఎవ్లిన్ ప్రాంకే. పుట్టుకతోనే చేతులు లేవు. కానీ ఆ చిన్నారిలో పట్టుదల మాత్రం కొండంత ఉంది. ఏదైనా చేయగలను అనే ఆత్మవిశ్వాసం ఆమె సొంతం. అందరిలానే తాను అన్ని పనులు చేసుకోగలదు. బ్రష్ చేసుకుంటుంది, బొమ్మలకు రంగులేస్తుంది, హోంవర్క్ అయితే సరేసరి! అన్నం కూడా తింటుంది. ఇటీవలే తాను సైకిల్ రైడ్ చేయడం కూడా నేర్చుకుంది. వైద్యులు ప్రత్యేకంగా రూపొందించిన 'బ్రేసెస్' ఆధారంగా రూత్ సైకిల్ హ్యాండిల్ చేస్తుంది. అమెరికాలోని మిన్నసోటాలో రూత్ కుటుంబం ఉంటుంది.

### రూత్ సంకల్పానికి ఆమే కారణం

జెస్సికా కాక్స్‌కు కూడా పుట్టుకతోనే రెండు చేతులు లేవు. జీవితంలో ఎన్నో అవరోధాలు దాటి తనకంటూ ఓ స్థానం సంపాదించుకున్న ధీర వనిత ఆమె. ప్రపంచంలోనే తొలి 'ఆర్మ్‌లెస్ ఎయిరోప్లేన్ పైలట్'గా చరిత్ర సృష్టించింది. గ్రాడ్యుయేట్ డిగ్రీతో పాటు, తైక్వాండోలో బ్లాక్ బెల్ట్ సాధించింది. మోటివేషన్ స్పీకర్‌గా ఎంతోమందిలో స్ఫూర్తినింపుతోంది. 'దివ్యాంగుల'కు మెంటర్‌గా వ్యవహరిస్తోంది. పియానో అద్భుతంగా ప్లే చేస్తుంది. జెస్సికా జీవితకథ 'రైట్ ఫుటెడ్' పేరుతో డాక్యుమెంటరీగా వచ్చింది. రూత్ తల్లి కర్లీన్ 'జెస్సికా' గురించి చెప్పడంతో రూత్ ఆలోచనల్లో ఎంతో మార్పు వచ్చింది. ఆ చిన్నారి ఆ రోజు నుంచి జెస్సికాను కలవాలని ఉవ్విళ్లూరింది.

### కల ఫలించింది.



కర్లీన్ తన కూతురు కోరిక తీర్చడానికి జెస్సికా గురించి గూగుల్‌లో ఎంతో శోధించింది. జెస్సికా ఫేస్‌బుక్ అకౌంట్ తెలుసుకుని తనతో మాట కలిపింది. తన కూతురు పరిస్థితి గురించి జెస్సికాకు వివరించింది. ఆ చిన్నారి కోరికనూ తెలియజేసింది. రూత్‌ను కలవడానికి జెస్సికా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంతే కూతురిని తీసుకుని కర్లీన్ అరిజోనాకు బయలుదేరింది. రూత్ కల ఫలించే సమయం రానే వచ్చింది. రూత్‌కు వంద అడుగుల దూరంలో జెస్సికా నిలుచుంది. ఒకరినొకరు చూసుకున్న ఆ ఇద్దరూ కొన్ని సెకన్ల పాటు నిశ్శబ్దంగా ఉండిపోయారు. రూత్, జెస్సికా దగ్గరికి ఆప్యాయంగా పరుగెత్తింది. చేతులు లేకపోతేనేం.. ప్రేమతో ఇద్దరూ ఆలింగనం చేసుకున్నారు. ఈ ఫొటో నెట్‌లో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

'రూత్‌ను చూడగానే నా చిన్నతనం గుర్తుకు వచ్చింది. నన్ను నేను మరోసారి తనలో చూసుకున్నాను. ఎంతో దూరం ప్రయాణించి నన్ను కలవడానికి వచ్చారు. ఆ ప్రేమను మాటల్లో చెప్పలేను. రూత్‌ను నాతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడింది. "నువ్వు నడిపే ఎయిర్‌ప్లేన్ ఏదీ" అని అడిగింది. వెంటనే తనను అక్కడికి తీసుకువెళ్లాను. అది చూసి రూత్ ఎంతో ఆనందించింది.'

**- జెస్సికా కాక్స్**



## నవ్వుల్ నవ్వుల్

శ్రీధర్ : అలా వర్షంలో తడిసి వచ్చేకంటే ఓ గొడుగు కొనుక్కొని రావచ్చు కదా!

మిస్టర్ మేధావి : కొన్నాను. కొత్తది కదా.. తీస్తే తడిసిపోతుందని... వాడలేదు.

శ్రీధర్ : !!!!!!!!

## చెప్పగలరా?

చీరలో ఉన్నా కానీ
మూరలో లేను
కరువులో ఉన్నా కానీ
ఎరువులో లేను
తాటిలో ఉన్నా కానీ
తారులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో
చెప్పగలరా?

## జవాబులు

చెప్పగలరా? : చీకటి

జంతర్‌మంతర్:
1. అనుబంధం 2. నిరంతరం
3. పాలపొడి 4. పంచదార

జంబ్లింగ్ వర్డ్స్:
1. BILL 2. SIDE
3. WALL 4. RIDE

## చుక్కలు కలపండి



# ఫాలో ఆన్‌లో వెస్ట్ గోదావరి

**కడప, స్పోర్ట్స్ :** నగరంలోని వైఎస్ఆర్ఆర్, ఏసీఏ, కేఎస్ఆర్ఎం, కేవోఆర్ఎం క్రికెట్ క్రీడా మైదానంలో జరుగుతున్న అండర్-16 అంతర్ క్రికెట్ టోర్నమెంట్‌లో వెస్ట్‌గోదావరి ఫాలో ఆన్‌లో పడింది. మరో మ్యాచ్‌లో విశాఖపట్నం రెండో ఇన్నింగ్స్‌లో పుంజుకుంది.

వైఎస్ఆర్ఆర్‌లో చిత్తూరు ఆధిక్యం

చిత్తూరు, వెస్ట్‌గోదావరి మ్యాచ్‌లో చిత్తూరు మొదటి ఇన్నింగ్స్ 288/9తో బ్యాటింగ్ ప్రారంభించి 298కి ఆలౌట్ అయింది. ఇందులో కరణ్‌కన్నన్ 43 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం ఇన్నింగ్ ప్రారంభించిన వెస్ట్‌గోదావరి 72.3 ఓవర్లలో 107 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో కేవీఎం శశాంక్ 23 పరుగులు చేశారు. ఫాలోఆన్ ఆడిన వెస్ట్ గోదావరి రెండో ఇన్నింగ్స్‌లో 33 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 81 పరుగులు చేసింది. ఇందులో కేఎస్ఎన్ రాజు 54 పరుగులు చేశారు. చిత్తూరు బౌలింగ్‌లో దీపక్ రామాంజుల, కరణ్‌కన్నన్ చెరో వికెట్ తీశారు.



చిత్తూరు-వెస్ట్‌గోదావరి మధ్య జరుగుతున్న మ్యాచ్

### కేఎస్ఆర్ఎంలో అటు ఇటు

నెల్లూరు-తూర్పుగోదావరి మ్యాచ్‌లో ఓవర్‌నైట్ స్కోర్ 4/2 తో ప్రారంభించిన తూర్పుగోదావరి 67.3 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో పాండురంగారాజు 66 పరుగులు చేశారు. నెల్లూరు బౌలింగ్‌లో అజిత్‌బాబు 4 వికెట్లు తీశారు. నెల్లూరు 34 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 54 పరుగులు చేసింది. ఇందులో సాయిమనీష్‌రెడ్డి 23 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. తూర్పుగోదావరి బౌలింగ్‌లో సూర్యచైతన్య మూడు వికెట్లు తీశారు.

### కేవోఆర్ఎంలో పుంజుకున్న విశాఖ

క్రిష్ణ-విశాఖ మ్యాచ్‌లో 83/4తో బ్యాటింగ్ ప్రారంభించిన క్రిష్ణ 76.3 ఓవర్లలో 130 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో సుబాని 45 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. విశాఖ బౌలింగ్‌లో శ్రీకర్‌సాయిరెడ్డి 5 వికెట్లు తీశారు. విశాఖ 76.4 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేశారు. ఇందులో నితీష్‌కుమార్ రెడ్డి 138 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. సుబాని మూడు వికెట్లు తీశాడు.

# ముఖ్యమంత్రిని కలిసిన సీఎం రమేష్

## నంద్యాల గెలుపుపై స్వీట్స్ తినిపించిన సీఎం చంద్రబాబు

**ఎర్రగుంట్ల:** నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించడంతో టీడీపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును అమరావతిలో సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ ఘనవిజయంతో అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు కేక్ కట్ చేసి ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఎంపీ సీఎం రమేష్‌తో పాటు, మంత్రులు అచ్చెన్నాయుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ తదితరులకు తినిపించారు. ఈ సందర్భంగా ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ నంద్యాల గెలుపు 2019 సార్వత్రిక ఎన్నికలకు శుభ సూచకమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన అభివృద్ధిని చూసి నంద్యాల ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. సమిష్టి కృషితో భారీ మెజారిటీ సాధించినట్లు తెలిపారు.

# ఫిర్యాదులపై స్పందిస్తున్న జిల్లా జడ్జి

## మాజీ ఎమ్మెల్యేకు షోకాజ్ నోటీసులు జారీ

**కడప లీగల్ :** కడప నగర నడిబొడ్డులో నిర్వహిస్తున్న గుడ్‌హార్ట్ ఫౌండేషన్ అక్రమాలను జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీనివాస్ వెలుగులోకి తెచ్చిన నాటి నుంచి ఆయనకు పలు సమస్యలపై ఫిర్యాదులు వెల్లువలా వచ్చి పడుతున్నాయి. ప్రతిరోజూ ఎంత లేదన్నా 10కి పైగా ఫిర్యాదులు ఉత్తరాలు, వినతిపత్రాల రూపంలో వస్తున్నాయి. తాజాగా జిల్లాలోని ఓ మాజీ ఎమ్మెల్యేపై జిల్లా జడ్జికి ఫిర్యాదు వచ్చింది. ఈ ఫిర్యాదులో మాజీ ఎమ్మెల్యే. ఆయన అనుచరుల అక్రమాలకు అడ్డులేదని, ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలు చేయడంతో పాటు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పెట్టిస్తున్నారని, పైగా పోలీసుల చేత అక్రమ కేసులను పెట్టిస్తున్నారని పేర్కొంటూ ఫిర్యాదు అందింది. అలాగే మైదుకూరులోని జడ్పీ హైస్కూల్‌కు చెందిన బాలికలు జిల్లా జడ్జి శ్రీనివాస్‌కు ఉత్తరం ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ ఉత్తరంలో తమ పాఠశాలలో 500 మంది విద్యార్థులం చదువుకుంటున్నామని, రెండు నెలల నుంచి మరుగుదొడ్లను శుభ్రం చేయడంలేదని, ఈ విషయాన్ని హెచ్ఎంకు తెలిపినా పట్టించుకోలేదని మీరైనా స్పందించి మాకు వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. పై రెండు ఫిర్యాదులపై జిల్లా ప్రధాన జడ్జి శ్రీనివాస్ స్పందించారు. ఈ మేరకు షోకాస్ నోటీసులను జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన జడ్జి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల నుంచి ప్రతి రోజూ ఫిర్యాదులు వస్తున్నాయని ఈ మేరకు వాటిని పరిశీలించి స్పందిస్తున్నామన్నారు. గ్రామాల్లో జరిగే అన్యాయాలపైన, రోడ్లు, మురికి కాలువల సమస్యలు, పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ఇలా అన్ని అరకాల సమస్యలు వస్తున్నాయన్నారు. వీటిపై స్పందించి సంబంధిత వారికి షోకాజ్ నోటీసులను జారీ చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

# కొనసాగుతున్న జాతీయ దినోత్సవ క్రీడా పోటీలు

**కడప, స్పోర్ట్స్ :** ఈనెల 29వ తేదీ మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా డీఎస్ఏ మైదానంలో కబడ్డీ, హాకీ, వాలీబాల్ క్రీడాపోటీలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం 7 గంటలకు డీఎస్ఏ మున్సిపల్ మైదానం నుంచి ఏడురోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహిస్తారు. సాయంత్రం విజేతలకు బహుమతులు ప్రదానం జరుగుతుంది.





## కొనసాగుతున్న నిమజ్జనం

ప్రొద్దుటూరు టౌన్: వినాయక నిమజ్జనం సోమవారం కూడా కొనసాగింది. ఉదయం నుంచి రాత్రి వరకు గణనాథులను నిమజ్జనానికి తరలించారు. యువకులు రంగులు చల్లుకుంటూ డప్పువాయిద్యాలతో నిమజ్జనానికి తరలించారు.


సుందరాచార్యుల వీధిలో కొలువైన గణనాథుడు

## బోర్ల కింద విస్తారంగా వరి సాగు



ప్రొద్దుటూరు కల్చరల్: మండలంలో బోర్ల కింద విస్తారంగా వరి సాగవుతోంది. బోర్ల కింద, కుందూ నది నీటి ద్వారా 420 హెక్టార్లకుపైగా వరి నాట్లు వేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. మండలంలోని తాళ్ళమాపురం నుంచి సీతంపల్లె వరకు కేసీ ఆయకట్టు ఉంది. ఆయకట్టుకు ఆలస్యంగానైనా నీరు వస్తోందని రైతులు ఆశిస్తూ బోర్ల నీటితో వరి నాట్లు వేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల కేసీ కాలువలో ఉన్న వరద నీటిని పైపుల ద్వారా పొలాలకువాడుకుంటున్నారు. చెన్నంరాజుపల్లె, నాగాయపల్లె, కామనూరు ప్రాంతాల్లో కూడా వరి నాట్లు జోరుగా సాగవుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతోపాటు కుందూ నది ఉధృతంగా ప్రవహిస్తుండడం, ఆ నీటిని పైపుల ద్వారా బోర్లలోని నీ టిని పథకాల ద్వారా వరి నాట్లు వేస్తున్నారు. పెన్నానది తీర ప్రాంతమైన చౌడూరు, శంకరాపురం, పెద్దశెట్టిపల్లె, దొరసానిపల్లె, నంగనూరువల్లెలో వరి సాగు చేస్తారు. రెండేళ్లుగా భూగర్భజలాలు అడుగంటడంతో వరి సాగుపై దృష్టి సారించలేదు. వేరుశనగ తదితర ఆరుతడి పంటలను సాగు చేస్తున్నారు. కొంత విస్తీర్ణం మాత్రమే వరి సాగవుతోంది. కేసీ ఆయకట్టు పరిధిలో 220 హెక్టార్లలో వరిసాగు చేయాల్సి ఉండగా ఆయా ప్రాంతాల్లో భూములు బీళ్లుగా మారాయి.

## సబ్సిడీ రుణాల్లో బీసీలకు అన్యాయం

**● స్క్రీనింగ్ సెలక్షన్ కమిటీలను రద్దు చేయాలి ● లబ్ధిదారుల ఆందోళన**

ప్రొద్దుటూరు అర్బన్: వ్యక్తిగత సబ్సిడీ రుణాల్లో బీసీలకు అన్యాయం జరుగుతోందని, స్క్రీనింగ్ సెలక్షన్ కమిటీలను రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొర్రె శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట వివిధ కార్పొరేషన్లకు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులతో కలిసి కాంగ్రెస్ నేతలు ఆందోళన చేపట్టారు. కార్యాలయ ద్వారం ఎదుట బైఠాయించి ఎవరిని లోనికి ప్రవేశించకుండా అడ్డుకున్నారు. సబ్సిడీ రుణాల్లో గోల్‌మాల్ జరిగిందని టీడీపీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ సెలక్షన్ కమిటీ టీడీపీ అనుకూలురకు మాత్రమే రుణాలు మంజూరు చేసిందని లబ్ధిదారులు ఆరోపించారు. గత మూడేళ్లగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నవారికి రుణాలు అందడంలేదని కేవలం టీడీపీ నాయకుల సిఫార్సు చేసిన వారికే రుణాలు మంజూరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గొర్రె శ్రీనివాసులు మాట్లాడుతూ స్క్రీనింగ్ సెలక్షన్ కమిటీ ప్రభుత్వ అధికారులకు సమాంతర కమిటీగా తయారైందన్నారు. స్క్రీనింగ్ కమిటీ


కార్యాలయం ఎదుట బైఠాయించిన లబ్ధిదారులు

సభ్యులు అవినీతికి పాల్పడి అర్హులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం కూడా బీసీ జనాభాకు తగ్గట్టు యూనిట్లు మంజూరు చేయడం లేదన్నారు. 2016-17కు 40 యూనిట్లు చేస్తే ఆందోళన చేయగా మరో 40 పెంచిందన్నారు. 2017-18కి 1430 మంది బీసీ కార్పొరేషన్‌కు రుణాల కోసం దరఖాస్తు చేసుకుంటే 208 యూనిట్లు మాత్రమే మంజూరు చేసిందన్నారు. జనాభాలో సగభాగానికి పైన ఉన్న బీసీలకు చంద్రబాబు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందన్నారు. బీసీలతోపాటు ఎస్సీ మైనార్టీలను ప్రభుత్వం మోసపుచ్చుతోందన్నారు. కమిషనర్ రావాలి, సమాధానం చెప్పాలి అని నినాదాలు చేయడంతో కమిషనర్ శేషన్న డిమాండ్స్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నజీర్, జిల్లా కార్యదర్శి గోసంగి సుబ్బారెడ్డి, ఎస్సీసెల్ లూథర్‌ప్రసాద్, బీసీసెల్ కొండయ్య, యూత్ కమిటీ నేతలు ఓబయ్య, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బాబు పాల్గొన్నారు.

## గిడుగు జయంతిని ఘనంగా నిర్వహించండి

ప్రొద్దుటూరు కల్చరల్: తెలుగు భాషా దినోత్సవమైన ఆగస్టు 29న ప్రభుత్వ సంస్థల్లో ఖచ్చితంగా అమలు చేయాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు వెంకటరెడ్డికి వినతి పత్రం అందజేశారు. వ్యవహారిక భాష ఉద్యమానికి బీజం వేసి గ్రాంధిక భాష వ్యామోహం నుంచి వ్యవహారిక భాషవైపు తెలుగువారిని నడిపించిన చైతన్య యోధుడు, తెలుగుజాతి చిరస్మరణీయుడు గిడుగు రామమూర్తి పంతులు జన్మదినాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం రామమూర్తి జన్మదినాన్ని తెలుగు భాషా దినోత్సవంగా ప్రకటించిన సరైన విధానం లేకపోవడం వలన తెలుగుజాతి ఆయనను గుర్తించే పరిస్థితి లేకుండా పోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలతోపాటు అన్ని విభాగాల్లో రామమూర్తి పంతులు జన్మదినాన్ని జరిపేలా ఉత్తర్వులివ్వాలన్నారు. ఆ సంఘం అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, జిల్లా రచయితల సంఘం జింకా సుబ్రమణ్యం, రామాంజనేయరెడ్డి, దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.


తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## ప్రతి ఒక్కరూ టీకా వేయించుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్: అపోహలతో సంబంధం లేకుండా ఎంఆర్ టీకాను ప్రతి ఒక్కరు వేయించుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ గురివిరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఖాకరాపేటలో ఉన్న అంగన్వాడీ పిల్లలకు ఎంఆర్ టీకాను షేక్ గురివిరెడ్డి వేసి ప్రారంభించారు. ఎంఆర్ టీకాతో రెండు వ్యాధులను తొలగించవచ్చన్నారు. టీకా వలన ఎలాంటి హాని జరుగదన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి, సుగుణమ్మ, ఏఎన్ఎం నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 31న మండల సర్వసభ్య సమావేశం

జమ్మలమడుగు రూరల్: ఈనెల 31వ తేదీ ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సభాభవనంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఉంటుందని మండల పరిషత్ అధికారులు తెలిపారు. ఈ సమావేశానికి మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని వారు కోరారు. గ్రామాల్లో సమస్యలు తదితర వాటికి సంబంధించిన విషయాలను సమావేశంలో చర్చించవచ్చన్నారు.

### సినిమా గైడ్

**ప్రొద్దుటూరు**

| | |
|---|---|
| సుధ : | వివేకం |
| వెంకటేశ్వర : | జయ జానకి నాయకి |
| బీవీఎస్: | పటేల్ ఎస్ఆర్ఐ |
| ఆరవేటి: | నేనే రాజు నేనే మంత్రి |
| అర్చన : | లక్ష్మీకటాక్షం |
| చాంద్ : | అంధగాడు |
| సినీ హబ్: స్క్రీన్-1: | నేనే రాజు నేనే మంత్రి |
| స్క్రీన్ -2 : | జయ జానకి నాయకి |
| స్క్రీన్ -3 : | ఫిదా |

### హలో.. ఆంధ్రజ్యోతి

● మీకు సమస్యలుంటే ఈ కింది నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు.

- ప్రొద్దుటూరు - 9985411190
- పుట్టపర్తి సర్కిల్, - 9000885325
- క్రైం - 9490633105
- కల్చరల్ - 9966349431
- టౌన్ - 9866885470
- ప్రొద్దుటూరు అర్బన్ -8341751401
- రాజుపాళెం - 9642093626

## మహిళా సాధికారతకు సీఎం అధిక ప్రాధాన్యం


మాట్లాడుతున్న కౌన్సిలర్ కోనేటి సునంద

ప్రొద్దుటూరు టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, మహిళల ద్వారా సంఘాలకు రుణమాఫీ చేశారని, 32వ వార్డు కౌన్సిలర్ కోనేటి సునంద తెలిపారు. వార్డులోని మదర్‌థెరిస్సా స్వయం సహాయక సంఘం మహాసభ సోమవారం మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు మహిళలు పొదుపు డబ్బులను స్వయం ఉపాధికి, జీవనోపాధికి ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం సీవో లావణ్య పొదుపు సంఘాల లావాదేవీల గురించి వివరించారు. మంగళవారం భారతి పొదుపు సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కొందరికి అభయహస్తం బాండ్లను పంపిణీ చేశారు. ఆర్‌పీలు గౌరి, ఇంద్ర, 300 మంది పొదుపు మహిళలు పాల్గొన్నారు.

## రంగుల అద్దకం పరిశ్రమను తొలగించాలి


కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు అర్బన్: నివాసాల మధ్య ఏర్పాటు చేసిన రంగుల అద్దకం పరిశ్రమతో రసాయనాల దుర్వాసనలు, మంటలు, పొగల కారణంగా ఇళ్లలో జీవించలేకపోతున్నామని వెంటనే ఆ పరిశ్రమను తొలగించాలని 27వ వార్డు మహిళలు డిమాండ్ చేశారు. సోమవారం కమిషనర్ శేషన్నను కలిసి మహిళలు రంగుల అద్దకం పరిశ్రమ ఎత్తేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు కమిషనర్ శేషన్నతో మాట్లాడుతూ బండారు సూరి అనే వ్యక్తి తన స్థలాన్ని రంగుల అద్దకం పరిశ్రమకు బాడుగకు ఇచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆ పరిశ్రమ కొత్తపల్లె కాలువ పొరంబోకు స్థలంలో కూడా ఆక్రమించి నిర్మించారన్నారు రంగుల అద్దకంలో రసాయన వ్యర్థాలను నేరుగా కొత్తపల్లె కాలువలోకి వదిలేస్తున్నారని ఇందువల్ల భూగర్భజలాలు కలుషితం అవుతాయని ఆరోపించారు. ఎందు రోజుల్లో పరిశ్రమను పరిశీలించి వాటికున్న అనుమతులను రద్దు చేయాలని, ఆ పరిశ్రమను ఎత్తివేయించాలని కోరారు. ఇందుకు కమిషనర్ శేషన్న స్పందిస్తూ రెండు రోజుల్లో పరిశీలించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై నేడు మైదుకూరులో దీక్ష

**మైదుకూరు :** విభజన చట్టంలో పేర్కొన్న మేరకు జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరుతూ మైదుకూరులో మంగళవారం రిలే దీక్షలు చేపట్టనున్నట్లు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఆర్డీఎఫ్ నాయకులు ఎం.చిన్న, సునీల్, జగన్మోహన్‌లు పేర్కొన్నారు. సోమవారం మైదుకూరులో వారు విలేకరులతో మాట్లాడారు. ఉక్కు పరిశ్రమపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి ప్రకటన చేయలేదన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు మంగళవారం రిలే దీక్షలు, బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మానవహారాలు, ర్యాలీ నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## టీడీపీకి అండగా ముస్లిం సోదరులు నిలిచారు

### రాష్ట్ర ముస్లిం మైనార్టీ నేత సిద్దారం ఖదీరుల్లా



విజయోత్సవ కేక్ కట్ చేస్తున్న సిద్దారం, టీడీపీ శ్రేణులు

**ఖాజీపేట :** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి ప్రతి ఎన్నికల్లో ముస్లిం సోదరులు అండగా నిలిచి గెలుపునకు కృషి చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి సిద్దారం ఖదీరుల్లా పేర్కొన్నారు. ఖాజీపేటలోని ఆయన నివాస గృహంలో నంద్యాలలో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి గెలుపు సందర్భం గా టీడీపీ శ్రేణులు ఇట్టెం శ్రీరాముల్ యాదవ్, మల్లెల ఓబయ్య యాదవ్, లక్ష్మి తదితరులతో కలిసి విజయోత్సవ కేక్‌ను సోమవారం కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికల్లో ముస్లిం సోదరులు గెలుపునకు కీలక పాత్ర పోషించారన్నారు. రాబోవు 2019 ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించి మళ్ళీ నారా చంద్రబాబునాయుడు సీఎం కావడం తథ్యమన్నారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు చూసి ప్రజలు టీడీపీ వైపు మొగ్గు చూపారన్నారు. మైదుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్ నంద్యాలలో 25వేలకు పైగా టీడీపీకి మెజార్టీ వస్తుందని ఆనాడే చెప్పారన్నారు.

కార్యక్రమంలో టీడీపీ నేతలు రామారావు, జిలానీ, సలాహుద్దీన్, మహమ్మద్, మహబూబ్‌భాష; తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాలలో అభివృద్ధికి పట్టం : రెడ్యం

**ఖాజీపేట :** నంద్యాలలో జరిగిన ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి గెలుపు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేసిన అభివృద్ధికి ప్రజలిచ్చిన తీర్పని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. నంద్యాలలో టీడీపీ భారీ ఆధిక్యతతో గెలుపొందిన అనంతరం సోమవారం ఖాజీపేటలో రెడ్యం సోదరుల తేదేపా శ్రేణుల ఆధ్వర్యంలో భారీగా టపాసులు పేల్చి మిఠాయిలు పంచి విజయోత్సవ వేడుకలు జరిపారు. ముందుగా మహాత్మగాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాముల విగ్రహాలకు పూలమాలలు వేసిన అనంతరం ప్రజలనుద్దేశించి రెడ్యం ప్రసంగిస్తూ 16 వేల కోట్లు లోటు బడ్జెట్‌లో, క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి రాష్ట్రాన్ని నెం.1గా తీర్చిదిద్దుతున్న చంద్రబాబు 3 ఏళ్ల పాలనకు నంద్యాల విజయం నిదర్శనం అని ఆయన తెలిపారు. వైయస్ జగన్, ఆర్కె రోజాలు వాడిన నీచ భాష టీడీపీ భారీ మెజార్టీకి కారణమని ఆయన విశదీకరించారు. ప్రధాన ప్రతిపక్ష నేత ఎక్కడాలేని విధంగా వైయస్ జగన్ వీధి వీధి తిరుగుతూ 12 రోజులు పాటు ప్రచారం చేసినా ఫలితం ఇంత దారుణంగా వుంటే.. 2019 ఎన్నికల్లో వైకాపా వైయస్ జగన్ పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. మండల పరిధిలోని దుంపలగట్టులో టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షురాలు రెడ్యం లక్ష్మిప్రసన్న ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, వీయస్ జలీల్ అహ్మద్, టీడీపీ జిల్లా కార్యదర్శి బండి వెంకటేష్, టీడీపీ నేతలు నిగినేని పుల్లయ్య నాయుడు, సారె పిచ్చినాయుడు, బచ్చల శ్రీను, తిప్పిరెడ్డి, లక్ష్మిరరెడ్డి, నారాయణ యాదవ్, పల్లె గంగాధర్, గంగిరెడ్డి అంకిరెడ్డి, కమలాపురం ఫరూఖ్ అహ్మద్, రియాజ్ అహ్మద్, దాసరి గంగన్న యాదవ్, రెడ్యం వెంకట్రామిరెడ్డి, తెలిదేల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



రెడ్యం వెంకటసుబ్బారెడ్డికి మిఠాయి తినిపించి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నేతలు

## ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే ఆంధ్రాబ్యాంకు లక్ష్యం

**బ్రహ్మంగారిమఠం :** రాష్ట్ర వ్యాప్తంగా ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించడమే ఆంధ్రాబ్యాంకు లక్ష్యమని తిరుపతి జోన్ ఆంధ్రాబ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ గణపతిరావు పేర్కొన్నారు. సోమవారం బ్రహ్మంగారిమఠంలో నూతన శాఖను ఆయన ప్రారంభించారు. ముందుగా ఆయనకు బ్రాంచ్ మేనేజర్ సుధాకర్‌రావు, సిబ్బందితో స్థానిక ఎంపీటీసి పసుపులేటి రామయ్య వేదపండితుల చేత ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆంధ్రా బ్యాంకు ఏటీఎంను, లాకర్‌సౌకర్యం, నగదుడిపాజిట్ మిషన్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాతాదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీజీఎం గణపతిరావు ప్రజలకు బ్యాంకు రుణాలను ఇచ్చి, వారి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని, ఖాతాదారులకు ఎక్కువ సమయాన్ని కేటాయించకుండా వారి సేవలను వెంటనే చేసిపెట్టడమే బ్యాంకు లక్ష్యమని ఆయన అన్నారు. బ్యాంకులో వ్యవసాయ, బంగారు, డ్వాక్రా, ముద్ర రుణాలు పంపిణీ చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా 2900 బ్రాంచ్‌లు ఉన్నాయని, వాటిలో 3928 ఏటీఎంలు ఉన్నాయని, 138 క్యాష్‌డిపాజిట్ మిషన్లు ఉన్నాయని, మొత్తం 6,966 శాఖలు పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు. తిరుపతిజోన్‌లో చిత్తూరు, కడప, జిల్లాలు ఉన్నాయని, చిత్తూరు జోన్‌లో 98 బ్రాంచ్‌లు ఉన్నాయని, 103 ఏటీఎంలు ఉన్నాయన్నారు. రూ.30వేల కోట్ల వ్యాపారాన్ని నిర్వహించామన్నారు. కడప జోన్‌లో 6900 కోట్లు వ్యాపారాన్ని నిర్వహించామన్నారు. కడప జోన్‌లో 31శాఖలు పనిచేస్తున్నాయన్నారు. బి.మఠం శాఖలో ఇప్పటి వరకు 2,130 ఖాతాలు లావాదేవీలు నిర్వహిస్తున్నారని, వాటిలో ఫిక్స్‌డు డిపాజిట్‌లు 133 ఖాతాలు చేశారని, ఇప్పటి వరకు డిపాజిట్‌లు రూ.4కోట్ల డిపాజిట్లు చేయగా, బ్యాంకు నుంచి రుణాలు 9కోట్లు మంజూరు చేశామని ఆయన తెలిపారు. రైతులకు వ్యవసాయ రుణాలను ఇవ్వడంలో మాబ్యాంకు ప్రత్యేకత కలిగి ఉందని ఆయన తెలిపారు. అనంతరం ఎంపీటీసీ రామయ్య డీజీఎంను ఘనంగా సన్మానించారు. ఏటిఎంలో ఖాతాదారులకు నగదు డిపాజిట్, డ్రా చేసుకునే విధానంపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుబ్రమణ్యం, బ్రాంచ్ మేనేజర్ సుధాకర్‌రావు, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీటీసీ రామయ్య, కేసీ సంజీవరాయుడు, తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మంగారిమఠంలో ఆంధ్రాబ్యాంక్ నూతన శాఖను ప్రారంభిస్తున్న గణపతిరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీజీఎం గణపతిరావు

## పంటలకు జీవామృతాలే సంజీవని



ఘన జీవాతృతాన్ని తయారు చేస్తున్న రైతులు, పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

**మైదుకూరు రూరల్ :** అన్ని రకాల పంటలకు ఘన, ద్రవ జీవామృతాలు సంజీవనిలాగా పనిచేస్తాయని జిల్లా వ్యవసాయశాఖ ఉపసంచాలకురాలు విజయభారతి రైతులనుద్దేశించి పేర్కొన్నారు. మండలంలోని ఆదిరెడ్డిపల్లెలో సోమవారం మండల వ్యవసాయశాఖ అధికారి లక్ష్మణ్ ఆధ్వర్యంలో రైతుల జీవామృతాల తయారీ విధానాన్ని పరిశీలించే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య పరిశీలకురాలుగా జిల్లా వ్యవసాయశాఖ ఉప సంచాలకురాలు విజయభారతి విచ్చేశారు. ఆదిరెడ్డిపల్లెలో రైతులతో జీవామృతాన్ని అధికారులు దగ్గరుండి తయారు చేయించారు. ఈసందర్భంగా లక్ష్మణ్, విజయభారతి మాట్లాడుతూ జీవామృతాలు ఘన, ద్రవ పదార్థాలుగా తయారీ విధానాల గురించి రైతులకు తెలియచేశారు. పంటలకు ఎరువులు లేకుండా వీటితో నాణ్యమైన దిగుబడి సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు,ఆదినారాయణ, కదరప్ప, రైతులు పాల్గొన్నారు.

## నేడు బద్వేలులో వైసీపీ నవరత్నాల సభ

**బద్వేలు :** జులైలో జరిగిన వైసీపీ ప్లీనరీలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే క్రమంలో మంగళవారం స్థానిక సిద్దవటంరోడ్డులోని ఎరుకలభావి సమీపంలోగల మైదానంలో నవరత్నాలసభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త వెంకటసుబ్బయ్యలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సభకు వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కడప పార్లమెంట్ సభ్యుడు అవినాష్‌రెడ్డి, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హాజరవుతారన్నారు.

# అరాచక శక్తులకు రాష్ట్రంలో చోటుండదు

## నంద్యాల ఫలితమే నిదర్శనం ● సంబరాల్లో టీడీపీ నేతలు




ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ నాయకులు, స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు, కార్యకర్తలు

**కడప, సెవెన్‌రోడ్స్ :** అరాచకత్వం, గూండాయిజాన్ని రాష్ట్ర ప్రజలు అంగీకరించరు. అటువంటి నేతలకు చోటివ్వరు. నంద్యాల ఉప ఎన్నిక ఫలితమే ఇందుకు నిదర్శనమని టీడీపీ నేతలు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్‌లు అన్నారు. సోమవారం నంద్యాల ఉప ఎన్నిక ఫలితం రాగానే గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున పార్టీ నాయకులు, శ్రేణులు ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. తొలుత పార్టీ జెండాలు చేతపట్టి డప్పు వాయిద్యాల మధ్య ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ తిరుగుతూ చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాలలో ప్రజలను రెచ్చగొట్టేందుకు జగన్ చేసిన కుట్ర, కుతంత్రాలు అన్నీఇన్నీ కావని, అయితే వాటన్నింటినీ నంద్యాల ఓటర్లు తిప్పికొట్టి టీడీపీకి బ్రహ్మరథం పట్టారన్నారు. అనంతరం దాదాపు 2 వేల లడ్లను ప్రజలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత సుభాన్‌బాష, ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యుడు పీరయ్య, టీడీపీ నగర కమిటీ అధ్యక్షుడు జిలానీబాష సహా పలువురు నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

### ఓటుతో జగన్‌ను పేల్చిన నంద్యాల ప్రజలు : రెడ్యం

ఓటు అనే తుపాకీతో ప్రతిపక్షనేత జగన్‌ను నంద్యాల ప్రజలు పేల్చివేశారని, ఇక ఆయన పార్టీ ఎత్తివేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీఎంను కాల్చి చంపాలని పిలుపునిచ్చిన జగన్‌కు నంద్యాల ఓటర్లు తగిన రీతిలో గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం అందించే చంద్రబాబుకు నంద్యాల ప్రజలు పట్టం కట్టారని ఇప్పటికైనా జగన్ వాస్తవాలు తెలుసుకొని రాజకీయాల నుంచి తప్పుకోవాలని సూచించారు.

### అభివృద్ధితోనే నంద్యాల విజయం

అభివృద్ధి, సంక్షేమం అందించిన సీఎం చంద్రబాబు నాయకత్వాన్ని నంద్యాల ఓటర్లు బలపరచి ఘన విజయం చేకూర్చారని జిల్లా నందమూరి బాలక్రిష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు, ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యుడు పీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 2019 ఎన్నికల్లో టీడీపీ విజయదుందుభికి నంద్యాల ఉప ఎన్నిక ఫలితం నాంది అని ఇక జగన్ ఆటలు సాగవన్నారు.

# దీక్షను భగ్నం చేసిన పోలీసులు

## ● కళాశాలలపై చర్యలు చేపట్టాలి ● ఆర్‌ఎస్‌ఎఫ్ డిమాండ్



వీసీ దృష్టికి తీసుకెళ్తున్న ఆర్‌ఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ నాగార్జున

**కడప, వైవీయూ:** యోగివేమన విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న కొన్ని డిగ్రీ కళాశాలలు నకిలీ ధ్రువ పత్రాలతో వర్శిటీ నుంచి అప్లికేషన్ పొందాయని కళాశాల గుర్తింపు రద్దు చేయాలని కోరుతూ వైవీయూలో ఆర్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన దీక్షను విద్యార్థులు చేపట్టారు. నిరసన దీక్ష చేపట్టిన కొద్ది సేపటికే పెండ్లిమర్రి పోలీసులు దీక్ష భగ్నం చేశారు. వర్శిటీలోని సమస్యల పరిష్కారంపై అధికారులను కలసి చెప్పాలని, ప్రస్తుతం 30 యాక్టు అమలులో ఉందని ఎటువంటి నిరసనలు, దీక్షలు చేపట్టరాదని టెంట్‌ను ఎత్తి వేయాలని పోలీసులు ఆర్‌ఎస్‌ఎఫ్ నేతలకు సూచించారు. ఈ సందర్భంగా రాయలసీమ విద్యార్థి వేదిక జిల్లా కన్వీనర్ నాగార్జున, భరత్‌లు సంయుక్తంగా మాట్లాడుతూ వైవీయూ అనుబంధంగా ఉన్న అన్ని కళాశాలలపై సమగ్ర విచారణ జరపాలన్నారు. నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి కడపలోని ఓ డిగ్రీ కళాశాల, ప్రొద్దుటూరులోని ఓ కళాశాల గుర్తింపు పొందాయని ఆ కళాశాలల గుర్తింపు రద్దు చేసేంత వరకు న్యాయ పోరాటం చేస్తామన్నారు.

వర్శిటీలోని సీడీసీ అధికారులు అక్రమాలకు పాల్పడిన డిగ్రీ కళాశాలలకు అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. వర్శిటీ వీసీ త్వరగా చర్యలు చేపట్టి యూనివర్శిటీ ప్రతిష్టను కాపాడాలని కోరారు.

# 'సౌదియా నుంచి నా భార్యను రప్పించండి'

**కడప, మారుతీనగర్:** సౌదియాలో చిత్రహింసలకు గురికాబడుతున్న తన భార్యను ఇండియాకు రప్పించి పుణ్యం కట్టుకోవాలని ఓబులవారిపల్లె మండలం గోవిందంపల్లె హరిజనవాడకు చెందిన దార్ల సుబ్రమణ్యం ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొట్టకూటి కోసం కష్టంగా ఉన్న తమ కుటుంబానికి ఆసరగా ఉంటుందనే ఆశతో తన భార్యను కుమార్ అనే వ్యక్తి ద్వారా గత రెండు నెలల క్రితం సౌదీకి పంపారని, కాగా ఇక్కడి ఏజెంట్ సౌదీయాలో ఓ సేట్ తన భార్యతో వంటపని చేయించుకోకుండా నానా చిత్రహింసలకు గురి చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తనకు సెల్‌ఫోన్ ద్వారా తెలియ పర్చిందన్నారు. కావున ప్రభుత్వం, జిల్లా అధికారులు మానవత్వంతో స్పందించి తన ముగ్గురు పిల్లలు అనాథలు కాకుండా చూడాలని అభ్యర్థించాడు.

# అర్హులైన పేదలకు స్థలాలివ్వాలి

**కడప,రవీంద్రనగర్:** ఇందిరా నగర్‌లో వున్న ఖాళీ ఇంటి స్థలాలను అర్హులైన పేదలకు పంచాలని ఆర్‌సీపీ నగర కార్యవర్గ బృందం సోమవారం మీకోసం కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నగర శివారు ప్రాంతమైన 15వ డివిజన్ ఇందిరానగర్ ఏర్పడి పదేళ్లు పూర్తయినా ఇప్పటికీ వందలాది ఇంటి స్థలాలు ఖాళీగా వున్నాయని, ఈ స్థలాలు ఖాళీగా వుండడం వల్ల కంపచెట్లు పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి దోమలకు, పందులకు, విషసర్పాలకు, ఆకతాయిలకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా వున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరానగర్‌లో విచారణ జరిపి ఇళ్లు లేని వారికి స్థలాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రసాద్, లక్ష్మీనారాయణ, విజయకుమార్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్, డిప్యూటీ మేయర్

**కడప, ఎర్రముక్కపల్లె :** ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలని కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కడప కార్పొరేషన్ ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన సంబంధిత అధికారులకు సూచనలు, సలహాలు అందజేశారు.

### అధికారులు స్పందించడం లేదు : డిప్యూటీ మేయర్

డ్రైనేజీ సమస్యలపై అధికారులు ఏమాత్రం స్పందించడం లేదని డిప్యూటీ మేయర్ ఆరీపుల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో వుంచుకొని గతంలోనే డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని సూచించినా స్పందించడం లేదన్నారు. ప్రజల సమస్యలపై అధికారులు స్పందించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# రక్తదాన కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న డీఎస్పీ మాసుమ్‌బాష

**కడప, స్పోర్ట్స్ :** బ్లడ్‌టులివ్ స్వచ్ఛంద సేవా సంస్థ నూతనంగా రూపొందించిన రక్తదాన కరపత్రాన్ని డీఎస్పీ మసూమ్‌బాష విడుదల చేశారు. సోమవారం నగరంలోని డీఎస్పీ కార్యాలయంలో కరపత్రం ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ యువత రక్తదానంపై అవగాహన కలిగి రక్తదానం చేయాలని సూచించారు. బ్లడ్ టులివ్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు.

అనంతరం బ్లడ్‌టులివ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు పవన్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో రక్తదానం కొరత లేకుండా వుండేందుకు స్వచ్ఛంద సంస్థ ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంపత్‌కుమార్, మహేష్, చైత్య, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

## సినిమా గైడ్

### కడప సినిమాలు

| | |
|---|---|
| మురళి | : జయజానకి నాయక |
| రవి | :నేనే రాజు నేనే మంత్రి |
| సుధ | : ఫిదా |
| ప్రతాప్ | : ఆనందో బ్రహ్మ |
| అమీర్ | : అనబెల్ |
| రమేష్ | : గౌతమ్‌నంద |
| తాహర్ | : జనతాగ్యారేజ్ |
| అప్సర | : నిన్నుకోరి |
| రాజా | : వివేకం |
| ఎస్‌ఆర్ | : లై |

# పాత్రికేయులపై దాడి అమానుషం

**కడప, మారుతీనగర్:** ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలైన పాత్రికేయులపై దాడి చేయడం అమానుషమని జాప్ రాష్ట్ర నాయకుడు, పాత్రికేయుల రాష్ట్ర వేతన కమిటీ సభ్యుడు సి.రాజారెడ్డి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. చెన్నూరులో దినపత్రికల విలేకరులుగా పనిచేసే పాత్రికేయులు మల్లికార్జున, పాలకొండ్రాయుడులపై రాత్రి సమయంలో దాడి చేయడం సరైంది కాదన్నారు. సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న జర్నలిస్టులపై రోజు రోజుకు దాడులు పెరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పాత్రికేయుల దాడులపై నియంత్రణ కమిటీని ఏర్పాటు చేసి ఆ కమిటీలో జిల్లా పోలీసు అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు.

# కటింగ్ లేకుండా జీతం అందించాలి

**కడప, రవీంద్రనగర్ :** కడప నగరంలో బిల్లు కలెక్టర్ సెక్షన్‌లో పనిచేస్తున్న కార్మికుల నెల వేత నాల నుంచి రూ.85 కటింగ్ అవకుండా ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సిద్ధిరామయ్య సోమవారం మీకోసం కార్యక్రమంలో కడప నగర పాలక సంస్థ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మస్తాన్‌వర్మ, కరానుపాటి శ్రీరామ్ సుందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ హుండీ ఆదాయం రూ.93,577

**లక్కిరెడ్డిపల్లె :** మండలంలోని అనంతపురం గ్రామంలో వెలిసిన గంగమ్మతల్లి హుండీ ఆదాయం రూ.93,577 ఆదాయం వచ్చినట్లు ఈవో సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులరెడ్డి, చైర్మన్ క్రిష్ణారెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటసుబ్బయ్య, కాంతమ్మ, జయచంద్ర, అర్చకులు ఆదిమూలం రెడ్డిశేఖర్, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికే ప్రజలు పట్టం కట్టారు

**గాలివీడు:** అభివృద్ధికే నంద్యాల ప్రజలు తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టారని మాజీ ఎమ్మెల్యే, రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఆర్.రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం మండల కేంద్రంలో నంద్యాల ఎన్నికపై విలేకర్లతో మాట్లాడుతూ నంద్యాల పట్టణ ప్రజలు టీడీపీకి బ్రహ్మరథం కట్టారని కొనియాడారు. అబద్దాలకు, మోసాలకు ప్రజలు ఓటు వేయరని ప్రతిపక్ష నాయకుడిని ఉద్దేశించి విమర్శించారు. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పెట్టుకుని రాత్రింబవళ్లు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును నడిరోడ్డులో ఉరితీయండి, బట్టలు ఊడతీయండి, బంగాళాఖాతంలో ముంచేయడంటూ జగన్ మోహన్‌రెడ్డి అనడం అది ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. ఇలాంటి మాటలకు ప్రజలు ఓటు వేయరని వారు అన్ని విషయాలు గమనిస్తుంటారని తెలిపారు. ఎవరికి బట్టలు ఊడదీసి పంపాలో ప్రజలకు బాగా తెలుసునన్నారు. 2019లో జరగబోవు సాధారణ ఎన్నికల్లో రాష్ట్రమంతా నంద్యాల ఉప ఎన్నికల ఫలితమే పునరావృతం అవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్ష పార్టీ నాయకుడు గమనించి చంద్రబాబునాయుడు చేస్తున్న రాష్ట్రాభివృద్ధిని పేద ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రశంసించాలన్నారు. నంద్యాల గెలుపుతో ప్రజాస్వామ్యం గెలిచినట్లు అవుతుందని తెలిపారు.



విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి

ఈ సమావేశంలో నూలివీడు సహకార సంఘం అధ్యక్షుడు పొట్లి వెంకట్రమణారెడ్డి (పెద్దబుల్లెట్), మాజీ సర్పంచ్ భద్రప్పనాయుడు, మాజీ ఎంపీటీసీ నాగశేషారెడ్డిలు పాల్గొన్నారు.

# నంద్యాల తీర్పును గౌరవిస్తాం : ఎమ్మెల్యే

**రాయచోటిరూరల్ :** నంద్యాల ఉప ఎన్నికల్లో ప్రజాతీర్పును గౌరవిస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఒకటిన్నర సంవత్సరం అధికారంలో ఉంటాం. మాకు ఓటేయ్యండి... జగన్‌కు 2019లో ఓటు వేసుకోండి.. శిల్పామోహన్‌రెడ్డిని ప్రతిపక్ష ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఏ పనినీ జరగనివ్వం అన్న నినాదాలతో ప్రచారం చేసుకుని తెలుగుదేశం పార్టీ విజయం సాధించిందన్నారు. భవిష్యత్తులో 2019లో ప్రజలందరూ మళ్లీ వైఎస్ఆర్ సీపీ వైపు ఉంటామని మాతో చాలా మంది చెప్పడం జరిగిందన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమేనని, గెలిచినప్పుడు పొంగిపోయి ఓడినప్పుడు కృంగకుండా సమానంగా తీసుకోవాలన్నారు.

**31న జరిగే నవరత్నాల సభను విజయవంతం చేయండి :** ఈ నెల 31న రాయచోటిలో జరిగే నియోజకవర్గానికి సంబంధించిన నవరత్నాల సభను విజయవంతం చేయాలని వైసీపీ పోలింగ్ భూత్ కమిటీ సభ్యులకు, పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైసీపీ పథకాలు పునరుద్దరణలో భాగంగా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నవ్యాంధ్రకు నవరత్నాలు పథకాలైన వైఎస్ఆర్ రైతు భరోసాతో



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రతి రైతుకు రూ.50 వేలు, వైఎస్ఆర్ ఆసరాతో డ్వాక్రా అక్కడ, చెల్లెమ్మలకు, పొదుపు సంఘాలకు రూ.15 వేల కోట్లు మంజూరు, రూ.1000 నుంచి 2 వేల వరకు పెన్షన్ పెంపు, అమ్మఒడి, పేదల చదువుల బడి, ప్రతిపేదవాడికి ఇళ్లు, ఆరోగ్య శ్రీ అభివృద్ధి, విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్, యుద్ధప్రాతిపధికన జలయజ్ఞం, మూడు దశల్లో మద్యపాన నిషేదం వంటి వాటిని వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశం గురువారం పట్టణంలోని అల్తాఫ్ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు జరుగుతున్నారు. నియోజకవర్గంలోని పోలింగ్ భూత్ కమిటీ సభ్యులు పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

# గణనాథుడి పూజల్లో ఎమ్మెల్యే

**రాయచోటిటౌన్ :** పట్టణంలోని రెడ్డీస్‌కాలనీ యందు కొలువుదీర్చిన గణనాధునికి సోమవారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి విశేష పూజలు నిర్వహించారు. వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు కిశోర్ ఆధ్వర్యంలో ఆయన ఘనస్వాగతం పలికారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను, యువకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, రమేష్, సాఫీష్, హజార్, యశ్వంత్, కోటేశ్వర్, వెంకటేష్, సాయికిరణ్, గంగాధర్, ఖా జా, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడికి పూజలు

**రాయచోటిటౌన్ :** పట్టణపరిధిలోని కొత్తపేట రామాపురం సందీప్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద సోమవారం టీడీపీ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలో నెలకొల్పిన పలు విగ్రహాలను దర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం సందీప్‌నగర్‌లో దాత సిద్దయ్య ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అక్కడికి విచ్చేసిన ప్రజలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అఫ్రోజ్, మన్నేరు రామాంజినేయులు, రెడ్డిబాబు, భాస్కర్, శివలు పాల్గొన్నారు.

## వీరభద్రాలయంలో రేపు హుండీ లెక్కింపు

**రాయచోటిరూరల్ :** భద్రకాళీ సమేత వీరభద్రుడి ఆలయంలో రేపు బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమం ఉంటుందని ఆలయ ఈవో మంజుల తెలియజేశారు. ఉప ఆలయాలకు సంబంధించిన పర్మనెంట్ హుండీలను బుధవారం 9 గంటలకు దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కింపు ఉంటుందని ఆమె తెలిపారు. ఆసక్తిగల భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చునన్నారు.

## గణనాథుని సన్నిధిలో అన్నదానం

**లక్కిరెడ్డిపల్లె :** లక్కిరెడ్డిపల్లె మూడు రోడ్ల కూడలిలో గణనాథుని సన్నిధిలో పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తెలుగునాడు పారామెడికల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రెడ్డెయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎస్ఐ సురేష్‌రెడ్డి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యనిర్వాహకులు గురుస్వామి వెంకట్రమణ, టైపిస్టు వెంకట్రమణ, హరి తదితరులు పాల్గొన్నారు.

# రైతులందరికీ న్యాయం జరగాలి



తూముకుంటలో రైతులనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి

**గాలివీడు :** తూముకుంట పంచాయతీలో సోలార్ నిర్మాణం వల్ల భూములు కోల్పోతున్న రైతులందరికీ న్యాయం జరగాలని మాజీ ఎమ్మెల్యే, రాయచోటి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్.రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన తూముకుంట కస్పాలో సోలార్ ప్రాజెక్టు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకూడదని, రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. రైతులందరికీ భూ నష్టపరిహారం అందిన తరువాతే సోలార్ పనులు చేపట్టాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. రెండు సంవత్సరాలుగా నష్టపరిహారం అందించడంలో అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారోనని వారి తీరుపట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద రైతులందరికీ నష్టపరిహారం అందివ్వకపోతే రాబోయే ఎన్నికల్లో వారి పక్షాన నిలిచి ఎంతవరకైనా పోరాటం చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. సోలార్ పనులలో స్థానికులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, పనులు చేయడంలోను, ఉద్యోగాలు ఇవ్వడంలోను ఈ గ్రామ ప్రజలకే ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నూలివీడు సొసైటీ అధ్యక్షుడు వెంకట్రమణారెడ్డి (బుల్లెట్), గాలివీడు సర్పంచ్ మహమ్మద్‌రియాజ్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి ఎన్. జయరాం అఖండనాయక్, రైతులు భద్రప్పనాయుడు, నాగశేషారెడ్డి, రాంమోహన్‌నాయుడు, కదిరిరెడ్డినాయుడు, రమణ, ఇరగంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో పనితీరు మార్చుకోవాలి

**లక్కిరెడ్డిపల్లె :** అంగన్వాడీ కేంద్రాల్లోని వర్కరు, ఆయా పనితీరు మార్చుకోవాలని రాయచోటి సీడీపీవో వసంతాభాయి పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు అంగన్వాడీ కేంద్రాల్లో ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిండికేట్ ఆధారంగా కేంద్రాల పనితీరు బాగుంటే గ్రేడింగ్ తయారు చేసి అధికారులకు నివేధికలు పంపిస్తామన్నారు. ఫ్రీస్కూల్ హాజరు, అమృతహస్తం పథక విధానం, ఆశా వర్కర్ల పనితీరు, ఫ్రీస్కూల్ విద్యార్థుల నమోదు కార్యక్రమం, గర్భవతులు, బాలింతలు ఎంత మంది ఉన్నారు, అమృతహస్తం అందుతోందా లేదా అన్న విషయాలపై వారు ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు రాబోయే కాలంలో చాలా పకడ్భంధీగా నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పిల్లలకు, బాలింతలకు సక్రమంగా అందిస్తున్నామన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీవో

అంగన్వాడీ కేంద్రాలు తెరవకపోయినా, పనితీరు సక్రమంగా లేకపోయినా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి నివేధికలు పంపిస్తామన్నారు. లక్కిరెడ్డిపల్లెలోని గాండ్లపల్లె, లక్కిరెడ్డిపల్లె 3, 4, 5 కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాయచోటి భవిష్యత్తు కోసమే శాంతిసంఘం సమావేశం : ఎస్పీ

**రాయచోటి:** రాయచోటి పట్టణం భవిష్యత్తు కోసమే తాము శాంతిసంఘం సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ బాబూజీ పేర్కొన్నారు. రాయచోటి అర్బన్ పోలీసుల ఆధ్వర్యంలో స్టేషన్ ఆవరణలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన శాంతిసంఘం సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో బక్రీద్, వినాయకచవితి పండుగల సందర్భంగా రాయచోటిలో జరిగిన సంఘటనల కోసం తాము శాంతిసంఘం సమావేశాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. ప్రజలందరూ అభివృద్ధిని కోరుకోవాలని, అభివృద్ధిని అడ్డుకోకూడదన్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలందరి మధ్య సామరస్య వాతావరణం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పండుగలను సంతోషం జరుపుకోవాలన్నారు. ఇతరుల మీద ద్వేషం, పగ కోసం కాకూడదన్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా పండుగలను జరుపుకోకూడదని హెచ్చరించారు. ఏదో ఒక కులం, మతం పట్ల పోలీసులకు ప్రత్యేక అభిమానం ఉండవన్న సంగతి అందరూ గుర్తించుకోవాలని పేర్కొన్నారు. ఎఎస్పీ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ.. మత సామరస్యాన్ని కాపాడవలసిన బాధ్యత అధికారుల కంటే స్థానికులకే ఎక్కువగా ఉండాలన్నారు. అర్బన్ సిఐ మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో కొందరు ఆకతాయిల వల్ల కొన్ని అవాంచనీయ సంఘటనలు జరిగాయన్నారు. ప్రస్తుతం అటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్పీ బాబూజీ

పలువురు హిందూ, ముస్లిం పెద్దలు మత సామర్యం ఆవశ్యకత గురించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఐలు మైనుద్దీన్, రమేష్‌బాబుతో పాటు పలువురు పోలీసులు, పట్టణంలోని ప్రముఖులు పాల్గొన్నారు.

## మండల టీడీపీ అధ్యక్షులను ప్రకటించిన ఎమ్మెల్యే

**బద్వేలు :** నియోజకవర్గంలోని పలు మండలాల టీడీపీ అధ్యక్షులను సోమవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బద్వేలు ఎమ్మెల్యే తిరువీధి జయరాములు ప్రకటించారు. బద్వేలు పట్టణ అధ్యక్షుడిగా కొంకుల రాంబాబు, మండల అధ్యక్షుడిగా వేణుగోపాల్‌రెడ్డి, గోపవరం మండల అధ్యక్షుడిగా శ్రీనివాసులరెడ్డి, అట్లూరు మండల అధ్యక్షుడిగా మహేశ్వరరెడ్డి, బికోడూరు మండల అధ్యక్షుడిగా రామసుబ్బారెడ్డి, పోరుమామిళ్ల మండల అధ్యక్షుడిగా రాజీవ్‌బాష, కలసపాడు మండల అధ్యక్షుడిగా బాలిరెడ్డి, కాశినాయన మండల అధ్యక్షుడిగా ముడమాల రమణారెడ్డిలను ఆయన ప్రకటించారు. వీరంతా పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని ఆయన కోరారు.

# దోమలు...బాబోయ్ దోమలు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

**బద్వేలు టౌన్ :** అడపా దడపా కురుసున్న వర్షాలతో పారిశుధ్య సమస్య తీవ్రమై దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతూ ఆందోళనకు గురవుతున్నారు. ఈదోమల కారణంగా ఎక్కడ వ్యాధుల బారిన పడాల్సి వస్తోందోనని ఆందోళన చెందుతున్నారు. సహజంగానే బద్వేలులో పారిశుధ్య సమస్య అధికంగా ఉంది. ఎక్కడికక్కడ ఖాళీస్థలాల్లో చెత్తా చెదారాలు పేరుకుపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. రాత్రుళ్లపూటే కాకుండా పగలు కూడా దోమలు కుట్టే పరిస్థితి ఏర్పడింది. ఇళ్లలో అటుంచి కార్యాలయాల్లో కూడా అధికారులు దోమల దెబ్బకు బెంబేలెత్తుతున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు కానీ, నేతలు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లోనే దోమలు దాడిచేస్తుంటే మిగతా ప్రాంతాల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రధాన కార్యాలయాల ఆవరణలో సాయంత్రమైతే పదినిమిషాలు నిలబడలేని పరిస్థితి. దోమల నివారణకు మందులు, యంత్రాలు ఉన్నప్పటికీ వాటిని ఉపయోగించిన దాఖలాలు లేవు. మున్సిపల్ అధికారులు అవి ఉన్నమాట మరచిపోయినట్లు ఉన్నారు. కారణంగా ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మొద్దునిద్రనుంచి బయటపడి దోమల కారణంగా ప్రజలు వ్యాధుల బారిన పడకముందే దోమల నివారణకు చర్యలు చేపట్టాలని మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.



బద్వేలు ప్రధాన రహదారిలో లోపించిన పారిశుధ్యం




దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారిన ఖాళీస్థలం, వెంగమాంబనగర్‌లో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం, మున్సిపాలిటీలో మూలన పడ్డ చెత్తతరలించే వాహనాలు

## డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేయండి

**గోపవరం :** బీసీ రాజకీయ సంకల్పయాత్ర సందర్భంగా తమ డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేయాలంటూ సోమవారం తహసీల్దార్ నరసింహులుకు బీసీ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ అవ్వారు మల్లికార్జున మాట్లాడుతూ సంకల్పయాత్ర గోపవరం మండలంలో జరిగిందని, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ ఉద్యోగుల పదోన్నతులు రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ సబ్‌ప్లాన్‌ను వెంటనే అమలు పరచాలని తదితర డిమాండ్లతో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మునెయ్య, నరసింహులు, వెంకటసుబ్బయ్య, రామసుబ్బయ్య, నరసరాజు, రాజగోపాల్, గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## 250 పశువులకు గాలికుంటు టీకాలు

**కాశినాయన :** గాలికుంట నివారణకోసం రైతులు ముందస్తుగా టీకాలు వేస్తారని నర్సాపురం పశువైద్యుడు వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం మండలంలోని నాయునిపల్లె గ్రామంలో 250 పశువులకు గాలికుంట నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావునా రైతులు పశువులను జాగ్రత్తగా గమనిస్తుండాలని, గాలికుంటు సోకే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు మాబాష రీఫ్, పలువురు గోపాలమిత్ర సభ్యులు పాల్గొన్నారు.

## విలేకరులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి



తహసీల్దార్ మాధవక్రిష్ణారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

**బద్వేలు :** చెన్నూరులో విలేకరులపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ మాధవక్రిష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏపీడబ్ల్యూజే నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా వ్యవహరిస్తున్న జర్నలిస్టులపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. భవిష్యత్తులో విలేకరులపై ఎలాంటి దాడులు జరగకుండా చట్టపరమైన చర్య తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విలేఖరులు రామయ్య, చెన్నయ్య, కిషోర్, రాము, సాంబశివరావు, సుదర్శన్, మోహన్, బాబు, రాధాక్రిష్ణారెడ్డి, రాజా, జాని, శివ, మస్తాన్‌రెడ్డి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## కలసపాడులో గణేష్ నిమజ్జనం



గణేష్ నిమజ్జనోత్సవంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు, తదితరులు

**కలసపాడు :** మండల కేంద్రమైన కలసపాడులోని నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని సోమవారం నిమజ్జనం గావించారు. నాయీబ్రాహ్మణ వీధుల నుంచి కలసపాడు పురవీధుల్లో వినాయకుని విగ్రహాన్ని మేళతాళాలతో యువత రంగులు చల్లుకుంటూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విగ్రహాన్ని స్థానికంగా ఉన్న సగిలేరులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సర్పంచ్ సిద్ధమ్మ, గ్రామ పెద్దలు

**పోరుమామిళ్ల :** రంగసముద్రం పంచాయితీ పరిధిలోని గుర్రప్పగారిపల్లెలో పనిచేస్తూ బదిలీపై వెళుతున్న నారాయణరెడ్డి, రాఘవ అనే ఉపాధ్యాయులకు సోమవారం సర్పంచ్ ఆదిబోయిన సిద్ధమ్మ అధ్యక్షతన ఉపాధ్యాయులు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి నారాయణరెడ్డి, రాఘవలు కృషి చేశారని, వారి సేవలను గ్రామస్థులు ఎన్నటికీ మరువలేరన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు మల్లికార్జునరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ గుర్రయ్య, జశింత, ప్రధానోపాధ్యాయుడు చెన్నయ్య, ఖాజారంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం పాఠశాలలను నడపాలి



పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్నఎస్ఎస్ఏ కమిటీ బృందం

**అట్లూరు :** ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ పాఠశాలలు పని చేయాలని ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని సోమేశ్వరపురంలోని ప్రాథమిక పాఠశాలను ఎస్ఎస్ఏ బృందం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల స్థితిగతులను ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాలలోని మరుగుదొడ్ల పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాల సమయానికి పాఠశాలకు రావాలని ఆదేశించారు. విద్యార్థులను అన్నింటిలో ముందుండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి, ఏఎంఓలు మల్లేశ్వరరెడ్డి, సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై గడ్డి విత్తనాలు

**కాశినాయన :** మండలానికి ప్రభుత్వం 75శాతం రాయితీతో గడ్డివిత్తనాలు మంజూరు చేసిందని వ్యవసాయాధికారి పేర్కొన్నారు. రైతులు పట్టాదారుపాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌ను తీసుకొని వచ్చి గడ్డి విత్తనాలు పొందవచ్చన్నారు. ఒక్కో రైతుకు 20కేజీల వరకు ఇస్తామన్నారు.

## అంటరానితనం హిందూ ధర్మానికి వ్యతిరేకం

**పోరుమామిళ్ల :** అంటరానితనం హిందూ ధర్మానికి వ్యతిరేకమని ఆంధ్రప్రదేశ్ ధర్మజాగరణ నాయకులు తిరుపతయ్య పేర్కొన్నారు. అన్నింటిలో భగవంతుని దర్శించమని చెప్పినా, హిందూ ధర్మంలో అంటరానితనమనే దురాచారం ప్రవేశించడం విచారకరమన్నారు. కులవివక్షతలేని సమాజ నిర్మాణం ధర్మం ఆధారంగా జీవించే సమాజంలో ఈ దేశం నిర్మాణం కావాలన్నారు.

### సినిమా గైడ్

| బద్వేలు | |
|---|---|
| శేఖర్ | : ఆనందోబ్రహ్మ |
| నౌషాద్ | : వీఐపీ-2 |
| లక్ష్మీనరసింహ | : వివేకం |
| **పోరుమామిళ్ళ** | |
| వెంకటేశ్వర | : జయ జానకి నాయక |
| దేశాయి | : నేనే రాజు, నేనేమంత్రి |

# దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



కొత్తపల్లె కాలువలో దోమల నివారణకు వేసిన ఆయిల్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ రఘు, కమిషనర్ శేషన్న

**ప్రొద్దుటూరు అర్బన్:** ప్రొద్దుటూరు పట్టణంలో ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలో అనేక ప్రాంతాల్లో వర్షపునీరు నిలబడి దోమలు వృద్ధి చెంది దాడి చేస్తున్నాయి. దోమలు విజృంభించి ప్రజలమీద దాడి చేసి రోగాలు ప్రబలకముందే యుద్ధప్రాతిపదికన ప్రత్యేక చర్యలు తీసుకోమని మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, కమిషనర్ శేషన్నలు ప్రజారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఆమేరకు సోమవారం కొత్తపల్లె ఛానల్‌లో వ్యర్తపు త్రెల్లాని కాలువల్లో వేసి దోమల నివారణ కార్యక్రమం చేపట్టారు. అలాగే పట్టణంలో ప్రతి వార్డులో మురికి కాలువల్లో మలేరియా, ఎబేట్ మందులను పిచికారి చేసి దోమలు అరికట్టాలని నిర్దేశించారు. ఇందుకోసం నిధులు కేటాయించినట్లు చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి తెలిపారు. వీధి వీధిన ఫాగింగ్ కూడా చేపడుతారని, దోమల మందు పిచికారి చేయనియెడల మున్సిపల్ చైర్మన్ కమిషనర్ దృష్టికి తేవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. శానిటరీ సూపర్‌వైజర్ రాంప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు నూర్‌బాష, నర్సారెడ్డి, శంకర్, మేస్త్రీలు, మత్తేసు, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల ఫలితమే 2019లో రాష్ట్రమంతా ఉంటుంది

## ● ప్రొద్దుటూరు టీడీపీ నాయకులు వరద, పుల్లయ్య, ఆసం రఘురామిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ వరద, పుల్లయ్య, ఆసం

**ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్:** నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించారని, 2019 ఎన్నికల్లో రాష్ట్రమంతటా ఇదే ఫలితం ఉంటుందని ప్రొద్దుటూరు టీడీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని చూచి నంద్యాల ఓటర్లు టీడీపీ అభ్యర్థిని గెలిపించారన్నారు. వైసీపీ అధినేత జగన్ 13 రోజులపాటు నంద్యాలలో మకాం వేసి ఇంటింటికి తిరిగినా ఆయనను ప్రజలు నమ్మలేదన్నారు. జగన్ ముఖ్యమంత్రిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నంద్యాల ప్రజలు ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పారన్నారు. ఈ ఓటమితో వైసీపీ ఖాళీ కావడం ఖాయమన్నారు. ఆ పార్టీలో ఎవ్వరూ మిగలరన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సొంత జిల్లాలో జగన్ చిన్నాన్న వివేకానందరెడ్డి ఓడిపోయారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌కు అదేగతి పడుతుందన్నారు. లోటు బడ్జెట్‌లోనూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఎన్నికల హామీలన్నీ అమలవుతున్నాయన్నారు. గ్రామీణ, పట్టణ అన్ని ప్రాంతాల్లోనూ, అన్ని వర్గాల ప్రజలు టీడీపీని ఆదరిస్తున్నారన్నారు. నంద్యాలలో ఇది రుజువైందన్నారు. ప్రొద్దుటూరు వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అభివృద్ధిని అడ్డుకుంటున్నాడన్నారు. రానున్న ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్ కూడా రాదన్నారు. టీడీపీ అధికార ప్రతినిధి కర్నాటి వీరశేఖర్‌రెడ్డి, శివాలయం చైర్మన్ పల్లా శంకర్, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ కామిశెట్టి బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు కోనేటి సునంద, రామమునిరెడ్డి, సూర్యనారాయణరనెడ్డి, పార్టీ నాయకులు మార్కెట్ షబ్బీర్, షామీర్ బాష, దొరసానిపల్లె సుధాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, యేసుదాసు తదితరులు పాల్గొన్నారు.

# కొద్దిపాటి వర్షానికే దెబ్బతిన్న రోడ్డు



**ప్రొద్దుటూరు కల్చరల్:** అయిదు మాసాల కిందట నిర్మించిన తారు రోడ్డు ఇటీవల కురిసిన వర్షపునీటితో రోడ్డు దెబ్బతింది. ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన పథకం కింద ఈ ఏడాది మార్చి నాటికి నంగనూరుపల్లె గ్రామం నుండి రేగుళ్లపల్లె గ్రామం వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర సీసీ, తారురోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు ప్రతిపాదనలతో రోడ్డు నిర్మించారు. రెండు రోజుల నుండి కురిసి వరన్షాలతో సబ్‌స్టేషన్ వద్ద తారు వెళ్లిపోయి గుంత పడింది. నాశిరకంగా రోడ్డును కాంట్రాక్టర్ నిర్మించడంతో ఈ దుస్థితి ఏర్పడిందని గ్రామస్థులు వాపోతున్నారు. గతంలో కూడా వర్షపునీటితో రోడ్డు కోసుకుని వెళ్లడంతో సడక్ యోజన పథకం కింద నూతన రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డు దెబ్బతింటే రేగుళ్లపల్లె గ్రామస్థులు అయిదు కిలోమీటర్ల దూరంతో పట్టణానికి రావాల్సి వస్తుంది.


## ఎస్‌ఐపై చర్యలకు రంగం సిద్ధం

**ప్రొద్దుటూరు టౌన్:** త్రీటౌన్ ఎస్‌ఐ కృష్ణంరాజు నాయక్‌పై చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులు సిద్ధంగా ఉన్నారని నవ జ్యోతి హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు టి.కరుణాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్సు లేదన్న సాకుతో సి.కుమార్ అనే వ్యక్తిని స్టేషన్‌లో బందించి రెండు నెలలుగా మోటారు సైకిల్ ఇవ్వకపోవడంతో ఆన ఎస్‌ఐ నిర్వాకాన్ని తమ దృష్టికి తెచ్చారన్నారు. ఎస్‌ఐపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐపై చర్యలు తీసుకొని ఆ నివేదిక పంపాలని సోషల్ వెల్ఫేర్ డీడీ ఎస్పీని ఆదేశించారన్నారు. ఈ మేరకు ప్రొద్దుటూరు డీఎస్పీ, సీఐలకు నోటీసులు జారీ చేశారని తెలిపారు త్వరలో ఎస్‌ఐ చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా వివరించారు.

# పది మంది జూదరుల అరెస్టు

**కొండాపురం :** మండలంలోని బాలప్పకోన సమీపంలో జూదమాడుతున్న పది మందిని పోలీసులు అరెస్టు చేశారు. బాలప్పకోన సమీపంలో జూదమాడుతున్న వారి నుంచి రూ. 42వేలు స్వాధీనం చేసుకున్నట్లు తాళ్ల ప్రొద్దుటూరు ఎస్‌ఐ క్రిష్ణయ్య తెలిపారు. వీరికి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు ఈ సందర్భంగా ఎస్‌ఐ తెలిపారు.

# నంద్యాల గెలుపుపై సంబరాలు



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు అభిమానులు

**ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్:** నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి విజయంపై ప్రొద్దుటూరులో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. స్థానిక నెహ్రూరోడ్డులోని ఆ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు నంద్యాల గెలుపుపై కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. కార్యాలయం వద్ద అభిమానులు బాణసంచా పేల్చారు. స్వీట్స్ పంపిణీ చేశారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. స్థానిక బైపాస్ రోడ్డులోని ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో తెలుగుయువత నాయకులు సిద్దయ్య, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# త్వరలో నెరవేరనున్న ప్రొద్దుటూరు పేదల సొంతింటి కల

**ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్:** ప్రొద్దుటూరులో సొంతిళ్లకోసం ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న పేదల కల త్వరలో నెరవేరనుంది. సొంత ఇళ్లులేని పేదలకు ప్రభుత్వ పక్కా ఇళ్ల నిర్మాణాలకు శనివారం జిల్లా మంత్రి ఆదినారాయణరెడ్డి భూమిపూజ చేశారు. శిలాఫకం ఆవిష్కరించారు. దీంతో ప్రొద్దుటూరులోని సొంత ఇళ్లులేని సుమారు 10 వేల మంది పేదల లబ్ధదారుల కల నెరవేరనుంది. లబ్ధిదారుల సొంత స్థలాల్లో వ్యక్తిగత ఇళ్ల నిర్మాణాలు, సొంత స్థలాలు లేని వారికి రామేశ్వరం, అమృతానగర్‌లలో గృహ నిర్మాణ కాలనీల్లోనూ త్వరలో ఇళ్ల నిర్మాణాలు జరుగనున్నాయి. 300, 365, 430 చ.అ.ల్లో మూడు రకాలైన ఇళ్ల నిర్మాణాలను ప్రొద్దుటూరు రామేశ్వరం హౌసింగ్ కాలనీలో పేదలకు కట్టించి ఇవ్వడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. దరఖాస్తులు చేసుకున్నవారిలో అర్హులను గుర్తించారు. వారికి ఏ రకం ఇళ్లు కావాలో వారి నుంచి అంగీకార పత్రాలు తీసుకున్నారు. వీరిలో మొదటి విడతలో 2510, మలి విడతలో 4000 ఇళ్లను నిర్మించి ఇవ్వనున్నారు. ఈ ఇళ్లను జి+3 పద్ధతిలో అపార్టుమెంట్ టైప్‌లో నిర్మించనున్నారు. ఇందుకోసం రామేశ్వరం గతంలోనే భూసేకరణ సైతం పూర్తయింది. ఇప్పుడు ఈ స్థలంలోనే ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. గతంలో కొద్ది రోజులపాటు ప్రొద్దుటూరు ఇళ్ల నిర్మాణాలపై రాద్ధాంతం జరిగింది. ప్రొద్దుటూరులోనా, పొట్లదుర్తిలోనా అనే చర్చ రిగింది. అధికారులు పరిశీలనలు జరిపారు. అయితే శనివారం ఈ ఇళ్లకు ప్రొద్దుటూరులో భూమి పూజ జరగడంతో అనుమానం తొలగిపోయింది. మిగతావారికి అమృతానగర్‌లోని ఖాళీ స్థలాల్లోనూ ఇళ్ల కేటాయింపుకు అధికారులు పరిశీలన జరుపుతున్నారు. ఇప్పటికే అమృతానగర్‌లో వేలాది కుటుంబాలు నివాసాలున్నాయి. దీంతో పేదలు అక్కడికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. రామేశ్వరం హౌసింగ్ కాలనీ నిర్మాణం కూడా పూర్తయితే ప్రొద్దుటూరులో పేదల సొంతింటి కల నెరవేరినట్లే. అద్దె ఇళ్ల బాధ తప్పినట్లేనని భావిస్తున్నారు.

## జాతీయ అంధత్వంపై నగరంలో సర్వే

**కడప, మారుతీనగర్:** దేశంలో ఎంతమంది అంధత్వంతో బాధపడుతున్నారనే అంశంపై ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వైద్య బృందంచే రిమ్స్ సంచార కంటివైద్య విభాగం కంటి వైద్యుడు డాక్టర్ రామిరెడ్డి, నేత్ర వైద్యాధికారి కంభం చిన్నయ్య సహకారంతో సోమవారం 41వ డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి కంటి పరీక్షలు చేశారు.

### పరిశోధనల వైపు
## దృష్టి మళ్లించేందుకే ప్రయోగశాల

**కడప, ఎర్రముక్కపల్లె:** విద్యార్థులను పరిశోధనల వైపు దృష్టి మళ్లించేందుకే ప్రయోగశాల ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బలక్షుమ్మ పేర్కొన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మెటీరియల్ సైన్స్ పరిశోధన ల్యాబొరేటరీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఇది కళాశాల మొదటి పరిశోధన ప్రయోగశాలన్నారు. స్వయం ప్రతిపత్తి కలిగిన పాఠశాలకు ఇది మరింత బలాన్ని సమకూరుస్తుందన్నారు. ప్రయోగశాల సమన్వయకర్త సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ టెలీ కమ్యూనికేషన్ రంగంలో విరివిగా ఉపయోగపడే ఎర్బియం డోప్ట్ బోరో ఫాస్ఫేట్ గ్లాసెస్‌ను రూపొందించి దీని ద్వారా ఆప్టికల్ ఫైబర్‌లో ఎక్కువ శక్తి నష్టం కాకుండా బ్యాండ్ విడ్త్‌ను పెంచే అవకాశముందన్నారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ శ్రీరాములరెడ్డి, భౌతికశాస్త్ర అధ్యాపకులు ఎంవీ రమణయ్య ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సీఎస్ రెడ్డి, శ్రీనివాసులు, కేవీ రమణ, వీరభద్రయ్య, మదన్‌మోహన్, రామక్రిష్ణ, నాగమునిరెడ్డి పాల్గొన్నారు.

## జడ్పీలో వైభవంగా గణేష్ నిమజ్జన వేడుకలు


లడ్డూను వేలంపాటలో దక్కించుకున్న రమణ

**కడప రూరల్ :** జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం గణేష్ నిమజ్జన వేడుకలు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో జడ్పీ చైర్మన్ గూడూరు రవి, జిల్లా పంచాయతీ అధికారి సి.హెచ్. సుబ్రమణ్యం, డిప్యూటీ సీఈవో సయ్యద్ ఖాదర్‌బాషాలు ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథుడిని జడ్పీ నుంచి ఊరేగింపుగా డప్పు వాయిద్యాలతో నిమజ్జనానికి తీసుకెళ్లారు. పెద్దఎత్తున బాణాసంచాలను కాల్చారు. ఉద్యోగులు కులమతాలకు అతీతంగా రంగులు చల్లుకొని ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం స్వామివారి లడ్డూను వేలం వేశారు. ఈ వేలం పాటలో స్వామివారి లడ్డును నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ 24,000లకు దక్కించుకున్నారు. అనంతరం స్వామివారి ప్రసాదాన్ని భక్తులకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్.నాగిరెడ్డి, లంకామల్లేశ్వర్‌రెడ్డి, చైర్మన్ సీసీ చాట్ల బాలరాజు, పర్యవేక్షకులు యం.వి. నరసింహులు, బి.రామేశ్వరరావు, రఘురాం, లక్ష్మిదేవి, పి.శ్రీనివాస్‌రెడ్డి, తాయారమ్మ, శివరామిరెడ్డి, రంగాచార్లు, గంగాదేవి, ఉద్యోగులు మధుసూదనరెడ్డి, మురళీకృష్ణ, ఎ.గిరిధర్, హరిబాబు, డేవిడ్‌సైమన్, సోమిరెడ్డి, కె.పద్మావతి, శ్రీదేవి, చంద్రకళ, బి.సుజాత, శ్రీకాంత్, యం.ఉషారాణి, సోమశేఖర్, సుదర్శన్, పి.శ్రీనివాసరెడ్డి, వరప్రసాద్, ప్రవీణ్, సుబ్బరాయుడు, సునీల్‌కుమార్, ఇమాం ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు పెండింగ్ బిల్లులు అందించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

**కడప, ప్రకాష్‌నగర్:** జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే అందించాలని సీఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి తెలిపారు. మధ్యాహ్న పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు అప్పులు చేసి పథకాన్ని నడుపుతున్నా 6 నెలలుగా బిల్లులు, గౌరవ వేతనం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు 18 వేలు కనీస వేతనం అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు చాంద్‌బాషా, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, శారద, రంగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు బాదుల్లా, సులోచనమ్మ, వెంకటశివారెడ్డి, సహాయ కార్యదర్శులు అబ్దుల్, రమీజా, ఖాజా, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు

**కడప, కల్చరల్ :** వినాయకచవితి సందర్భంగా పలు మండపాల వద్ద స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నగరంలోని సంధ్య సర్కిల్ వద్ద, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వాసు కార్యాలయం వద్ద, నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద టీడీపీ నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పండుగ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, సున్నపురాళ్లపల్లె రంగ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

***నబీకోటలో***

నబీకోటలో దేవతి శంకరయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద రామనపల్లెకు చెందిన చెంగా సుబ్బలక్షుమ్మ, వెంకటరమణ దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## అనాథ శవానికి 'మేముసైతం'

**కడప, రిమ్స్ :** అందరూ వుండి అనాథలుగా మార్చురీలో వున్న మృతదేహాలకు మేము సైతం సభ్యులు దహన సంస్కారాలు నిర్వహించారు. ఖాజీపేట మండలానికి చెందిన జి.గురమ్మ (55) పదిరోజుల క్రితం ఆసుపత్రిలో రిమ్స్‌లో చికిత్స నిమిత్తం చేరింది. మూడురోజుల క్రితం మృతి చెందింది. ఈ సమాచారాన్ని ఆమె అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములకు తెలియజేయగా వారు మార్చురీ వద్దకు వచ్చి తాము ఆమెకు దహన సంస్కారాలు నిర్వహించలేమని చెప్పి అక్కడ నుంచి వెళ్లిపోయారు. అలాగే మైదుకూరుకు చెందిన గానుగపెంట శ్రీను (35) గత మూడురోజుల క్రితం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని చెల్లెలు, ఆమె భర్తకు విషయాన్ని తెలియజేయగా వారు తమ ఆర్థిక పరిస్థితి బాగా లేదని మీరే దహన సంస్కారాలు నిర్వహించాలని తెలిపారు. దీంతో అక్కడే వున్న మేముసైతం సభ్యులు మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహించారు.


మృతదేహాలను దహన సంస్కారాలకు తీసుకెళుతున్న మేముసైతం సభ్యులు

### ట్రిపుల్‌ఐటీకి కరణం చరణ్


చరణ్‌ను అభినందిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు

**కడప, స్పోర్ట్స్:** క్రీడాకారుడు కరణం చరణ్ ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీకి క్రీడా కోటాలో ఎంపికయ్యారు. నందలూరు మండలం జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ పూర్తి చేసిన పొత్తపి గ్రామానికి చెందిన చరణ్ ఎంపికయ్యాడు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఈశ్వర్‌నాయక్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు రెడ్డయ్య, ఉమేష్, పవన్, క్రిష్ణయ్య, నరేంద్ర, జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, మల్లికార్జునలు అభినందనలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

### వారోత్సవాలు జయప్రదం చేయండి

**కడప, ప్రకాష్‌నగర్:** సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు జరిగే రైతు సంఘం వ్యవస్థాపక వారోత్సవాలను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పీవీ రమణ, ప్రధాన కార్యదర్శి జి.చంద్ర పిలుపునిచ్చారు. సోమవారం ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి హాలులో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చెన్నారెడ్డి పాల్గొన్నారు.

### భారతిబార్ వీధిలో చోరీ

**కడప, క్రైం:** నగరంలోని భారతిబార్ వీధిలోని ప్రైవేటు స్కూల్‌లో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న శ్రీదేవి ఇంట్లో దొంగలు పడ్డారు. బీరువాలో వున్న బంగారు నగలు, వెండి సామగ్రిని దొంగలు అపహరించారు. చిన్నచౌకు ఎస్ఐ రామక్రిష్ణుడు సంఘటన స్థలానికి చేరుకొని చోరీ ఘటనను పరిశీలించారు. ఆయన వివరాల మేరకు ఆరవేటి శ్రీదేవి కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 25న ఆర్‌టీపీపీలో వున్న సోదరుడి ఇంటికి వెళ్లారు. దొంగలు ఇంటి తలుపులు ధ్వంసం చేసి బీరువాలో వుంచిన 65 గ్రాముల బంగారు నగలు, రెండు కేజీల వెండి వస్తువులను అపహరించినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

## 11వ డివిజన్‌లో అన్నదానం


అన్నదానం చేస్తున్న శ్రీను, ఎం.రాజశేఖర్

**కడప, ఎర్రముక్కపల్లె :** మృత్యుంజయకుంట 11వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ డేరంగుల శివ అధ్యక్షతన గణేష్ యూత్ ఆధ్వర్యంలో శ్రీను, ఎం.రాజశేఖర్ సోమవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 6 ఏళ్ల నుంచి టీడీపీ తరపున డేరంగుల శివ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి చేసుకెళ్లారన్నారు. ఈ సందర్భంగా నంద్యాల ఉపఎన్నికల్లో టీడీపీ దాదాపు 28వేల ఓట్ల మెజార్టీతో సాధించినందుకు సంతోషంగా సంబరాలు జరుపుకున్నారు.

ఈ కార్యక్రమంలో బి.భాస్కర్, సి.బాబు, కె.బాదుల్లా, ఎం.సురేష్, జి.బాబు, రవి, అశోక్, ఎన్.నాని, సి.కిరణ్, కె.బాలరాజు, సి.నాగభూషణం, సి.జగదీష్, వై.వెంకి, సురేష్, వి.బాష, దొరబాబు, డి.వరుణ్, ఎం.వినోద్, ఎం.కిషోర్, ఎ.గౌస్‌పీర్ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారం కాకపోతే నిరవధిక సమ్మె

- యూఈసీడబ్ల్యూయూ జిల్లా నాయకుల హెచ్చరిక

**కడప, అర్బన్:** విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకపోతే సెప్టెంబర్ 30వ తేదీ తరువాత నిరవధిక సమ్మె చేపడుతామని యునైటెడ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు హెచ్చరించారు. పాతబస్టాండులోని సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి విద్యుత్ భవన్‌లోని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ శివప్రసాద్‌రెడ్డిని, ఏపీ ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్‌ను ఏపీ ట్రాన్స్‌కో నిలయంలో కలిసి వేరువేరుగా సమ్మె నోటీసులు యూఈసీడబ్లుసీ నాయకులు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులందరి వయసు, విద్యార్హతతో నిమిత్తం లేకుండా క్రమబద్ధీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామక్రిష్ణారెడ్డి, సురేష్‌బాబు, సుధాకర్, బాలక్రిష్ణ, ఓబులేసు, జాఫర్ హుసేన్, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. యూఈసీడబ్ల్యూయూకు ఇంజనీర్స్ సంఘంతో పలు కార్మిక సంఘాలు మద్దతు పలికారు.

## అభివృద్ధికి పట్టం కట్టిన నంద్యాల ప్రజలు

**కడప, ఎర్రముక్కపల్లె:** నంద్యాల ఎన్నికల ఫలితాలలో ప్రజలు టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించినందుకు కడప నగర టీడీపీ ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల ప్రజలు అభివృద్ధి వైపు నడుస్తారని, ఫ్యాక్షన్ రాజకీయాలకు దూరమని మరోసారి నిరూపించారు. ఈ గెలుపు ప్రతిపక్ష వైసీపీకి చెంపపెట్టు అని, ఇకనైన ఫ్యాక్షన్ స్వభావానికి స్వస్తి చెప్పి సీఎం చంద్రబాబు చేసే అభివృద్ధిని గుర్తించాలన్నారు. 2019లో టీడీపీ అఖండ మెజార్టీతో రాష్ట్రమంతా గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయన్నారు.

# నంద్యాల గెలుపుపై టీడీపీ సంబరాలు

**రాయచోటిరూరల్ :** రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయగల శక్తి మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే సాధ్యమనే నమ్మకంతో నంద్యాల ప్రజలు తీర్పునిచ్చారని టీడీపీ పార్టీ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. అనంతరం నంద్యాలలో తెలుగుదేశం పార్టీ అఖండ మెజార్టీ సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో భూమా బ్రహ్మానందరెడ్డికి 27 వేల ఓట్ల మెజార్టీ ప్రజలు ఇచ్చారన్నారు. ఎన్నికల ప్రచారంలో ఎవరెన్ని మాటలు అన్నా చంద్రబాబు హుందగా వ్యవహరించారన్నారు. నంద్యాల ప్రజలు అభివృద్ధిని కోరుకున్నారన్నారు. అందుకే అన్ని రౌండ్లలోనూ టీడీపీకి స్పష్టమైన ఆధిక్యత వచ్చిందన్నారు. ప్రత్యర్థి పార్టీ తాము బలంగా ఉన్నామని చెప్పుకున్న ప్రాంతాల్లో కూడా టీడీపీకి ఓట్లు పడ్డాయన్నారు. 2019లో కూడా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీనే అధికారంలోకి వస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్‌బాబు నాయకత్వాన్ని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కులాలు, మతాల ప్రస్తావన లేకుండా అందరూ టీడీపీకి ఓట్లు వేశారని అన్నారు.


శ్రీనివాసరెడ్డికి మిఠాయి తినిపిస్తున్న దృశ్యం

**రాయచోటిటౌన్:** నంద్యాల ఎన్నికల గెలుపు ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతర కఠోర శ్రమకు నిదర్శనమని జిల్లా అధికార ప్రతినిధి, మార్కెట్ కమిటీ ౖచైర్మన్ గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. సోమవారం ఎన్నికల ఫలితాలపై ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చిన దేశం పార్టీని ప్రజల దృష్టిలో పనికిమాలిన పార్టీగా చేసేందుకు కృషి చేసిన జగన్ ప్రయత్నాలు ఫలించలేదన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ముస్లిం మైనార్టీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించింది దేశం పార్టీనేనని వారి సంపూర్ణ మద్దతు ఈ ఎన్నికల్లో బ్రహ్మానందరెడ్డికే లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో న్యామత్, అమీర్, నసిరుద్దీన్‌షా, కొప్పల గంగిరెడ్డి, ఖాదర్‌వలి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ గెలుపుతో రాష్ట్ర అభివృద్ధికి మలుపు లాంటిదని బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ శ్రీనివాసరాజు పేర్కొన్నారు. సోమవారం రాయుడు కాలనీలోని రంజిత్ హాస్పిటల్ నందు ఆర్‌యంపీ వైద్యులు రంజిత్ ఆధ్వర్యంలో


చిన్నమండెంలో బాణసంచా పేలుస్తున్న దృశ్యం

నంద్యాల ఎన్నికలలో టీడీపీ గెలుపుపై సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌యంపీ వైద్యులు రంజిత్, పలువురు యువకులు తదితరులు పాల్గొన్నారు.

### సంబేపల్లెలో..

**సంబేపల్లె :** నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ 27,645 ఓట్ల మెజార్టీతో గెలుపొందడంతో మండలంలో తెలుగు తమ్ముళ్ల సంబరాలను చేసుకున్నారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు చిన్నరెడ్డెయ్యయాదవ్ ఆధ్వర్యంలో సంబేపల్లె మండల టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. 2019 ఎన్నికలకు నంద్యాల ఉప ఎన్నికల విజయమే లక్ష్యమని, 2019 తెలుగుదేశం పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొంది తీరుతుందన్నారు. ఈ విజయం నంద్యాల ప్రజలదేనన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుయువత పొత్తూరి అశోక్‌నాయుడు, టీడీపీ నాయకులు వేణుగోపాల్‌నాయుడు, మల్లారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పొత్తూరి రవీంద్రనాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, దినేష్,


లక్కిరెడ్డిపల్లెలో టీడీపీ సంబరాలు

పలువురు తెలుగు తమ్ముళ్లు తదితరులు పాల్గొన్నారు.

### రామాపురంలో..

**రామాపురం :** హోరాహోరీగా సాగిన నంద్యాల ఉప ఎన్నికల్లో అధికార పార్టీ టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి గెలుపుపై సోమవారం లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ ౖచైర్మెన్ ఎం.రమేష్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు వై. శేఖర్‌లు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో సోమవారం గెలుపు ప్రకటించిన వెంటనే మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, వెంకటరామిరెడ్డి, లక్ష్మిరెడ్డి, అన్నయ్య, శివయ్య, మహబూబ్‌బాషా, మేరా నాగన్న, బాలయ్య, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### గాలివీడు..

**గాలివీడు :** ఎప్పటికీ ప్రజల మద్దతు తెలుగుదేశం పార్టీకేనని నారాలోకేష్‌సేన అధ్యక్షుడు రేవనూరి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం వెలువడిన నంద్యాల ఎన్నికల ఫలితాలు రాష్ట్రమంతటా 2019లో కూడా ఇలాగే వస్తాయని పేర్కొన్నారు. రాయచోటి


స్వీట్లు పంపిణీ చేస్తున్న ఖాదర్‌బాషా

నియోజకవర్గం కూడా 2019లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గెలుస్తారని ఆయన పేర్కొన్నారు.

### లక్కిరెడ్డిపల్లెలో..

**లక్కిరెడ్డిపల్లె :** అన్నింటిలోనూ నీతి నిజాయితీతో నిలబడి ప్రజలకు సేవలందించే ప్రభుత్వం తెలుగుదేశమని మాజీ మార్కెట్ ౖచైర్మన్ కాలాడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డిలు పేర్కొన్నారు. నంద్యాల ఉప ఎన్నికల విజయానికి లక్కిరెడ్డిపల్లెలో సోమవారం సంబరాలు అంబరాన్నంటాయి. టపాసులు కాల్చి టీడీపీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కువ పరిపాలనలో ఉండేది టీడీపీనేనని, చిన్న చిన్న పార్టీలు కేవలం కొద్దిరోజులు మాత్రమే నంద్యాల ఎన్నికల్లో వైఎస్ ఆర్ సీపీకి ప్రజలు బుద్ధి చెబుతారని రౌడీ రాజకీయాలు టీడీపీ దెబ్బకు తట్టుకోలేవని వారన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీదే విజయమని వారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, గ్రామ కమిటీ సభ్యులు రవిశంకర్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ మెంబర్ అజ్మతుల్లా, అన్వర్‌బాషా, గంగయ్య, బడుగు వాసు, మండల టీడీపీ అద్యక్షుడు జయరాం, కార్యకర్తలు పాల్గొన్నారు.

### చిన్నమండెంలో..

**చిన్నమండెం :** నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి ఘన విజయం టీడీపీ శ్రేణులలో నూతనోత్సాహం నింపింది. చిన్నమండెం బస్టాండు ఆవరణలో జమీల్, బాలచంద్రయాదవ్, మండల ప్రధాన కార్యదర్శి నాగభూషణం, శివయ్య, రాజారెడ్డి, శివయ్య నాయుడు, రవి, రాజా తదితరుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు. కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం బస్టాండులో ఉన్న అందరికీ మిటాయిలు పంచి పెట్టారు. పార్టీ కార్యాలయంలో నంద్యాల టీడీపీ విజయంపై సంబరాలు నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, ప్రధాన కార్యదర్శి నాగభూషణం, మాజీ సర్పంచ్ మల్లికార్జున, దిగువగొట్టివీడు ఎంపీటీసీ ప్రతాప్‌నాయుడు, మైనార్టీసెల్ కార్యదర్శి బాగిఉల్లా, సీ.పొలిమేరపల్లె నాయకుడు చెన్నక్రిష్ణారెడ్డి చిన్నమండెం గ్రామ కమిటీ అధ్యక్షుడు బాషిద్ తదితరుల ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. ఒకరికి ఒకరు కేక్ తినిపించుకొంటూ సంబరాలు చేసుకున్నారు. వైసీపీ పతనం ప్రారంభమైందన్నారు. వచ్చే ఎన్నికలలో అన్ని స్థానాలు టీడీపీవే అన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సంబరాలు చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్లు

**హలో.. ఆంధ్రజ్యోతి** (Hello Andhra Jyothi)

మీ ప్రాంతంలో ఉన్న సమస్యలు తెలపాలన్నా, ఇతరత్రా సమాచారం ఇవ్వాలన్నా 'ఆంధ్రజ్యోతి'ని ఈ క్రింది నెంబర్లలో సంప్రదించండి.

| | |
|---|---|
| రాయచోటి | 9985411187 |
| రాయచోటి టౌన్ | 9441794427 |
| రాయచోటిరూరల్ | 9676860131 |
| సంబేపల్లె | 9703163108 |
| గాలివీడు | 9441049010 |
| చిన్నమండెం | 8886297090 |
| లక్కిరెడ్డిపల్లె | 8897095884 |
| రామాపురం | 9441079032 |

## 2019లోనూ టిడీపీదే అధికారం

### జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు మల్లెల శ్రీవాణి

**రాయచోటి :** చంద్రబాబు నాయుడును చూసే నంద్యాల ప్రజలు తెలుగుదేశం పార్టీకి ఓటు వేశారని, రానున్న 2019 ఎన్నికల్లోనూ రాష్ట్ర వ్యాప్తంగా టిడీపీ అధికారంలోకి వస్తుందని జిల్లా తెలుగుమహిళ అధ్యక్షురాలు మల్లెల శ్రీవాణి అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆమె నంద్యాల ఉపఎన్నికలో టిడీపీ విజయంపై స్థానిక నాయకులుతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచిపెట్టారు. కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో పట్టణ తెలుగుమహిళ అధ్యక్షురాలు నాగవేణి, టీడీపీ నాయకులు అతావుల్లా, సాకిర్, వెంకటరమణారెడ్డి, రామాంజులు పాల్గొన్నారు.


కేక్‌ను కట్‌చేస్తున్న జిల్లా తెలుగుమహిళ అధ్యక్షురాలు మల్లెల శ్రీవాణి

## ఇంటింటికి టీడీపీని విజయవంతం చేయాలి

**రామాపురం :** తెలుగుదేశం పార్టీని ప్రజల్లోకి, ఇంటింటికి తీసుకుపోయే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ ౖచైర్మన్ రమేష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కేరళ గౌతం హైస్కూల్ ప్రాంగణం లో సోమవారం తెలుగుదేశం పార్టీ మండల స్థాయి సమావేశం టీడీపీ మండల అధ్యక్షుడు వై.శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 13 గ్రామ పంచాయతీలోని ప్రతి ఇంటికి వెళ్లి పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు అందాయా లేదా గ్రామంలో ఇంకా అర్హులైన వారు ఉండి వారికి సంక్షేమ పథకాలు అందలేకపోతే అలాంటి వారిని గుర్తించి ఇన్‌చార్జి రమేష్‌రెడ్డి దృష్టికి తీసుకుపోవాలన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ నాయకుడు మహబూబ్‌బాషా, ప్రధాన కార్యదర్శి ఒరంగారెడ్డి, ఏకిలపల్లె బసిరెడ్డి, మామిళ్ల శివ, గ్రామ కమిటీ అధ్యక్షులు లక్ష్మిరెడ్డి, అన్నయ్య, మేరా నాగన్న, ప్రభాకర్, సుబహాన్, సరస్వతిపల్లె శివయ్య, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**సినిమాగ్రేడ్**

| రాయచోటి | |
|---|---|
| ప్రసాద్ | : అర్జున్‌రెడ్డి |
| గౌతమ్ | : నేనేరాజు నేనేమంత్రి |
| సాయి | : వివేకం |
| సోనీరాజ్ | : జయజానకినాయక |
| **గాలివీడు** | |
| పావని | : బాహుబలి-2 |

# నంద్యాలలో అభివృద్ధికే పట్టం

## గెలుపుపై టీడీపీ సంబరాలు

**బద్వేలు :** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళుతున్న టీడీపీకే నంద్యాలలో పట్టం కట్టారని ఎమ్మెల్యే జయరాములు అన్నారు. సోమవారం ఆర్అండ్బీ అతిథి గృహంలో టీడీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో బాణాసంచా పేల్చుతూ టీడీపీ కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గెలుపు, మెజారిటీపై ఊహించిన విధంగానే ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిపక్ష నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై అనుచిత వాఖ్యలు చేయడంపట్ల ప్రజలు వైసీపీపై తీవ్ర అసంతృప్తితో టీడీపీకి తిరుగులేని ఆధిపత్యాన్ని కట్టబెట్టారన్నారు. రాబోవు కాలంలో ఏ ఎన్నికలు జరిగినా ఇదే ఫలితం ఉండబోతుందని ఆయన జోస్యం చెప్పారు. 2019లో తిరిగి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నరసింహానాయుడు, రాంబాబు, సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, బీరం జయరామిరెడ్డి, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్‌బాష (బిగ్ బాస్), జహంగీర్‌బాష, చంద్రశేఖర్‌రెడ్డి, మునిరెడ్డి, కొంగలవీటి శ్రీనివాసులరెడ్డి, పొట్టి సుబ్బారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, క్రిష్ణా, పుష్పరాజు, కొలవలి వేణుగోపాల్, కొమ్మురాజు శ్రీనివాసులు, బెనర్జీ పాల్గొన్నారు.


బద్వేలులో టీడీపీ విజయంతో స్వీట్లు పంచుకుంటున్న ఎమ్మెల్యే జయరాములు, టీడీపీ నాయకులు


పోరుమామిళ్లలో బాణాసంచా పేల్చుతున్న టీడీపీ నాయకులు


శ్రీనివాసపురంలో బాణాసంచాపేల్చి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

### తెలుగుతమ్ముళ్ల సంబరాలు

**కలసపాడు :** నంద్యాల ఉపఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందడంతో సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. వైవీయూ పాలక మండలి సభ్యురాలు ఎన్‌డి విజయజ్యోతి స్వగృహంలో మండల మాజీ అధ్యక్షుడు బోవిళ్ల రమణయ్య ఆధ్వర్యంలో, అలాగే మూడురోడ్ల కూడలిలో టీడీపీ మండల అధ్యక్షుడు బాలిరెడ్డి ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో వైవీయూ పాలకమండలి సభ్యురాలు విజయజ్యోతి మాట్లాడుతూ నంద్యాల ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టారన్నారు. ఎవరు ఎన్ని కుతంత్రాలు పన్నినా ప్రజలు మాత్రం టీడీపీ వైపే ఉన్నారని రుజువైందన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా టీడీపీనే గెలుస్తుందన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత మండల అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, సగిలిడేవిడ్, మాజీ ఎంపీటీసీ రామసుబ్బయ్య, మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, పెద్ద సంఖ్యలో తెలుగుతమ్ముళ్లు పాల్గొన్నారు.


కలసపాడులో నంద్యాల గెలుపుపై తెలుగుతమ్ముళ్ల సంబరాలు

### నంద్యాల విజయంపట్ల టీడీపీ హర్షం

**పోరుమామిళ్ల :** నంద్యాలలో జరిగిన ఉపఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి అఖండ విజయం సాధించడం పట్ల జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు రామసుబ్బారావు, మాజీ ఉపసర్పంచ్ మేడిశెట్టి వెంకటేశ్వర్లు, ఎస్ఎంబాష, ఆరె రామక్రిష్ణ, సత్యరాజ్, గుర్రయ్య, వెంకటక్రిష్ణలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం వారు ఆర్అండ్బీ అతిథిగృహానికి వెళ్లే దారిలో గాజుల్లా టీఅంగడి సర్కిల్‌లో బాణాసంచా పేల్చారు.

### నంద్యాలలో గెలుపు చారిత్రాత్మక తీర్పు

**గోపవరం :** తెలుగుదేశం ప్రభుత్వం పనితనం, అభివృద్ధి కార్యక్రమాలకు నంద్యాల ప్రజలు చారిత్రాత్మక తీర్పును ఇచ్చారని, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు టి. రామానాయుడు (టెంకాయలనాయుడు) పేర్కొన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకున్న సందర్భంగా శ్రీనివాసపురం కూడలిలో టీడీపీ శ్రేణులు బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెడుతున్న పథకాలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు రాబోవు కాలంలో జరిగే ప్రతి ఎన్నికల్లో కూడా టీడీపికి విజయఢంకా మోగిస్తుందన్నారు. కార్యక్రమంలో మాదాల వెంకటేశ్వర్లు నాయుడు, రమణయ్య, సుబ్బారెడ్డి, వెంగయ్య, కొండయ్య, శ్రీను, బాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలి

**పోరుమామిళ్ల :** బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ మహాసభ జాతీయ కన్వీనర్ అవ్వారు మల్లికార్జున అన్నారు. బీసీ రాజకీయ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం పోరుమామిళ్ల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శేషారాం సింగ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబీసీ ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని, ఇతర కులస్థులను బీసీలో చేర్చరాదని పేర్కొన్నారు. మైదుకూరు బీసీమహాసభ నాయకులు నరసింహులు, కత్తి రామసుబ్బయ్య పాల్గొన్నారు.


తహసీల్దార్ శేషారాంసింగ్‌కు వినతి పత్రం అందిస్తున్న అవ్వారు మల్లికార్జున

### సంకల్పయాత్రను జయప్రదం చేయండి

**కలసపాడు :** బీసీ రాజకీయ సంకల్పయాత్రను జయప్రదం చేయాలని బీసీ మహాసభ జాతీయ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఆధ్వర్యంలో చేపట్టిన సంకల్పయాత్ర సోమవారం కలసపాడుకు చేరుకుంది. కార్యక్రమంలో ఓబీసీ సంఘం రాయలసీమ అధ్యక్షుడు మునెయ్య బీసీ మహాసభ మైదుకూరు అసెంబ్లీ కన్వీనర్ నరసింహులు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 70 సంవత్సరాలు దాటినా బీసీలు నేటికీ సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, ఉద్యోగపరంగా, రాజకీయంగా ఎటువంటి గుర్తింపుకు నోచుకోవడం లేదన్నారు. చట్టసభల్లో బీసీలకు జనాభాప్రాతిపాదికన రిజర్వేషన్లు కల్పించడంతోపాటు ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

### పదోన్నతిలో రిజర్వేషన్లు కల్పించాలి

**కాశినాయన :** బీసీలకు పదోన్నతిలో రిజర్వేషన్లు కల్పించాలని అవ్వారు మల్లికార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బీసీ జాతీయ సంకల్పయాత్ర కాశినాయన మండలానికి చేరిన సందర్భంగా స్థానిక బీసీ నాయకులతో కలసి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజేష్ ఉదయ సంతోష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ జనాభాను లెక్కించి రాజ్యాంగ పరిధిలో గురించాలన్నారు. ఓబిసి సంఘం రాయలసీమ అధ్యక్షుడు మునెయ్య, జిల్లా నాయకులు వెంకటసుబ్బయ్య, బీసీ మహాసభ యువజన సంఘం నాయకులు సుబ్బరామయ్య, పలువురు స్థానిక బీసీ నాయకులు పాల్గొన్నారు.

# రద్దుకు సిఫారసు చేసిన భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

**గోపవరం :** మండల పరిధిలో రద్దుకు సిఫారసు చేసిన సర్వేనెంబర్ 792, 797, 798/1, 2, 3, 4లలోని భూముల్లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ఆ భూములను సాగు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు చంద్రమోహన్‌రాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక జేవీభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రద్దుచేయబోతున్న భూముల్లో అక్రమంగా సాగు చేయాలని చూస్తే సహించమన్నారు. 9నెలలుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేదలకు ఇంటిపట్టాలు కేటాయించాలన్నారు సీపీఐ నాయకులు అనిల్, సంజీవ్ సుబ్బయ్య రాజేంద్రప్రసాద్, లక్షుమ్మయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గోపవరం సొసైటీ ఎన్నిక ప్రశాంతం

**గోపవరం :** మండలంలోని గోపవరం ప్రాజెక్టు సైట్ సొసైటీ ఎన్నిక సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఈసొసైటీకి 200మంది సభ్యులు ఉండగా, 13మంది సభ్యులను, ఒక చైర్మన్‌ను ఈ ఎన్నిక ద్వారా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా ఈశ్వరయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా లాజరస్, ట్రెజరర్‌గా ఆశీర్వాదాన్ని ఎన్నుకున్నారు. ఈఎన్నిక సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బద్వేలు సీఐ రెడ్డెప్ప, గోపవరం ఎస్ఐ హేమాద్రి, బద్వేలు ఎస్ఐలు బందోబస్తును ఏర్పాటు చేశారు.

# అవధుల్లేని ఆనందంలో టీడీపీ నేతలు

## మంత్రి, మాజీ మంత్రి వర్గాల్లో ఆనందోత్సాహం



బాణ సంచా పేలుస్తున్న మాజీ మంత్రి పీఆర్ వర్గం, మంత్రి ఆదినారాయణరెడ్డి వర్గం

**ముద్దనూరు:** నంద్యాల టీడీపీ గెలుపుపై మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి, మంత్రి ఆదినారాయణరెడ్డి వర్గాల్లో ఆనందానికి అంతులేకుండా పోయింది. సోమవారం నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నిక ఫలితాల లెక్కింపులో ప్రతి రౌండులో టీడీపీ విజయభేరి మోగిస్తుండడంతో నేతలు, కార్యకర్తల్లో ఆనందానికి అవధులులేకుండా పోయింది. భారీ మెజారిటీతో టీడీపీ అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి గెలుపు ప్రకటించగానే మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి వర్గ నేతలు పాత బస్టాండులో మాజీ జడ్పీటీసీ ఉమ్మడిశెట్టి సుబ్బరాయుడు, మైనారిటీ నేత అబ్దుల్‌ఖాదర్, సర్పంచ్ శివరామిరెడ్డి, యామవరంలో మాజీ ఎంపీటీసీ మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు బాణా సంచా పేల్చి ఆనందాన్ని పంచుకున్నారు.

### మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో....

మంత్రి ఆదినారాయణరెడ్డి వర్గానికి చెందిన కటికరెడ్డి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ అంతురాజులు పాత బస్టాండు ఆవరణలో బాణా సంచా పేల్చి ఆనందాన్ని వ్యక్త పరిచారు.

### కొండాపురంలో...

**కొండాపురం:** నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించడంతో స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద సంబరాలు నిర్వహించారు. టీడీపీ ఘన విజయం సాధించడంలో మంత్రి ఆదినారాయణరెడ్డి కీలక పాత్ర పోషించారని మండల టీడీపీ నేతలు గండ్లూరు నాగేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, పొట్టిపాడు ప్రతాప్‌రెడ్డి, చౌటిపల్లె రామసుబ్బారెడ్డి, పాతకొండాపురం బాబు మాట్లాడారు. తిమ్మాపురం మాజీ సర్పంచు బాబుల్‌రెడ్డి తిమ్మాపురంలో బాణసంచాపేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పథకాలతోనే నంద్యాలలో టీడీపీ ఘన విజయం సాధించిందని తెలిపారు.

# ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కారానికి కృషి

**జమ్మలమడుగు రూరల్:** జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని ఆయా మండలాల అర్జీదారుల సమస్యలను వెనువెంటనే పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆర్డీఓ దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో చేపట్టిన ప్రజావాణికి పులివెందుల, కొండాపురం, చెవిటిపల్లె, దత్తాపురం, ఓబన్నపేట, వేముల తదితర ప్రాంతాల నుంచి ప్రజలు వివిధ సమస్యలపై ఆర్డీఓకు అర్జీలు అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీదారులకు ఆయా ప్రాంతాల సమస్యలను అధికారులతో మాట్లాడి నివేదిక అందజేశారు. ఇప్పటి వరకు కొండాపురం మండలంలో మునక ప్రాంత ప్రజలకు 7,400 చెక్కులను అందజేస్తామన్నారు. అయినా బాధితులు చెక్కులు నిలిపివేశారని, చెక్కుల్లో తప్పుడు పేర్లు ఉన్నాయని తదితర సమస్యలపై వచ్చారు.

# స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి



కళాశాల ఎదుట ప్లకార్డులు పట్టి నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

**జమ్మలమడుగు రూరల్:** జమ్మలమడుగు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం ఉదయం విద్యార్థినులు ప్లకార్డులు చేతపట్టుకుని జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు లక్ష్మినారాయణ, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి డేవిడ్‌రాజు, వినయ్ మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి మూడున్నరేళ్లు దాటుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో స్టీల్‌ప్లాంట్ హామీ ఇచ్చారన్నారు. రాయలసీమలో నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతోందని, ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తే ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.

# సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

**జమ్మలమడుగు రూరల్:** దేవగుడిలో ఆదివారం రాత్రి మంత్రి ఆదినారాయణరెడ్డి స్వగృహంలో దరఖాస్తు చేసుకున్న బాధిత కుటుంబాల సభ్యులకు ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. జమ్మలమడుగు, మైలవరం, ఎర్రగుంట్ల, కొండాపురం తదితర మండలాలకు చెంది న 16 మంది బాధితులకు రూ.10 లక్షలు విలువైన చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి ఫండ్‌ను బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



బాధితులకు చెక్కులు
అందిస్తున్న మంత్రి ఆదినారాయణరెడ్డి

# మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ ధర్నా

**ఎర్రగుంట్ల:** ఎర్రగుంట్ల మండలం చిలమకూరు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ ఎర్రగుంట్ల ఆధ్వర్యంలో సోమవారం ఎర్రగుంట్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ గ్రామాల్లో పేదల కాలనీల్లో కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వాధికారులు విఫలమయ్యారని విమర్శించారు. అభివృద్ధి మంత్రం జపిస్తున్న కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి అభివృద్ధి చేయడం లేదన్నారు. అనంతరం కార్యాలయంలోని సూపరిండెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నేత ఎంవీసుబ్బారెడ్డి, భవానిశంకర్ తదితరులు పాల్గొన్నారు. చిలమకపూజకరయ్య కాలనీలో కొందరికి ఇళ్ల ఇచ్చి మరికొందరికి ఇవ్వలేదన్నారు.

# ప్రజలను భయపెట్టి గెలిచారు



విలేకరులతో మాట్లాడుతున్న వైసీపీ నేతలు

**కొండాపురం:** ప్రజలను భయపెట్టి ఉప ఎన్నికల్లో గెలిచారని వైసీపీ కార్యదర్శి, తాళ్లప్రొద్దుటూరు సర్పంచు రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. తాళ్లప్రొద్దుటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటు వేయకుంటే వివిధ పద్ధతుల్లో వారిని భయపెట్టి ప్రలోభాలకు గురిచేసి నంద్యాల ఉప ఎన్నికల్లో గెలిచారన్నారు. ఉప ఎన్నికల్లో సానుభూతి బాగా పనిచేసిందన్నారు. బెదిరించి భారీ ఎత్తున డబ్బు వెదజల్లి నంద్యాల ఉప ఎన్నికల్లో గెలిచారన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మడం లేదని, 2019లో జగన్ సీఎం కావడం తథ్యమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఏదిఏమైనా ప్రజాతీర్పును శిరసావహిస్తామన్నారు. వైసీపీ నేతలు హరి, శివ తదితరులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

**మైలవరం:** ఎన్టీఆర్ పథకం ద్వారా మంజూరైన గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. మైలవరంలో ఆయన మాట్లాడుతూ వద్దిరాల, కల్లుట్ల, దొమ్మరనంద్యాల, వేపరాల, మైలవరం, లింగాపురం, ముర్రపంది, నార్జాంపల్లె, నవాబుపేట, తలమంచిపట్నం, తొర్రివేముల పంచాయతీల్లో 2016-17కు 625 గృహాలు మండలానికి మంజూరయ్యాయన్నారు. అందులో 197 గృహాలకు పునాదులు తీశారు, 54 గృహాలు బేస్‌మెంట్‌లు, మరో 30 గృహాలు ఆరు అడుగుల ఎత్తు వరకు గోడలు వచ్చాయని, 9 గృహాలు రూఫ్‌లెవెల్ మరో 33 గృహాలు కప్పు వరకు వచ్చాయన్నారు. 302 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణ పనులు మొదలు పెట్టలేదని త్వరగా పనులు చేయకపోతే గృహాలు రద్దయ్యే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు నిర్మాణాలను పర్యవేక్షిస్తున్నామన్నారు. 33 గృహాలకు సంబంధించి బిల్లులు ఇప్పటికే ఇచ్చామన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి బిల్లులు వెంటనే మంజూరు అవుతున్నాయని లబ్ధిదారులు గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.

# సమావేశానికి ఎందుకు పిలవలేదు

## కమిషనర్‌కు వైస్‌చైర్మన్ సూటి ప్రశ్న



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ తాతిరెడ్డి తులమ్మ, మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ ముల్లాజానీ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు

**జమ్మలమడుగు:** ఇటీవల జరిగిన హౌసింగ్ లబ్ధిదారుల సమావేశానికి కౌన్సిలర్లను ఎందుకు పిలవలేదని, కౌన్సిలర్లను పిలవరాదని ఆఫీసు గైడ్‌లైన్స్ చూపాలని కమిషనర్‌ను వైస్‌చైర్మన్ ముల్లాజానీ ప్రశ్నించారు. సోమవారం నగర పంచాయతీ కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ తాతిరెడ్డి తులశమ్మ అధ్యక్షతన సాధారణ సమావేశంలో తన ప్రశ్నకు సమాధానం చెప్పాలని కమిషనర్ లక్ష్మీరాజ్యంను వైస్‌చైర్మన్ నిలదీశారు. మాజీ వైస్‌చైర్మన్, కౌన్సిలర్ తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి సమాధానం చెప్పేందుకు ప్రయత్నించగా తాను కమిషనర్‌ను అడుగుతున్నానని, కమిషనరే సమాధానం చెప్పాలని వైస్‌చైర్మన్ మొండికేశారు. ఒకదశలో మైక్‌ను విసిరిపారేశారు. వార్డు ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు.

ప్రధాన రోడ్ల, కాల్వలపై బంకులు, అంగళ్లు వెలిశాయని, చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ వైస్‌చైర్మన్, కౌన్సిలర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తాను ప్రతి విషయానికి అడ్డం పడడం లేదని, చైర్‌పర్సన్, కమిషనర్ సభ్యుల ప్రశ్నలకు సమాదానాలు చెప్పని పక్షంలో తాను చెప్పవలసి వస్తుందని వివరించారు. ఇకపై కౌన్సిల్ సమావేశంలో సంతకం చేసి వెళ్లిపోతానని ఆవేదన వెలిబుచ్చారు. కమిషనర్ లక్ష్మీరాజ్యం మాట్లాడుతూ సమయాభావం వలన కౌన్సిలర్లను హౌసింగ్ లబ్ధిదారుల సమావేశానికి పిలవలేకపోయానన్నారు. ఇకపై సమావేశాలకు కౌన్సిలర్లకు సమాచారం అందిస్తామన్నారు. చైర్ ప ర్సన్ తాతిరెడ్డి తులశమ్మ మాట్లాడుతూ సభ్యులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటానన్నారు. సమావేశంలో అజెండాలోని అంశాలను సిబ్బంది చదివి వినిపించారు. వాటిని కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సమావేశం లో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మిలీనియం మార్చ్ విజయవంతం చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరామిరెడ్డి, లక్ష్మీరాజా

**కడప,ఎర్రముక్కపల్లె:** సీపీఎస్ విధానం రద్దు చేయాలంటూ తలపెట్టిన మిలీనియం మార్చ్ విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. కడప ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏపీటీఎఫ్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు సామాజిక భద్రత లేని సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. సెప్టెంబర్ 1న తలపెట్టిన మిలీనియం మార్చ్‌కు ఏపీటీఎఫ్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామసుబ్బయ్య, మహ్మద్‌రఫీ, నారాయణరెడ్డి, చంద్రమోహన్, శ్రీనివాసులు, ప్రదీప్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### యూటీఎఫ్ ఆధ్వర్యంలో

కడప యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా మాట్లాడుతూ ఉద్యమాల ద్వారా సాధించుకున్న పెన్షన్ సౌకర్యాన్ని గత ఎన్డీఏ ప్రభుత్వం కాలరాస్తూ సీపీఎస్ విధానాన్ని అమలు చేసిందన్నారు. ఆ విధానాన్ని రద్దు చేయాలంటూ తలపెట్టిన మిలీనియం మార్చ్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు విజయకుమార్, ఎస్‌వీ సుబ్బరాజు, సీవీ రమణ, వెంకటసుబ్బయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

# ఘనంగా నంద్యాల టీడీపీ విజయోత్సవం




కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, స్వీట్లు పంచుకుంటున్న టీడీపీ నాయకులు

**కడప, అర్బన్:** నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీ ఘన విజయం సాధించిన సందర్భంగా నగరంలో ఘనంగా విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. స్థానిక మృత్యుంజయకుంటలో 11వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ దేరంగుల శివ, గణేష్‌ల ఆధ్వర్యంలో శ్రీను, రాజశేఖర్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేరంగుల శివ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాల వలన నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి అఖండ విజయం సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ స్థానిక నాయకులు భాస్కర్, బాబు, బాదుల్లా, నగేష్, బాబు రవి, నాని, కిరణ్, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

### కేక్ పంపిణీ

షేక్ నిజామ్ ఆధ్వర్యంలో టీడీపీ నగర అధ్యక్షుడు జిలాని బాష పాల్గొని నంద్యాల విజయోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిలానీ భాష, నిజామ్ మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికల్లో మైనార్టీలందరూ టీడీపీ వైపు నిలిచి భారీ మెజార్టీతో భూమా బ్రహ్మానందరెడ్డిని గెలిపించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి జయకుమార్, జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరి లక్ష్మినారాయణరావు, మైనార్టీసెల్ నగర ప్రధాన కార్యదర్శి మహబూబ్‌పీర్, ఉపాధ్యక్షులు ఖాజాబిలాల్, నాగభూషణ్, కృష్ణయ్య పాల్గొన్నారు. అలాగే స్థానిక రహమతీయ ఫంక్షన్ ప్యాలెస్‌లో నంద్యాల ఎన్నికలో టీడీపీ విజయ దుందుభి మోగించిన సందర్భంగా టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు అమీర్‌బాబుకు స్వీట్లు తినిపించి సంబరం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎండీ నయీమ్, ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు జయకుమార్, గౌసర్‌అలీ, షామీర్‌బాష, మహబూబ్‌పీర్, మహ్మదీ, కె.సుబ్బరాయుడు, అమీర్ బాష తదితరులు పాల్గొన్నారు.

# తాహీర్‌కు బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు

**కడప, మారుతీనగర్ :** సామాజిక సేవలందించిన బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డును కడపకు చెందిన జనవికాస్ సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ తాహీర్ సోమవారం హైదరాబాద్ ఫిల్మ్‌క్లబ్‌లో అవార్డు అందుకున్నారు. నేషనల్ అలైట్ రిపోర్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో ఉత్తమ సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జనవికాస్ సమితి చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి తాహీర్‌ను ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ఏఆర్ఏ జాతీయ అధ్యక్షుడు సురేంద్రబాబు, సౌత్ ఇండియా అధ్యక్షులు కేవీ రమణరావు, సభ్యులు సంపత్‌కుమార్, లయన్ టి.రామసత్యనారాయణ పాల్గొన్నారు.

# రుణాలు పొందిన వారిపై చర్యలు తీసుకోండి : బాధితులు

**కడప, మారుతీనగర్:** తమకు తెలియకుండా తమ పేర్లతో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రుణాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని పులివెందుల మండలం రాజారెడ్డికాలనీ వాసులు జి.నాగమునెమ్మ, లక్ష్మీదేవి, గంగులమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్టీ కులానికి చెందిన తాము పేదవారమన్నారు. తమ ఫోర్జరీ సంతకాలతో రుణాలు పొందారని, తమ అవసర నిమిత్తం రుణ సహాయం పొందేందుకు ఇటీవల కంప్యూటర్ ఆన్‌లైన్‌లో చూడగా ముందే రుణం పొందినట్లుగా తెలియపరచిందన్నారు. కావున ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి వారిని శిక్షించి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్టీలు లక్ష్మీనారాయణ, నారాయణస్వామి పాల్గొన్నారు.

# టీడీపీ గెలుపుపై చిన్నచౌకులో సంబరాలు

- ఎన్టీఆర్ విగ్రహం వద్ద కమ్మ సామాజిక వర్గం హర్షం
- 2019లో కూడా చంద్రబాబే సీఎం: మన్నెం చలపతిరావునాయుడు

**కడప, కోటిరెడ్డిసర్కిల్:** ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి గెలుపు పట్ల కడప నగరం చిన్నచౌకు ఎన్టీఆర్ విగ్రహ స్థాపకుడు, సీనియర్ టీడీపీ నాయకుడు మన్నెం చలపతిరావు నాయుడు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. చిన్నచౌకు కమ్మ సామాజిక వర్గం, టీడీపీ కార్యకర్తలు బాణా సంచా పేల్చి హర్షం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం అభిమానులకు మిఠాయిలు పంచి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా చలపతిరావునాయుడు మాట్లాడుతూ 2019 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ భారీ మెజార్టీతో విజయ ఢంకా మోగిస్తుందన్నారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా టీడీపీదే విజయమని, ఈ రెండు గెలుపులు రానున్న 2019 ఎన్నికలకు నాంది అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాసుల నాయుడు, మాజీ సర్పంచ్ తనయుడు రఘురామయ్య నాయుడు, హరిప్రసాద్ నాయుడు, వెంకటేశ్వర నాయుడు, చంద్రశేఖర్ నాయుడు, నారాయణ నాయుడు, ప్రభాకర్ నాయుడు, రామకృష్ణ నాయుడు, సుబ్బరాయుడు, సుకుమార్ నాయుడు, రవి కుమార్ నాయుడు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చిన్నచౌకు ఎన్టీఆర్ విగ్రహం వద్ద చలపతిరావు నాయుడు ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేస్తున్న స్థానిక నాయకులు

# ఉక్కు నిరాహార దీక్షలకు మద్దతు

**కడప, రవీంద్రనగర్:** ఉక్కు నిరాహార దీక్షలు ప్రారంభమై 53 రోజులు అవుతున్నా అధికార పార్టీ, అధికారులు స్పందించలేదని వైసీపీ 13వ డివిజన్ కార్పొరేటర్ రామలక్ష్మణ్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆర్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉక్కు దీక్షలకు మద్దతుగా సోమవారం 53వ రోజు దీక్షలో కూర్చున్న వారికి పూలమాలలు వేసి మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం వచ్చి 3 ఏళ్లు పూర్తవుతున్నా జిల్లాను నిర్లక్ష్యం చేస్తున్నారని, ఎలాంటి అభివృద్ధి జరగకుండా వివక్ష చూపుతున్నారన్నారు. ఉక్కు పరిశ్రమ స్థాపనకు అన్ని అవకాశాలు జిల్లాకు ఉన్నాయని, అందుకు ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేయాలన్నారు.

ఈ దీక్షలో శంకరయ్య, గుర్రమ్మ, సుబ్రమణ్యం శేషమ్మ, సుబ్బమ్మ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# హమాలీలకు దుస్తుల పంపిణీ



హమాలీలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**కడప, మారుతీనగర్:** పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా జనసేన సేవాదళ్ జిల్లా కోఆర్డినేటర్ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక హబీబుల్లా వీధిలోని శారదా నిలయం కాలేజీ దగ్గర హమాలీలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ సెప్టెంబర్ 2న పవన్‌కళ్యాణ్ జన్మదినమని ఆ మేరకు వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమలో ఆర్టీసీ ఎన్ఎంయూ కడప డిపో నాయకుడు శ్రీనివాసులు, జనసేన సేవాదళ్ కార్యకర్తలు శ్రీకాంత్, శ్రీనివాసులు, గౌస్, మున్నా, అరుణ్, శివ, తోట సుబ్రమణ్యం పాల్గొన్నారు.

# ధ్యాన్‌చంద్‌కు భారతరత్న ప్రకటించాలి : ఒంటేరు

**కడప, స్పోర్ట్స్:** భారత హాకీ లెజెండ్ ధ్యాన్ చంద్‌కు భారతరత్న ప్రకటించాలని ఫీల్డ్ ఆర్చరీ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా ఒలంపిక్ సంఘ సమన్వయకర్త ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ హాకీ చరిత్రలో భారత హాకీ వైభవానికి అలుపెరుగని కృషి చేసి ఒలంపిక్స్‌లో 1928, 32, 36లో భారత జట్టుకు వరుసగా మూడుసార్లు స్వర్ణాలు సాధించి పెట్టిన ధ్యాన్‌చంద్‌కు భారతరత్న ప్రకటించాలని తెలిపారు. ఈ విషయంపై ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడులకు లేఖ రాసినట్లు తెలిపారు.

## చోరీకి గురైన బైకు గండిలో ప్రత్యక్షం

**వేంపల్లె:** వేంపల్లె శ్రీరాంనగర్‌లో చోరీకి గురైన రాజశేఖర్‌రెడ్డి బైకు గండిలో ప్రత్యక్షమైంది. దొంగిలించిన వారు గండిలో వదిలివెళ్లినట్లు స్పష్టమవుతోంది. అయితే ఎందుకు వదిలిపెట్టాడనే విషయం అర్థం కావడం లేదు. ఒకవేళ ఆకతాయిలెవరైనా ఈ పని చేశారా అని అనుమానం వ్యక్తమవుతోంది. 20 రోజుల కిందట శ్రీరాంనగర్ వాసి ఆంజనేయులు బైకు చోరీకి గురై గండిలోనే ప్రత్యక్షమైంది. ఏదిఏమైనా బైకు దొంగలు వేంపల్లెలో సంచరిస్తున్నారనే ప్రచారం బలంగా ఉంది. పోలీసులు ఆ దిశగా దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు. గస్తీని ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది.

# అనుచిత వ్యాఖ్యలే ఓటమికి కారణం




బస్టాండ్ ఆవరణలో టపాసులు పేల్చుతున్న టీడీపీ నేతలు, కార్యకర్తలకు లడ్డు మిఠాయిలు తినిపిస్తున్న శోభన్‌బాబు

**సింహాద్రిపురం:** నంద్యాల ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే రోజా అనుచిత వ్యాఖ్యలతోనే వైసీపీ ఓటమి పాలైందని టీడీపీ మండల అధ్యక్షుడు జోగిరెడ్డి, టీడీపీ నేత రఘునాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నంద్యాల ఉప ఎన్నిక ఫలితాలు వెలువడిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ పరిస్థితుల్లో కాకినాడలో కూడా టీడీపీదే పైచేయి అవుతుందన్నారు. నంద్యాల ఎన్నిక 2019 టీడీపీ ఘనవిజయానికి నాందన్నారు. వైఎస్ జగన్, రోజలు అనుచిత మాటలు చాలించి ప్రజలకు పనికొచ్చే పనులపై దృష్టిపెట్టాలని హితవుపలికారు. శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, గంగిరెడ్డి, శేఖర్ రెడ్డి, కందుల ఓబుళరెడ్డి, ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ నేతల సంబరాలు

నంద్యాల టీడీపీ అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా సింహాద్రిపురం టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యాలయంలో స్వీట్లు తినిపించుకున్నారు. టీడీపీ కార్యాలయం నుంచి భారీగా ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సర్కిల్‌లో టపాసులు పేల్చారు. అనంతరం నంద్యాల భారీ మెజార్టీపై టీడీపీ నేతలు నినాదాలు చేశారు. 2019లో కూడా టీడీపీదే విజయమన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు జోగిరెడ్డి, రఘునాథరెడ్డి, టీడీపీ నేత లు, కార్యకర్తలు హాజరయ్యారు. నంద్యాల ఉప ఎన్నికల ఫలితాల అనంతరం బలపనూరులో ఆనందోత్సాహాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి విజయోత్సవం చేసుకున్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అభివృద్ధే గెలిపించింది

ముఖ్యమంత్రి చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే నంద్యాలలో భారీమెజార్టీతో టీడీపీ గెలిపించాయని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు పేర్కొన్నారు. నంద్యాల ఉప ఎన్నికపై టీడీపీ కార్యకర్తలకు శోభన్‌బాబు లడ్డు మిఠాయిలు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ లేనిపోని మాటలు చెప్పడం ప్రజలు నమ్మలేదని, రాబోయే కాలంలో వైసీపీ కార్యాలయాలు కళ్యాణ మండపాలుగా మార్చుకోవాల్సిందేనన్నారు. తెలుగుదేశం పార్టీలో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేస్తున్నారని, నంద్యాల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ యువజన అధ్యక్షుడు ఆంజనేయులు, నారాయణ, ఈశ్వర్‌రెడ్డి, రాంబాబు కార్యకర్తలు పాల్గొన్నారు.

### వేములలో...

**వేముల:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే నంద్యాల ఉప ఎన్నికలో గెలిపించాయని టీడీపీ నేతలు పేర్ల సత్యమారెడ్డి, పోరెడ్డి విజయశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. నంద్యాల ఉప ఎన్నికలో భారీ మెజార్టీతో టీడీపీ విజయం సాధించడం పట్ల వారు పెద్దఎత్తున బాణసంచా పేల్చుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఓబుళరెడ్డియాదవ్, విద్యాసాగర్‌రెడ్డి, శివరాం పాల్గొన్నారు.

## గండిలో ఘనంగా వినాయక నిమజ్జనం



వినాయక ఊరేగింపులో పాల్గొన్న ఏసీ, ఛైర్మన్, పాలక మండలి, పూజారులు

**చక్రాయపేట:** వినాయక చవితి సందర్భంగా గండి వీరాంజనేయస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని సోమవారం నిమజ్జనానికి తరలించారు. పూజారులు కేసరి, రాజారమేష్, గోపాలస్వామి, రఘువర్మ, ఆలయ ఛైర్మన్ రాజారావు, సహాయ కమిషనర్ గురుప్రసాద్, పాలక మండలి సభ్యులు సుబ్బరాయుడు, వెంకటస్వామి, బాబు, శివశంకర్‌రెడ్డి హారతులు అందుకుని ఊరేగింపు చేపట్టారు. ఉదయం 10 గంటలకు ప్రారంభించిన ఊరేగింపు మధ్యాహ్నం వరకు నిర్వహించారు. దేవాలయం నుంచి భూమానందాశ్రమం తిరిగి రాయచోటి - వేంపల్లె రోడ్డు నుంచి పట్టు గుండు వరకు ఊరేగించి అనంతరం ఎర్రబొమ్మనపల్లె గ్రామం తక్కళ్లపల్లె కాలేటివాగు డ్యాంలో నిమజ్జనం చేశారు. భారీఎత్తున అన్నదానాలు చేశారు. ఈ సందర్భంగా ఏసీ మాట్లాడుతూ ఈ ఏడాది అత్యంత వైభవంగా వినాయక నిమజ్జనం చేయడం, భారీ ఊరేగింపు చేపట్టామని గ్రామస్థులు, భక్తులు ఎంతగానో సంతోషించారన్నారు.

## సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

### ఆవోపా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఆవోపా జిల్లా నేతలు

**వేంపల్లె:** సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు విస్తృతంగా పాల్గొనాలని ఆవోపా జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల వెంకటసుబ్బయ్య, జిల్లా కార్యదర్శి పాలాది వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. వేంపల్లె వాసవీ కళ్యాణమండపంలో వేంపల్లె మండల ఆవోపా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం మాజీ అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా పుల్లగూర గోవర్దన్, కార్యదర్శిగా రాయవరం ద్వారకనాథ్, కోశాధికారిగా దొంతు సతీష్, ఉపాధ్యక్షుడు బైరిశెట్టి సునీల్, పివి రాము, ఉప కార్యదర్శులుగా రాధాకృష్ణ, కృష్ణకిషోర్ ప్రమాణం చేశారు. వీరితో ఉపకోశాధికారులుగా మేడా ప్రదీప్, భరత్, సలహాదారులుగా రమణయ్య గుప్త, ఎవి గుప్త, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రాయవరం సురేంద్ర, కెవి శ్రీను, లక్ష్మిశెట్టి, వెంకటేశం శెట్టి, హరినాథ్, గోపాల్ ప్రమాణం చేశారు. ముఖ్యఅతిథులు మాట్లాడుతూ మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేసేందుకు సమష్టిగా ముందుకెళ్లాలన్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వీరయ్య, రాఘవయ్య, చంద్రశేఖర్, శివరావు, గండి ఛైర్మన్ రాజారావు, మహిళా మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి పట్టం కట్టిన నంద్యాల ఓటర్లు

### వేంపల్లెలో తెలుగు తమ్ముళ్ల సంబరాలు



వేంపల్లెలో సంబరాలు చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్లు

**వేంపల్లె:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు మద్దతుగా నంద్యాల ఓటర్లు తీర్పునిచ్చి టీడీపీకి ఘనవిజయం సాధించిపెట్టారని టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి షబ్బీర్, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ మునిరెడ్డి, దేవస్థాన ఛైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు పేర్కొన్నారు. నంద్యాలలో భారీ మెజార్టీతో టీడీపీ గెలిచిన విషయం తెలుసుకున్న తెలుగుతమ్ముళ్లు స్థానిక కూడలిలో టీడీపీ జండాలు చేతపట్టి నినాదాలు చేశారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుమ్మరాంపల్లె భాస్కర్‌రెడ్డి, తిప్పారెడ్డి, జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి, సాంబశివారెడ్డి, ఎల్వీ ఆర్ భాస్కర్‌రెడ్డి, పివిరమణ, ఎంవీ రమణయ్య, మార్కెట్ యార్డు వైస్‌ఛైర్మన్ దొంతు సుబ్బారావు, జేడీ నాగసుబ్బారెడ్డి, మహేష్‌బాబు, చక్రాయపేట అశోక్, మైనార్టీ నాయకులు మహబూబ్ షరీఫ్, ఎస్‌జెబి జిన్నా, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ రాజేంద్రబాబు, నందిబొచ్చన శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మాజీ ఉపసర్పంచుకు విష్ణు పరామర్శ

**వేంపల్లె:** వేంపల్లె మండలం టి వెలమవారిపల్లె ఉపసర్పంచు శ్రీనివాసులరెడ్డి కుటుంబ సభ్యులను వేంపల్లె సర్పంచు విష్ణువర్దన్ రెడ్డి పరామర్శించారు. శ్రీనివాసులరెడ్డి తల్లి ఇటీవల మృతిచెందడంతో విష్ణు ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి, సాంబశివారెడ్డి తదితరులు ఉన్నారు.

## పైడిపాళెంలో 11 మంది జూదరుల అరెస్టు

**సింహాద్రిపురం:** పైడిపాళెంలో సోమవారం 11 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 11100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## రహదారి సమస్యను పరిష్కరించండి

### తహసీల్దార్‌కు మహిళల వినతి



**వేంపల్లె:** రహదారి సమస్యను పరిష్కరించాలని పలువురు ఇడుపులపాయ మహిళలు తహసీల్దార్ శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు. గ్రామం నుంచి ఇడుపులపాయ కొండలవైపునకు పశువులను మేపు కోసం తీసుకెళ్లాలన్నా, నాగులకట్ట వద్దకు వెళ్లాలన్నా అదేదారి గుండా వెళ్లేవారమన్నారు. ఆ ప్రాంతంలో రైతులు కంప అడ్డుగా వేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆయనకు వివరించారు. రాజశ్రీ, లక్ష్మీదేవమ్మ, రమాదేవి, వెంకటసుబ్బమ్మ తదితరులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆ దారిలో పశువులను తీసుకెళ్లే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, గ్రామంలో పర్యటించి సమస్య పరిష్కరించాలని విన్నవించారు. ఎస్ఐకి ఫిర్యాదు చేయాలని సలహా ఇచ్చారు. గ్రామంలో పర్యటించి సమస్య పరిష్కరిస్తాన ని మహిళలకు తహసీల్దార్ హామీ ఇచ్చారు.

## ఎంఆర్ వ్యాక్సిన్‌తో రెండు జబ్బులు నయం

**దువ్వూరు :** తట్టు, రూబెల్లా వ్యాధుల నుంచి 15 సంవత్సరాల లోపు బాలబాలికలను కాపాడేందుకు ప్రభుత్వం ఎంఆర్ వ్యాక్సిన్ ప్రవేశపెట్టిందని దువ్వూరు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధి లోని నీలాపురం, దాసరిపల్లె, మూడిండ్లపల్లె, చిన్నబాకరాపురం, రాంసాయినగర్, వెంకుపల్లె, ఏకోపల్లెల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో మిగిలిపోయిన పిల్లలకు 212 మంది ఎంఆర్ వ్యాక్సిన్ వేశామన్నారు. సీహెచ్‌వో సుబ్బరత్నమ్మ, టీహెచ్‌ఎన్ మోహనమ్మ, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, శివరామయ్య, మునిస్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాభిప్రాయం తెలుగుదేశం పార్టీ వైపే..

## నంద్యాల గెలుపుపై సంబరాలు జరుపుకున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

**మైదుకూరు :** ఎవరెన్ని చెప్పినా.. విష ప్రచారాలు చేసిన ప్రజలు మాత్రం తెలుగుదేశంపార్టీ వైపే ఉన్నారని పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దాసరి బాబు పేర్కొన్నారు. నంద్యాలలో జరిగిన ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ గెలుపొందడంపై సోమవారం మైదుకూరు పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. రాయల్ సర్కిల్‌లోని శ్రీకృష్ణదేవరాయల్ విగ్రహానికి పూలమాల వేసి సంబరాలు జరుకుకున్నారు. పటాసులు పేల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాసరి బాబు మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడు జగన్ 13 రోజుల పాటు నంద్యాలలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేసినా.. ప్రజలు మూడేళ్లల్లో టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధికి పట్టంగట్టారని ఆయన తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలల్లోనైతం తెలుగుదేశం పార్టీ అఖండ మెజార్టీతో గెలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగసింహా, మార్కెట్ కమిటీ చైర్మన్ బీపీ సుధాకర్‌రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ డైరక్టర్ ఏపీ రవీంద్ర, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుండంరాజు సుబ్బయ్య, కౌన్సిలర్ చెంచురామయ్య, పార్టీ పట్టణ కార్యదర్శి ఎస్‌ఎం షరీఫ్, డీలర్ల సంఘం అధ్యక్షుడు రామచంద్ర, నాయకులు పెద్దయ్య, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

**నంద్యాల గెలుపుపై పలువురు హర్షం :** నంద్యాలలో టీడీపీ విజయంపై తెలుగుదేశం పార్టీ నాయకులు పలువురు హర్షం వ్యక్తం చేశారు. లక్ష్మీమాధవరాయ స్వామి ఆలయం చైర్మన్ ఆకుల క్రిష్ణయ్య, పార్టీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు కొండపల్లి ఉమాకాంత్, పుట్టా సేవా సమితి చైర్మన్ ధనపాల యుగంధర్, మాజీ కిసాన్‌సెల్ అధ్యక్షుడు పిచ్చపాటి వీరారెడ్డి, యస్సీసెల్ నాయకులు శాంతినగర్ ప్రసాద్, పసల బాలసుందరం, మైనార్టీ నాయకులు నాయబ్, దాదా పీర్, అమీర్,షబ్బీర్ తదితరులు వేర్వేరు ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

**ముస్లిం మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో....:** నంద్యాల గెలుపుపై తెలుగుదేశంపార్టీ ముస్లిం మైనార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కడప రోడ్డులో మైనార్టీ నాయకులు షౌకత్ అలీ తన అనుచరులతో కలసి కేకును కట్ చేసి పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో కూడా తెలుగుదేశం పార్టీ గెలుపు ఖాయమని పేర్కొన్నారు.

### దువ్వూరు మండల వ్యాప్తంగా సంబరాలు

**దువ్వూరు :** నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి గెలుపు పట్ల మండల వ్యాప్తంగా టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ప్రభు త్వం చేస్తున్న అభివృద్ధి పనులు, భూమా కుటుంబం పట్ల సానుభూతి ద్వారా నం ద్యాల ప్రజలు తెలుగుదేశానికి పట్టం కట్టారన్నారు. దువ్వూలో ప్రధాన రహదారిపై పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ అందె శ్రీనివాసులు, టీడీపీ నాయకులు బాణసంచా పేల్చి స్వీట్లు పంచారు. గుడిపాడులో సహకార పరపతి సంఘం చైర్మన్ తుమ్మల మస్తాన్‌రెడ్డి బాణసంచా పేల్చి సంబరాలు చేశారు. టీడీపీ నాయకులు సురేష్‌యాదవ్, ఆశీర్వాదం, ఇస్మాయిల్ షాషా, మైనార్టీ అధ్యక్షుడు కుంపటి ఖాజాపీర్, వీరారెడ్డి, భూమా సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. మీర్జఖాన్‌పల్లెలో ఎంపీటీసీ లక్షుమయ్య బాణసంచా పేల్చి హర్షం వ్యక్తం చేశారు.


మైదుకూరులో రాయల్ విగ్రహానికి పూలమాల వేసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నేతలు


విజయోత్సవ కేక్ కట్ చేస్తున్న టీడీపీ ముస్లిం మైనార్టీనాయకులు


జీ.వి.సత్రంలో బాణాసంచా కాల్చుతున్న నేట్లపల్లి, అనుచరులు


చాపాడులో స్వీట్లు పంతున్న టీడీపీ నాయకులు


దువ్వూరులో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

### 2019 ఎన్నికలకు నంద్యాల విజయమే నాంది

**మైదుకూరు రూరల్ :** 2019 ఎన్నికలకు నంద్యాల ఉన్న ఎన్నికల ఫలితాలు నాంది అని మైదుకూరు మండల టీడీపీ అధ్యక్షుడు నేట్లపల్లి మల్లిఖార్జున్‌యాదవ్ పేర్కొన్నారు. . సోమవారం మండలంలోని జీ.వి.సత్రంలో మల్లిఖార్జున్‌యాదవ్ తన అనుచరులతో కలిసి బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. అలాగే మండలంలోని వనిపెంట గ్రామంలో సిండికేట్‌బ్యాంకు చైర్మన్ చీకిరి వెంకటసుబ్బయ్య అనుచరులు బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెరుగు వీరరాఘవ, శివక్రిష్ణ,నరసింహా, రంతుమియ్యా, సింహం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ నాయకుల, కార్యకర్తల సంబరాలు

**చాపాడు:** నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి గెలువడంతో భద్రిపల్లె గ్రామం వద్ద జాతీయ రహదారిపై సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంపిణీ చేశారు. మైదుకూరు టీడీపీ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ జిందాబాద్, ముఖ్యమంత్రి చంద్రబాబు జిందాబాద్ అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, మండల తెలుగుయువత అధ్యక్షుడు నారపురెడ్డి మాట్లాడుతూ నంద్యాలలో ప్రజలు టీడీపీకి బ్రహ్మరథం పట్టారన్నారు. కాకినాడలో కూడా నగర పాలక సంస్థ ఎన్నికల్లో టీడీపీ విజయదుందుభి మోగిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షుడు నాగరాజు, టీడీపీ నాయకులు వీరనారాయణయాదవ్, శ్రీనివాసులరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

**చాపాడు :** ప్రస్తుతం వర్షాకాలం గొర్రెల పెంపకందారులు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని జిల్లా గొర్రెల విభాగం సంయుక్త సంచాలకులు శారదమ్మ అన్నారు. సోమవారం చాపాడులోని పశువైద్యశాలను ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలకరి వర్షాలకు మొలకెత్తిన పచ్చిగడ్డిని గొర్రెలు తింటే వాటికి చిటుక వ్యాధి వస్తుందన్నారు. పారుడువ్యాధి, గిట్టకుండ్లు వంటి వ్యాధులు కూడా వస్తాయన్నారు. దీంతో గొర్రెలు చనిపోయే అవకాశం ఉందన్నారు. యజమానులు నష్టపోకుండా ఉండేందుకు గొర్రెలకు టాకాలను వేయించాలన్నారు. గొర్రెలను ఎక్కువసేపు తడినేలల్లో ఉంచవద్దన్నారు. గొర్రెలకు వ్యాధులు సోకగానే దగ్గరలోని పశువైద్య అధికారులను సంప్రదించాలన్నారు. చిన్నవరదాయపల్లె గ్రామంలో 361, సోమాపురం గ్రామంలో 325 గొర్రెలకు గాలికుంటు టీకాలు వేసినట్లు పశువైద్య అధికారిణి గీతాప్రియ తెలిపారు.

## డ్రోన్ కెమెరాతో చెక్‌డ్యాంల గుర్తింపు

**చాపాడు:** మండలంలోని పలు గ్రామాల వద్ద వంకల్లో నిర్మించిన చెక్‌డ్యాంలను డ్రోన్ కెమెరా ద్వారా ప్రైవేటు ఏజెన్సీ వారు సోమవారం గుర్తించారు. ప్రభుత్వం చెక్‌డ్యాంల నిర్మాణంపై జరిగిన అభివృద్ధిని ఫొటోలు తీసి డ్రోన్ల ద్వారా సమాచారం సేకరిస్తోంది. సోమవారం మైదుకూరుకు చెందిన ముగ్గురు ప్రైవేటు వ్యక్తులు చెక్‌డ్యాంల ఫోటోలను తీశారు. ఈ ఫోటోలను ప్రభుత్వానికి పంపుతున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, తెలుగుయువత అధ్యక్షుడు నారపురెడ్డి తెలిపారు. కేతవరం, భద్రిపల్లె, సోమాపురం, మొరాయిపల్లె, చియ్యపాడు, తదితర గ్రామాల వద్ద 25 చెక్‌డ్యాంలను నిర్మించారు. కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. వీటి సమాచారాన్ని ప్రైవేటు ఏజెన్సీవారు సేకరిస్తున్నారు.


డ్రోన్ కెమెరాను ఉపయోగిస్తున్న దృశ్యం

## ఘనంగా గణేష్ నిమజ్జనం

**ఖాజీపేట:** వినాయక చవితి సందర్భంగా ఖాజీపేట బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహన్ని సోమవారం నిమజ్జనానికి భారీ ఊరేగింపుతో తరళివచ్చారు. రంగులు చల్లుకుంటూ టపాసులు పేలుస్తూ సంబరాలతో భక్తులు తరళివెళ్లారు. నిమజ్జనం అనంతరం భక్తులు స్నానాలు చేసి భక్తి భావంతో తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**బ్రహ్మంగారిమఠంలో..:** గణేష్ ఉత్సవాల్లో బాగంగా సోమవారం మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి నివాసగృహం వద్ద నెలకొల్పిన అభయ విఘ్నేశ్వర స్వామి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. కసాపురం డ్రమ్స్‌తో యువకుల కేరింతలు, మహిళలు ఉత్సాహంతో గ్రామంలోని పెద్దలందరూ ఊరేగింపులో పాల్గొన్నారు. ఉదయం స్వామికి పూజలు నిర్వహించిన అనంతరం యవకులు ఉత్సాహంతో చిందులు వేస్తూ, కర్రసాములు వంటి విన్యాసాలు, రంగులతో పాతూరు గ్రామం కసాపురం డ్రమ్స్‌తో మార్మోగింది. కార్యక్రమంలో గ్రామంలోని యువకులు, మహిళలు, పిల్లలు అందరూ పాల్గొన్నారు.


ఖాజీపేటలో వినాయకుడి నిమజ్జన ఊరేగింపు


కసాపురం డ్రమ్స్‌తో చిందులు వేస్తున్న యువకులు

## నర్సరీలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి


నర్సరీలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు

**మైదుకూరు రూరల్ :** మైదుకూరు మున్సిపాలిటీ, మండలంలోని ప్రతి నర్సరీకి రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఉద్యానవనశాఖ అధికారి ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉద్యానవన శాఖ అధికారులు మండలంలోని రిజిస్ట్రేషన్ లేని నర్సరీలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వం 2010లో నర్సరీలను ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రతి నర్సరీకి రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని, లేని పక్షంలో వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కె.వీ.కె.శాస్త్రవేత్త సందీప్‌కుమార్, కార్తీక్‌లు పాల్గొన్నారు.

## టీడీపీ విజయం వైసీపీకి గుణపాఠం కావాలి

**ఎర్రగుంట్ల:** నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి అత్యధిక మెజార్టితో గెలవడం వైసీపీకి గుణపాఠం కావాలని టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సి.జయప్రకాష్‌నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి, వయసులో పెద్దవాడైన నారాచంద్రబాబు నాయుడును ప్రతిపక్షనేత మర్యాదలేకుండా విమర్శించడాన్ని ప్రజలు జీర్ణించుకోలేదని, తగిన రీతిలో గుణపాఠం చెప్పారన్నారు. గెలుపు టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందన్నారు.

# బై..బై బొజ్జగణపయ్య.. సల్లంగ చూడవయ్య

## ఘనంగా వినాయక నిమజ్జనం



జమ్మలమడుగులో నిమజ్జనానికి తరలిపోతున్న వినాయక విగ్రహాలు



నిమజ్జనానికి వెళుతున్న గణపయ్యలు



వినాయక విగ్రహం వద్ద లడ్డూ ప్రసాదాన్ని తీసుకుంటున్న పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి

**జమ్మలమడుగు రూరల్:** జమ్మలమడుగు పట్టణంలో సోమవారం కొలువైన వినాయక విగ్రహాలను నిమజ్జనం కోసం ఉత్సవ కమిటీల నిర్వాహకులు నిమజ్జనం కోసం తరలించారు. సోమవారం ఉదయం వినాయక విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. నిమజ్జనానికి ఊరేగింపుతో విగ్రహాలను తరలించారు. ఈ సందర్భంగా భక్తుల కేరింతల మధ్య రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

**ముద్దనూరులో...**

**ముద్దనూరు:** మండల కేంద్రంలో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఐదు రోజులపాటు భక్తి శ్ర ద్ధలతో పూజలు చేశారు. 5వరోజు నిమజ్జనానికి తరలించారు.

**విజేతలకు బహుమతులు**

**జమ్మలమడుగు రూరల్:** జమ్మలమడుగు పట్టణంలోని నాగులకట్ట రెండవ లైన్‌లో వినాయక చవితి పండుగ పురష్కరించుకుని వినాయక విగ్రహాన్ని కొలువుచేశారు. గణపతి ఉత్సవకమిటీ వారు, స్థానికులు ప్రత్యేక పూజ లు చేసి మొక్కుకున్నారు. అందులో భాగంగా సోమవారం ఉదయం విగ్ర హం వద్ద మాజీ మండల అధ్యక్షులు పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. లడ్డూ వేలం పాట రూ.28 వేలకు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం నిర్వహిం చిన ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రతి ఒక్కరూ గణపయ్య ఉత్సవాల్లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఐర్మన్ రమణారెడ్డి దంపతులు, వాణిజ్య విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ వారు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

**తిప్పలూరు వంకలో నిమజ్జనం**

**ఎర్రగుంట్ల:** వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనాలు నాలుగో రోజు కూడా జోరుగా సాగాయి ఎర్రగుంట్ల నగరపంచాయతీ నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వాటిని ట్రాక్టర్స్‌లో తిప్పలూరు వంకకు తరలించి నిమజ్జనం చేశారు. చెక్కభజనలతో, కోలాటాలతో డప్పులతో డ్యా న్సులు వేసుకుంటూ, రంగులు వేసుకుంటూ నిమజ్జనానికి తీసుకెళ్లారు. అయితే నాలుగురోడ్ల కూడలి వద్ద చెక్కభజన వద్ద వాదులాడుకుంటున్న వారిని పోలీసులు పంపివేశారు. తిప్పలూరు వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన కేంద్రంలో ఇప్పటి వరకు ఎర్రగుంట్ల పరిధిలో 120 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు పోలీసులు తెలిపారు.



నిమజ్జనానికి ట్రాక్టర్లలో తరలిస్తున్న వినాయక విగ్రహాలు

## అభివృద్ధికే పట్టం కట్టిన నంద్యాల ప్రజలు

**జమ్మలమడుగు రూరల్:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధికే నంద్యాల ప్రజలు టీడీపీకి భారీ మెజార్టీతో అధికారం కట్టబెట్టారని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం సా యంత్రం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. పట్టుదల, కృషితో సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు మంచి పాలన అందిస్తున్నారన్నారు. అభివృద్ధిని గమనించిన ప్రజలు ముఖ్యమంత్రి చేస్తున్న కృషికి నంద్యాలలో ప్రజలు టీడీపీకి అధికారం ఇచ్చారన్నారు. చంద్రబాబుపై ఉన్నటువంటి నమ్మకమే ఇందుకు కారణమన్నారు. 2019లో కూడా టీడీపీదే అధికారమని తెలిపారు.

## అంబేద్కర్, ప్రకాష్‌నగర్ విద్యార్థులకు రవాణా కష్టాలు

**ఎర్రగుంట్ల:** ఎర్రగుంట్ల ప్రొద్దుటూరు బైపాస్ వైజంక్షన్‌కు సమీపంలో ఉన్న అంబేద్కర్ నగర్, ప్రకాష్‌నగర్ హైస్కూల్ విద్యార్థులకు రవాణా కష్టాలు అధికమయ్యాయి. ఆయా ప్రాంతాల్లో ఎక్కువగా పేదవిద్యార్థులు ఉన్నారు. దీంతో స్థానిక నాపరాయి పరిశ్రమలకు వచ్చే రాళ్ల ట్రాక్టర్లపై ఆధారపడుతున్నారు. రాళ్లు అన్‌లోడ్ చేసి తిరిగి వెళ్లే సమయంలో ట్రాక్టర్స్‌లో రాణివనం, బాలికల హై స్కూల్‌కు వెళుతున్నారు. వీరికి బస్సు సౌకర్యం ఉంది. అయితే ఫ్రీ పాస్‌లు ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు. ఫ్రీపాస్‌లు ఇప్పించాలని కోరుతున్నారు. ఈవిషయంపై ఎంఈవో బాలశౌరమ్మను అడుగగా ఆర్టీసీ వారి నిబంధనలను తెలుసుకుని ప్రయత్నిస్తామన్నారు.



ట్రాక్టర్‌లో వెళుతున్న విద్యార్థులు

### హలో.. ఆంధ్రజ్యోతి (Hello Andhra Jyothi)

● మీ సమస్యలుంటే ఈ కింది నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు.

- ఎర్రగుంట్ల - 9441112349
- ముద్దనూరు - 8099575259
- జమ్మలమడుగుటౌన్ - 9948300003
- జమ్మలమడుగురూరల్ - 9848855313
- మైలవరం - 9912265711
- పెద్దముడియం - 9494835608
- కొండాపురం - 9440941345

### సినిమా గైడ్

జమ్మలమడుగు

| | |
|---|---|
| టీపీఆర్: | జయజానకి నాయకి |
| టీఎన్ఆర్: | ఫిదా |
| సాయిరాం : | నేనే రాజు నేనే మంత్రి |

## జమ్మలమడుగులో టీడీపీ సంబరాలు



జమ్మలమడుగులో టపాసులు పేల్చుతున్న నాయకులు

**జమ్మలమడుగు రూరల్:** కర్నూలుజిల్లా నంద్యాలలో సోమవారం జరిగిన ఓట్ల లెక్కింపులో టీడీపీ ఘన విజయం సాధించింది. భూమా బ్రహ్మానందరెడ్డి వైసీపీ అభ్యర్థిపై 27,456 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు స్థానిక నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఆదినారాయణరెడ్డి వర్గం నేతలు పాత బస్టాండులో టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు వైస్‌ఛైర్మన్ మూలింటి గురప్ప, మాజీ కౌన్సిలర్ ప్రదీప్ శ్రీను, డ్రైవర్ శ్రీనివాసులు, నాగార్జునరెడ్డి, దేవగుడి చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధే తమ ధ్యేయం

**వీరపునాయునిపల్లె :** మండలంలోని పాయసంపల్లె 24 గంటల ఆసుపత్రి అభివృద్ధే తమ ధ్యేయమని గ్రామ సర్పంచు వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు తాను శక్తివంచనలేకుండా కృషిచేస్తానన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించి మందుల కొనుగోలు, పరికరాలు, ఆసుపత్రిలో సౌకర్యాలు, ఆవరణాన్ని శుభ్రం చేయుట, లైట్లు, మంచినీటి సరఫరాకు సంబంధించిన వాటిపై ప్రతిపాదించగా కమిటీ సభ్యులు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గిరిధర్, కమిటీ చైర్మన్ ఓబుళరెడ్డి, సభ్యులు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికే ఓటర్లు పట్టం కట్టారు

**వీరపునాయునిపల్లె :** నంద్యాల ఉప ఎన్నికల్లో ఓటర్లు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన అభివృద్ధికే ఓటర్లు టీడీపీకి పట్టం కట్టారని ఎంపీపీ నర్రెడ్డి ప్రసాదరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డిలు అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి 27వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించడం వలన మండల ప్రజలు, కార్యకర్తలు ఆనందంతో స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం టీడీపీ కార్యాలయ ప్రాంగణంలో టీడీపీ కమలాపురం ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి సహకారంతో ఎంపీపీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు భారీఎత్తున బాణసంచాలు పేల్చుతూ విజయోత్సవాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు అడవిచెర్లోపల్లె ఓబయ్యయాదవ్, తిరుమల్‌రెడ్డి, మాజీ దేవస్థాన చైర్మన్ మురళీధర్‌రెడ్డి, సంజీవరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, పాయసంపల్లె సర్పంచు వెంకటరమణారెడ్డిలు పాల్గొన్నారు.

### చెన్నూరులో..

**చెన్నూరు :** నంద్యాల ఉపఎన్నికలలో అపూర్వ మెజారిటీ రావడంపట్ల కడప మార్కెట్ కమిటీ చైర్మన్ ఐ.శివారెడ్డితోపాటు మండల టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక బస్టాండ్ కూడలి వద్ద ఎంపీడీవో కార్యాలయం వద్ద మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కె.విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నేతలు బుజ్జన్న, ఆకుల ప్రసాద్‌బాబులు అందరికి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ ఇది ప్రజా విజయమన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చెంగలవెంకటసుబ్బయ్య, షబ్బీర్, ఖాజా హుస్సేన్, గౌస్‌పీర్, కటారివీరన్న, రవి, కె.వి.సుబ్బారెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డితోపాటు పలువురు మైనారిటీ నేతలు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే స్థానిక బస్టాండ్‌లోని టీ హోటల్ యజమాని గున్నబాషా నంద్యాల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలవడం పై స్థానిక ప్రజలకు ఉచితంగా టీ, వడలు, బిస్కెట్లు పంచిపెట్టారు.

### సీకేదిన్నెలో..

**సికె.దిన్నె :** నంద్యాలలో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించడంతో మండలంలో టీడీపీ సంబరాలు చేసుకుంది. అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టారని నాయకులు తెలిపారు. మండలాధ్యక్షుడు డివి.సుబ్బారెడ్డి మండల ఇన్‌చార్జ్ టక్కోలి వెంకటకృష్ణారెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ గంధంమోహన్‌బాబుల ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. మండల నాయకులు శివశంకర్, దర్బార్, నజీర్, నర సింహులు, రాజా, బ్రహ్మారెడ్డి, రెడ్డన్న, విశ్వనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### వల్లూరులో..

**వల్లూరు :** నంద్యాలలో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించడంతో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు గాంధీ విగ్రహం వద్ద బాణా సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో దిగువపల్లె శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, మనోహర్, చిట్టిబాబు, రాఘవలు పాల్గొన్నారు.

### పెండ్లిమర్రిలో.

**పెండ్లిమర్రి :** నంద్యాల అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించిన సందర్భంగా టీడీపీ నేతలు బాణా సంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల ప్రజలు అభివృద్ధిని చూసి ఓటేసారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ గంగిరెడ్డి, పార్టీ నేతలు రఘునాథరెడ్డి, విజయసారథిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.





చెన్నూరు మిఠాయి తినిపిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఐ.శివారెడ్డి, వల్లూరులో సంబరాలు చేసుకుంటున్న యువత, వీరపునాయునిపల్లెలో విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

## జై బోలో గణేష్ మహరాజ్‌కీ



వినాయక గ్రామోత్సవం

**కమాలపురం రూరల్ :** జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటు భక్తులు వినాయకునికి ఊరేగింపు నిర్వహించారు. స్థానిక చావిటి దగ్గర వినాయక పండుగ పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి సోమవారం సాయంత్రం కుందునదిలో ఘనంగా నిమజ్జనం చేశారు. కమాపురం పట్టణంలోని పడమటి వీధి, పొట్టి శ్రీరాముల వీధి, రామాపురం, అప్పయపల్లి, చిన్నచెప్పలి తదితర గ్రామాలలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలలో పురవీధుల గుండా బానాసంచా మేళ తాలాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కుందునదిలో నిమజ్జనం నిర్వహించారు.

**అన్నదానం :** మండల పరిధిలోని గంగవరం చిన్నచెప్పలి కమలాపురం నందు వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసూఇన వినాయకుని నిమజ్జనం సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## నేడు సర్వసభ సమావేశం

**వల్లూరు :** మండల సర్వ సభసమావేశం మంగళవారం జరుగుతుందని ఎంపీడీవో సాంబశివారెడ్డి తెలిపారు. మండలాధ్యక్షురాలు పిచ్చమ్మ ఆధ్వర్యంలో జరుగు సర్వసభ్య సమావేశానికి అధికారులు, సర్పంచులు హాజరు కావాలన్నారు.

హలో.. ఆంధ్రజ్యోతి (Hello Andhra Jyothi)

మీ ప్రాంతంలో ఉన్న సమస్యలు తెలపాలన్నా, ఇతరత్రా సమాచారం ఇవ్వాలన్నా 'ఆంధ్రజ్యోతి'ని ఈ క్రింది నెంబర్లలో సంప్రదించండి.

| | |
|---|---|
| కమలాపురం రూరల్ | 9618839425 |
| వల్లూరు | 7989554548 |
| పెండ్లిమర్రి | 9550811311 |
| వీఎన్‌పల్లె | 9490987063 |
| సీకే దిన్నె | 9866078351 |
| చెన్నూరు | 9966813830 |

సినిమా గ్రైడ్

| కమలాపురం | |
|---|---|
| ప్రదీప్ | : శమంతకమణి |
| **చెన్నూరు** | |
| కృష్ణ | : నేనే రాజు నేనే మంత్రి |

ముండ్లపల్లె టీడీపీ నేత కుటుంబానికి

## పుత్తా పరామర్శ

**చెన్నూరు :** గుండెపోటుతో మృతి చెందిన మండలంలోని ముండ్లపల్లెకు చెందిన అల్లాడు రాజారెడ్డి(75) మృతదేహాన్ని సోమవారం కమలాపురం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. అల్లాడు రాజారెడ్డి దేశంనేత పుత్తాకు వరసకు మామగా బంధువైనా ఆ గ్రామంలో టీడీపీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేయడం జరిగింది. అలాగే ఎన్నికల సమయంలో టీడీపీ అభ్యర్థుల విజయానికి ఎంతో కృషి చేశారు. కార్యక్రమంలో దేశం నేతలు అల్లాడు రాజశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న దేశంనేత పుత్తా

## జర్నలిస్టుల పై దాడులు ఆపాలి

**కమలాపురం రూరల్ :** జర్నలిస్టులకు భద్రత కల్పించాలని స్థానిక విలేకరులు తెలిపారు. సోమవారం చెన్నూరు విలేకరులపై జరిగిన దాడికి నిరసనగా నల్లబ్యాడ్జీ ధరించి తహసీల్దార్ రామమోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విది నిర్వహణలో ఉన్న చెన్నూరు విలేకరులపై దాడులు చేయటం దుర్మార్గం అన్నారు. వినాయక ఉత్సవాలలో ఏర్పాటు చేసిన నృత్యాలను పోలీసుల దృష్టికి తీసుకెల్లారని ఆ పోహంతో దాడులు చేయటం మంచి పద్ధతి కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్, రఫీ, రఘురెడ్డి, జయచంద్ర, శివరామశర్మ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం




చెన్నూరు కెవోఆర్‌లో, వల్లూరు లింగాయపల్లెలోని గణనాథుల ఊరేగింపు దృశ్యాలు

## గరుడ వాహనంపై శ్రీరంగడు



**పులివెందుల టౌన్:** పట్టణంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న నూలుపూజ పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీరంగనాథ స్వామి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కృష్ణరాజేశ్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు జరిపించారు. గరుడ వాహనంపై ఉన్న స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# సమన్వయంతో మండల అభివృద్ధి

**సింహాద్రిపురం:** ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పనులు చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఎంపీపీ కొమ్మా సుహాసిని అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో వ్యవసాయాధికారి బాలగంగాధర్‌రెడ్డి ఆ శాఖలోని పథకాలను వివరించారు. పంట నమోదును వందశాతం పూర్తిచేసేందుకు ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న వందశాతం సబ్సిడీ పథకాలను వివరించారు. సీడీపీఓ రమాదేవి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు పక్కాభవనాలకు 43 కేంద్రాలకు ఏడు మాత్రమే ఉన్నాయన్నారు. ఎంఈఓ రవిశంకర్ మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది బాగా పెరిగిందన్నారు. పాఠ్యపుస్తకాల పంపిణీ వందశాతం జరిగిందన్నారు. మండలంలో పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం ఉందన్నారు. డాక్టర్ మల్లికార్జునయ్య మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొక్కల పెంపకానికి తగిన వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఎంఆర్ వ్యాక్సిన్ 90శాతం పూర్తిచేశామన్నారు. సింహాద్రిపురానికి చిత్రావతి తాగునీటి సమస్య పూర్తిగా నెలకొందని ఎంపీటీసీ పద్మావతి, మైనార్టీ కోఆప్షన్ సభ్యులు ముల్లా ముజఫర్ రెహ్మాన్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల పది రోజులు నీరు రాకపోవడంతో చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఏపీఎం వెంకటరామిరెడ్డి, ఏపీఓ విజయభాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి, (అంతర్ చిత్రంలో) హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోంది. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో వెల్లడించిన అంశాల్లోకెళితే....

**తొండూరు**

?: ప్రభుత్వ పాఠశాలల్లో విద్య ఎలా ఉంది

!: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యనందిస్తున్నాం.

?: ఉత్తీర్ణతశాతం పెంచేందుకు తీసుకునే చర్యలు

!: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉత్తీర్ణత పెంచేందుకు స్టడీఅవర్స్, నైట్‌విజన్ తదితర ఏర్పాట్లు చేస్తున్నాం.

?: మధ్యాహ్న భోజనం సక్రమంగా అందుతోందా

!: విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించేలా ఆదేశాలిస్తున్నాము. అప్పుడప్పుడు తనిఖీ చేస్తున్నాం. వారానికి మూడుసార్లు గుడ్లు ఇస్తున్నాం.

?: ఎన్ని పాఠశాలలు ఉన్నాయి? ఎన్ని మూతపడ్డాయి

!: మండలంలో 31 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో మడూరులో ఒక పాఠశాల మూతపడింది. మండలంలో విద్యార్థులు తక్కువగా ఉండటంతో ఏడుగురు ఉపాధ్యాయులను మరో ప్రాంతానికి పంపారు.

?: ప్రభుత్వ పాఠశాలలకు ఎన్నింటికి ప్రహరీ లేదు

!: మండలంలో ఒక పాఠశాల మినహా అన్ని పాఠశాలలకు ప్రహరీ గోడలున్నాయి.

?: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందాయా

!: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఒకరిద్దరికి మినహా మొత్తం అందరికీ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశాం.

**వెంకటరామిరెడ్డి, ఎంఈఓ, తొండూరు.**

## నంద్యాల విజయంపై సంబరాలు

### 2019లో పులివెందులలో టీడీపీ జండా ఎగురవేస్తాం



పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నేతలు



పార్టీ కార్యాలయంలో స్వీట్లు తినిపించుకుంటున్న టీడీపీ నేతలు

**పులివెందుల టౌన్:** కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి విజయం సాధించడం పట్ల పులివెందులలో టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పురవీధుల్లో కొత్త బస్టాండ్, పాతబస్టాండ్, పూలంగళ్ల మీదుగా బైకు ర్యాలీ నిర్వహించారు. పూలంగళ్ల సర్కిల్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికల్లో అభివృద్ధికే పట్టం కట్టారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తోంటే ప్రతిపక్షనేత వైఎస్ జగన్, అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. వైఎస్ జగన్‌కు నంద్యాల ప్రజలు సరైన పద్ధతిలో బుద్ధిచెప్పారన్నారు. ఇప్పటికైనా చంద్రబాబునాయుడిపై లేనిపోని ఆరోపణలు మానుకుని రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని హితవుచెప్పారు. 2019 ఎన్నికల్లో కూడా తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు. సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పులివెందులలో టీడీపీ జెండా రెపరెపలాడిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ తూగుట్ల రాఘవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాష, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ తూగుట్ల మధుసూధన్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు కొమ్మెర హరినాథ్, మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, పుచ్చా ప్రసాదరెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్లు ఉన్నతి కృష్ణారెడ్డి, గంగాదర్‌రెడ్డి, విజయకుమార్, టి బాష, మునెయ్య తదితర టీడీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సునందనరావు ప్యానల్ విజయం

### హౌసింగ్‌లో తొమ్మిది డైరెక్టర్ల స్థానాలు కైవసం



విజయోత్సాహంలో సునందనరావు ప్యానల్

**పులివెందుల టౌన్:** రాష్ట్ర ప్రభుత్వ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికల్లో సునందనరావు ప్యానల్ ఘన విజయం సాధించింది. సోమవారం బొగ్గుడుపల్లె సొసైటీ కార్యాలయంలో ఎన్నికల అధికారి కొండారెడ్డి, సహాయ ఎన్నికల అధికారి మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికలో గురుప్రసాద్ ప్యానల్, సునందనరావు ప్యానల్ అభ్యర్థులు పోటాపోటీగా తలపడ్డారు. సునందనరావు ప్యానల్ ఘన విజయం సాధించింది. మొత్తం 142 ఓట్లు ఉండగా, 128 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 12ఓట్లు చెల్లవని గుర్తించారు. మిగిలిన ఓట్లలో మొత్తం 9 డైరెక్టర్ స్థానాలను సునందనరావు ప్యానల్ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించారు. హౌస్ బిల్డింగ్ అధ్యక్ష, ఆఫీస్ బేరర్లు అందరు సునందనరావు ప్యానల్‌కు దక్కనుంది.

## వ్యాపారుల సౌలభ్యం కోసం పార్శిల్ సౌకర్యం

**పులివెందుల టౌన్:** వ్యాపారుల కోసం సరుకులు త్వరితగతిన గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీలో పార్శిల్ సౌకర్యం కల్పిస్తామని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ అజంతుల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక బస్టాండ్ వద్ద కొత్తగా ఏర్పాటుచేసిన ఆర్టీసీ పార్శిల్ కొరియర్ కార్యాలయాన్ని డీఎం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్శిల్ సర్వీస్ ద్వారా వివిధ ప్రాంతాలకు త్వరగా కొరియర్ పంపేందుకు ఏఎన్ఎల్ పార్శిల్ రద్దు చేసి ఆర్టీసీ పార్శిల్ కొరియర్ సర్వీసును ఏర్పాటు చేశామన్నారు. అందులో భాగంగా వ్యాపారులు పార్శిల్స్‌ను ఆర్టీసీ ద్వారా పంపుకోవచ్చన్నారు. బెంగుళూరు, విజయవాడ, చెన్నై, తరుపతి, హైదారాబాద్ తదితర దూర ప్రాంతాలకు తక్కువ సమయంలో పార్శిల్ చేరుతుందన్నారు.

## దివ్యాంగ పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్



అతిథి భోజనం పెడుతున్న దృశ్యం

**వేంపల్లె:** వేంపల్లె భవిత కేంద్రంలోని దివ్యాంగ పిల్లలకు మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్‌ను సోమవారం వేయించారు. ఐఈఆర్టీలు యశోద, రామాంజనేయరెడ్డి దగ్గరుండి వైద్యసిబ్బంది లక్ష్మీదేవితో ఈ టీకాలను వేయించారు. అనంతరం నేలవరం తండా ఉపాధ్యాయులు కామేశ్వర్‌రావు, అమృతవల్లి దంపతులు దివ్యాంగ పిల్లలకు అతిథి భోజనం ఏర్పాటుచేశారు. ఎంఈఓ ప్రభావతి, మెయిన్ స్కూల్ హెచ్‌ఎం వెంకటేశ్ చేతుల మీదుగా ఈ అతిథి భోజనం తెప్పించారు. దివ్యాంగ పిల్లలకు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని ఎంఈఓ పేర్కొన్నారు.

## పశువులకు టీకాలు వేయించాలి : ఏడీ

**వేంపల్లె:** వేంపల్లె పశువైద్యశాఖ సబ్‌డివిజన్‌లోని వేముల, చక్రాయపేట, వేంపల్లె మండలాల్లో పాడిపశువులకు, ఎద్దులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించుకోవాలని ఆ శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులరెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు. 26వ తేదీ నుంచి సెప్టెంబర్ 25వ తేదీ వరకు పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా టీకాలు వేయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వేంపల్లె మండలంలో టీకాలు వేయించే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఈ వ్యాధి వైరస్‌తో గిట్టెలు, నోట్లో పుండ్లు వస్తాయన్నారు. తద్వారా ఆహారం సరిగా తీసుకోకపోవడం, జ్వరం రావడంతో నీరసించి పోతాయన్నారు. పాడిపశువుల్లో పాల దిగుబడి తగ్గి ఆర్థికంగా రైతులు నష్టపోతారని వివరించారు. ప్రతి పశువుకు టీకా వేయించుకోవాలని విన్నవించారు. టీకా వేయిస్తే పాల దిగుబడి తగ్గుతుందని అనుకోవడం అపోహమాత్రమేనన్నారు. ఎలాంటి ఇబ్బంది ఉండదని ఏడీఈ తెలిపారు.